
Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 137 • సోమవారం 28 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 10+12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ సప్తమి రా. 12.34 వరకు, అనంతరం అష్టమి; నక్షత్రం: విశాఖ రా. 9.23 వరకు, అనంతరం అనురాధ; అమృతకాలం: మ. 11.45 నుండి 1.30 వరకు; వర్జ్యం: రా. 1.46 నుండి 3.31 వరకు; దుర్ముహూర్తం: 12.31 నుండి 1.22 వరకు, మ.3.04నుండి 3.55 వరకు, రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 1200 వరకు



సూపర్.. మేవెదర్

- మెగా ఫైట్‌లో ఫ్లోయిడే పైచేయి
- అజేయంగా 50 మ్యాచ్‌లు గెలిచిన తొలి బాక్సర్‌గా రికార్డు
- కానర్ మెక్‌గ్రెగర్‌కు తప్పని ఓటమి

7



సిరీస్ మనదే

- మూడో వన్డేలో కోహ్లీ సేన ఘన విజయం
- సెంచరీతో కదంతొక్కిన రోహిత్ శర్మ

10



వెండి సింధు

ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీలో జొకుహరా చేతిలో ఓటమి వరల్డ్ చాంపియన్ షిప్‌లో సింధుకు ఇది 3వ మెడల్

10

అన్నదాతకు ఆపన్నహస్తం...ఇదే సర్కారు లక్ష్యం

42 మందితో రాష్ట్రీయ రైతు సమన్వయ సమితి

- రేపో, మాపో కేబినెట్ హోదాలో అధ్యక్షుడి నియామకం
- 24 మందితో జిల్లా, మండల సమన్వయ సమితులు
- గ్రామ రైతు సమన్వయ కమిటీల్లో 15 మంది సభ్యులు
- వ్యవసాయ శాఖ ప్రతిపాదనకు సీఎం కేసీఆర్ ఆమోదం
- పక్షం రోజుల్లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశాలు జారీ
- మూడు జిల్లాలకు ఒకరి చొప్పున మంత్రులకు బాధ్యత
- సెప్టెంబర్ 9లోపు జిల్లాల కమిటీ ఏర్పాటు పూర్తిచేయాలి
- నాలుగైదు రోజుల్లో కార్యరంగంలో దూకాలంటూ హుకుం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగంలో పూర్వ వైభవం తీసుకురావడమే కాదు... అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణను సిద్ధం చేసుకుంది. చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచిస్తూ ప్రభుత్వానికి సిపార్సు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను నెలకొల్పబోతున్నారు. రైతు పక్షపాతిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆలోచన మేరకు గత మూడు నెలల కాలంగా వ్యవసాయశాఖ ఉన్నతాధికార యంత్రాంగం కసరత్తు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఎప్పటికప్పుడు రైతుల అవసరాలను తెలుసుకుంటూ, వారికి కావాల్సిన సహాయ, సహకారాలకు అందిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలను ముందుకు నడిపించేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒక పారదర్శక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. అతిత్వరలోనే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు సీఎం కేసీఆర్ ఆదివారం ఆమోదముద్ర వేశారు. రైతు కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సబ్సిడీలు, రాయితీలు

2వ పేజీలో...

కొత్త జిల్లాల మ్యాపుల విడుదల

2



హైదరాబాద్: లలితా జ్యువెల్లరి షోరూంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దంపతులు, చిత్రంలో లలితా జ్యువెల్లరి చైర్మన్ కిరణ్‌కుమార్, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి తదితరులు

భాగ్యనగరంలో లలితా జ్యువెల్లరీ

3

- మంత్రి కేటీఆర్ దంపతుల చేతులమీదుగా పంజాగుట్టలో స్టోర్ ప్రారంభం



హైదరాబాద్: కేంద్ర ఆర్థిక, రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ సమక్షంలో డీఆర్‌డీఓ రూపుదిద్దిన ఆధునిక క్షిపణిని నావికాదళ అధిపతి కరంబీర్ సింగ్‌కు అందజేస్తున్న డీఆర్‌డీఓ చైర్మన్ క్రిస్టోఫర్

భారత వాయుసేనకు ఆధునిక క్షిపణులు

- కేంద్ర ఆర్థిక, రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ

2

ప్రతి జిల్లాలో వైద్య కళాశాల

- కొత్త జిల్లాకు ప్రాధాన్యం
- దశలవారీగా అన్నిజిల్లాల్లో దంత వైద్య కళాశాలలు
- సీఎం కేసీఆర్ కసరత్తు
- వచ్చేఏడాది 10 కాలేజీలు
- అనుబంధ ఆస్పత్రులు
- మరో ఎయిమ్స్ ఏర్పాటు
- పేదలకు ఆధునిక వైద్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైద్య విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తున్న ప్రభుత్వం వచ్చే రెండేళ్ళలో కనీసం పదికి పైగా వైద్య, దంత కళాశాలలను ప్రారంభించాలని ప్రతిపాదించింది. నూతన కళాశాలల్లో సగం ప్రైవేటు రంగంలో.. మిగతావి ప్రభుత్వ రంగంలో అనుమతులను మంజూరు చేయా లని ముఖ్యమంత్రి చంద్ర శేఖరరావు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. కొత్త కళాశాలలు పూర్వపు జిల్లాలలో కాకుండా.. కొత్తగా ప్రారంభించిన జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్న అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తమ జిల్లాల్లో వైద్య కళాశాలలను ప్రారంభించాలని ఇప్పటికే కరీం నగర్, సంగారెడ్డి జిల్లాలలో ఆ జిల్లాలకు చెందిన విపక్ష పార్టీల నేతలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేతల ఉద్యమానికి కళ్లెం వేసేందుకు సీఎం కేసీఆర్ తాజాగా కొత్త వైద్య, దంత కళాశాలల అనుమతుల అంశంపై పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. వైద్య, దంత కళాశాల ఏర్పాటుకు భారత వైద్య మండలి(ఎంసీఐ) గతంలో వున్న నిబంధనలను సడలించడంతో కొత్త కళాశాలల ఏర్పాటుకు మార్గం సుగమమైందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సింగరేణి కార్మిక సంస్థ ద్వారా వస్తున్న లాభాలతో పాటు ఆ సంస్థ సంయుక్త సహకారంతో గోదావరి ఖని, మంచిర్యాల, రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి, భూపాలపల్లెలలో వైద్య కళాశాలలను ప్రారంభించాలన్న ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇప్ప టికే హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో ఈఎస్ఐ ఆసుపత్రికి అనుబంధంగా గతేడాది కేంద్ర ప్రభుత్వం వైద్య కళాశాలను ప్రారంభిం చిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లాలలో వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా విద్యా పరంగా ఆ జిల్లాల ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయవచ్చన్న ధీమాతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు, కార్పోరేట్ సంస్థలు ముందుకు వస్తే ఆ సంస్థల అధి పతులు సూచించిన లేదా సిఫార్సు చేసిన వారి పేర్లను కళాశాలలకు పెట్టాలని, కళాశాల ఏర్పాటకయ్యే ఖర్చును ఆయా సంస్థ లు భరిస్తే అనుమతులను తీసుకువచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకునేలా మార్గదర్శకాలను రూపొం దించాలని ప్రభుత్వం ప్రతిపా దించింది. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ కేంద్రాలలో రాజీవ్‌గాంధీ పేరుతో పూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు హైదరాబాద్‌లో ఉస్మానియా, గాంధీ, వరంగల్‌లో కాకతీయ పేరుతో వైద్య కళాశాలల ఎప్పట్నించో పనిచేస్తున్నాయి. వీటికి తోడు మహబూబ్‌నగర్‌లో వెంకటసాయి, వికారాబాద్‌లో మహావీర్, హైదరాబాద్‌లో మెడిసిటీ, అపోలో, దక్కన్, కరీంనగర్‌లో ప్రతిమ, చెల్మెడ, నల్గొండ జిల్లా నార్కట్ పల్లిలో కామినేని, ఖమ్మంలో మమత కళాశాలలు ప్రైవేటు రంగంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల,

3వ పేజీలో...



8

విశ్వాసం పేరుతో హింస చెల్లదు

- డేరా హింసపై ప్రధాని మోదీ హెచ్చరిక
- 30 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో 65వేల కోట్లు
- 67శాతం మందికి టాయిలెట్ల సౌకర్యం
- స్వచ్ఛ్ భారత్‌కు సరికొత్త ఉద్యమం
- మతం ఐక్యతకు దారితీయాలని విజ్ఞప్తి
- జమాత్ ఉలేమా ఏ హింద్‌పై ప్రశంసలు
- యువక్రీడాకారులను ప్రోత్సహించాలి
- మన్ కీ బాత్‌లో నరేంద్రమోదీ పిలుపు



సర్వం స్వాహా

- బెట్టింగ్‌లపై సర్వేల ప్రభావం
- లగడపాటి సర్వేతో స్వరూపం మారిన బెట్టింగులు
- నష్టపోయేది ప్రజలే

వివరాలు 3లో...

డేరా బాబా భూ దందా



- నల్గొండ జిల్లా వెలిమినేడులో 7.24 ఎకరాల అసైన్డ్ భూమి ఆక్రమణ
- ఆర్డీఓ విచారణలో వెల్లడి
- నేడో, రేపో స్వాధీనం

2

గుర్మీత్‌సింగ్‌కు నేడు శిక్ష ఖరారు

- భద్రతా వలయంలో రోహ్‌తక్ జిల్లా
- ఎక్కడికక్కడ తనిఖీలు
- సునరియా జైలు పరిసరాల్లో 144 సెక్షన్.. భద్రత కట్టుదిట్టం



8

భారత వాయుసేనకు ఆధునిక క్షిపణులు

● నూతన యూనిట్లకు శంకుస్థాపన ● కొత్త ఆవిష్కరణలకు దశ, దిశ

● బీడీఎల్‌లో రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర రక్షణ, ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఆదివారం హైదరాబాద్‌లోని బీడీఎల్(భారత్ డైనమిక్స్ లిమిటెడ్)ను సందర్శించారు. పలు ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా పలు యూనిట్లను సందర్శించిన జైట్లీ రక్షణ శాఖకు చెందిన అనేక పరిశోధనల స్థితిగతులను, క్షిపణుల తయారీ అనుసరిస్తున్న అధునాతన పద్ధతులను పరిశీలించారు. తొలుత ఆయన బీడీఎల్‌లోని స్థిర పరీక్షల విభాగాన్ని(స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీ) జాతికి అంకితం చేశారు. రక్షణ ఉత్పత్తుల రంగంలో ఈ యూనిట్ తొలిదని కేంద్రం ఈ సందర్భంగా పేర్కొంది. రాకెట్ మోటార్ల స్థిర పరీక్ష కేంద్రానికి రూ. 48కోట్ల వ్యయం అయినట్లు వెల్లడించారు. క్షిపణుల ప్రయోగానికి 50 టన్నుల బరువైన రాకెట్ మోటార్ల రూపకల్పన, విక్రయాల అభివృద్ధి కార్యకలాపాలకు ఇది మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. దీనికి డీఆర్‌డీఓ అభివృద్ధి ఏజెన్సీగా పనిచేస్తోంది. అదేవిధంగా సౌకర్యాల కల్పనకు విస్తరిస్తున్న రెండో ఫేజ్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం యూనిట్‌లో నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే మధ్యతరహా క్షిపణుల తయారీ, త్వరిత స్పందన ఉపరితల-గగనతల క్షిపణుల తయారీ, పరీక్ష, నిల్వ సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు బిడిఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం 632 ఎకరాలను కేటాయించింది. ప్రణాళిక తయారీకి ప్రత్యేకమైన కాంప్లెక్స్ నిర్మాణం, క్షిపణులను సిద్ధం చేసి, ప్రపంచ స్థాయిలో ఆయుధ వ్యవస్థను ఏకీకృతం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయనున్న ట్లు రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ఈ కొత్త కాంప్లెక్స్‌లో అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇది దేశంలోనే కొత్త శకానికి నాందిగా ఆయన అభివర్ణించారు. ఇది డీఆర్‌డీవో మరియు ఇతర దేశాల రక్షణ సంస్థల సమన్వయంతో పనిచేయనుంద ని, దీనికి రూ. 522 కోట్లను ఖర్చు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ సౌకర్యాల ద్వారా క్షిపణి పరీక్షల భవిష్యత్ అవసరాలు తీరనున్నాయని, డీఆర్‌డీవో ప్రయోగాలకు అనుగుణంగా అభివృద్ధి, ఉత్పత్తి కోసం కృషి చేస్తాయని రక్షణ శాఖ భావిస్తోంది.

బిడిఎల్‌లోనే అదనంగా ఆయుధాల తయారీ యూనిట్‌ను కూడా కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఆదివారం ప్రారంభించారు. డీఆర్‌డీవోచే అభివృద్ధి చేసిన కంటి చూపునకు అందని గగనతలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు, అస్త్ర క్షిపణులు ఇందులో భాగంగా ఉన్నాయి. 110 కిలోమీటర్ల హెడ్‌తో దీనిని నిర్మించారు. వీటిని వాయుసేనలో అధునాతనమైనవిగా రక్షణ శాఖ అభివర్ణిస్తోంది. దీర్ఘశ్రేణి తరహా గగనతల క్షిపణిని భారత నేవీ బలగాలకు దన్నుగా కంద్ర మంత్రి అరున్ జైట్లీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 5 మెగావాట్ల సౌర ఫోటో వోల్టాయిక్ విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. భారత దేశం జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ సోలార్ మిషన్‌లో భాగంగా భువన్‌లోని 5మెగావాట్ల ఎస్‌పివి ప్లాంట్‌ను అభివృద్ధి చేయాలని బీడీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు జాతీయ పవర్ గ్రిడ్‌కు అనుసంధాన మై ఉంది. ఇది ఏడాదికి 8.545 మిలియన్ యూనిట్ల విద్యు దుత్పత్తి చేయనుందని కేంద్రం స్పష్టం చేసింది.ఆదివారం బీడీఎల్ సందర్శనకు వచ్చిన కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీకి బిడిఎల్ సిఎండి వి ఉదయ్ భాస్కర్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రక్షణ ఉత్పత్తుల కార్యదర్శి ఎకె గుప్తా కూడా పాల్గొన్నారు.

కొత్త జిల్లాల మ్యాపులు విడుదల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరిపాలనా సౌలభ్యం, పాలనా వికేంద్రీకరణ, ప్రజల చెంతకు పాలన లక్ష్యంతో రాష్ట్రంలో 31 జిల్లాలను ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం తాజాగా వాటి మ్యాప్‌లను విడుదల చేసింది. పునర్వ్యవస్థీకరణ తర్వాత కొత్తగా ఏర్పడ్డ జిల్లాలతోపాటు మొత్తం 31 జిల్లాలకు చెందిన చిత్రపటాలను సర్కార్ ఆదివారం విడుదల చేసింది. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ రూపొందించిన పటాలను అధికారికంగా వెబ్‌సైట్‌లో చేర్చింది. ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులకు అద్దం పట్టేలా సరిహద్దులు, శాసనసభా నియోజకవర్గాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్‌లు, నదులు, రైల్వే మార్గాలు, జాతీయ, రాష్ట్ర రహదారులు, జల వనరులు, పుణ్య క్షేత్రాలు, ప్రసిద్ధ స్థలాలు, విశిష్టతలను ఈ పటాల్లో పేర్కొన్నారు. గతంలోనే వీటిని రూపొందించినా కొన్ని కారణాలతో తాజాగా విడుదల చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

సింగరేణిపై గులాబీ జెండా ఎగరాలి

కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధులతో ఎంపీ కవిత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణి కాలరీస్‌లో జరిగే గుర్తింపు ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగరాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం తెలంగాణ భవన్‌లో కోల్‌బెల్ట్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ అతిపెద్ద పరిశ్రమ అని, గుర్తింపుసంఘంగా గడచిన నాలుగేళ్ళలో యూనియన్ అనేక విజయాలు సాధించిద న్నారు. చేసిన పనులను కూడా కార్మికులలోకి సరిగా తీసుకెళ్ళలేకపోయామని, వీటిని బలంగా కార్మికవర్గంలోకి తీసుకెళ్ళాలన్నారు. వారతస్వ ఉద్యోగాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రయత్నం చేసినా, విపక్షయూనియన్‌లు కోర్టుకెళ్ళడం వల్ల అది అమలుకు నోచుకోలేద న్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం ఇంకా ప్రయత్నాలు కొనసాగిస్తున్నదని, కార్మికులకు వాస్తవాలు వివరించాలన్నారు. విపక్ష యూనియన్‌ల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఇపుడూ.. భవిష్యత్‌లోనూ టిఆర్ఎస్ ప్రభుత్వమే ఉంటుంది కాబట్టి సింగరేణిలోనూ టిబిజికెఎస్‌ను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను కార్మికవర్గానికి వివరిం చాలన్నారు. సమావేశంలో ఎంపీలు బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతారాంనాయక్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, విప్ నల్లాల ఓదేలు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జలగం వెంకట్రావు, కోరం కనకయ్య, దుర్గం చిన్నయ్యా పాల్గొన్నారు.


తెలంగాణ చిత్ర పరిశ్రమకు వెలుగు తెస్తాం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ చిత్రపరిశ్రమకు బిజెపి అధికారంలోకి వస్తే వెలుగు తెస్తామని, అధికారంలోకి రాకముందు సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపాలన్న కెసిఆర్.. సిఎం కాగానే మాటమార్చారని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. బిజెపి సినిమాసెల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధపోరాటం నేపథ్యంగా తీసిన నైజాం సర్కరోడ చిత్ర నిర్మాత రాజమౌళితో పాటు బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సాయుధపోరాటంపై తీసిన చిత్రం విడుదలకు తెలంగాణ రాష్ట్రంలో ఇబ్బందులు ఏర్పడడం శోచనీయమన్నారు. రజాకార్ల దురాగతాలను కళ్ళకు కట్టినట్లు తీసిన ఈ సినిమాను తెలంగాణ అంతటా ప్రదర్శించేందుకు బిజెపి సహాయ సహకారాలు అందిస్తున్నదన్నారు. సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా జరపాలని, ఇందుకోసం బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచందర్ రావు, సివిఎల్ నరసింహారావు, కరుణాకర్ దేశాయ్ పాల్గొన్నారు.

శోభాయమానంగా గణేశ్ నిమజ్జనం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మూడు రోజుల పాటు తెలుగు వారి పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనం ఢిల్లీలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. సర్వ విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడి వినాయక చవితి వేడుకలు ఆంధ్రప్రదేశ్/తెలంగాణా భవన్‌లో ముగిశాయి. టీమ్ ఏపీ భవన్ ఆధ్వర్యంలో జరిగిన పండుగ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పండితుల ప్రవచనాలు, హరికథా కాలక్షేపాన్ని తిలకించడానికి దేశ రాజధానిలోని పలు ప్రాంతాల నుంచి తెలుగు వారితో పాటు ఉత్తరాది వారూ తరలి వచ్చారు. భవన్ ప్రాంగణంలో కొలువుదీరిన వక్రతుండుడికి మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజాధికాలు నిర్వహించారు. ఆదివారం తెలంగాణా భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ కుటుంబ సమేతంగా పాల్గొని పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రామ్మోహన్, భవన్‌సిబ్బంది, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం గణేష్ విగ్రహదాతలు జి.వి. చారి దంపతులు ఉద్వాసన పూజను జరిపారు. అనంతరం ఘనంగా గణేష్ నిమజ్జన యాత్రను శోభాయమానంగా నిర్వహించారు. ఉమ్మడి భవన్ నుంచి నర్సింగ్ హాస్టల్, పటౌడి హౌజ్, అధికారుల క్వార్టర్స్ మీదుగా ఊరేగింపు సాగింది.

డేరా బాబా భూ దందా

● నల్గొండ జిల్లా వెలిమినేడులో 7.24 ఎకరాల అసైన్డ్ భూమి ఆక్రమణ

● ఆర్డీవో విచారణలో వెల్లడి.. ● నేడోరేపో స్వాధీనం



చిట్యాల, కెఎన్ఎన్: వివాదస్పద ఆధ్యాత్మిక గురువు రామ్‌రహీం గుర్మిత్‌సింగ్ బాబా ఆస్తులు నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో ఉండటంతో ప్రకంపనలు పుట్టుకొస్తున్నాయి. అత్యాచార కేసులో దోషిగా తేలడంతో ఇక్కడి ఆస్తులు ప్రచారంలోకి వచ్చాయి. 2007-2009 వరకు బాబాలుగా రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి 54 ఎకరాల చుట్టూ ప్రహరీగోడ నిర్మించారు. జిల్లాలో 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలిమినేడు సమీపంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో అత్యంత విలువైన 54 ఎకరాల భూమి ఉండటంతో డేరా బాబా పేరు ప్రకంపనలు సృష్టిస్తుంది. ఈ స్థలంలో డేరా స్వచ్ఛ సౌదా పేరుతో ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ భూముల్లో సువూరు 7.24 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు తేలింది. సర్వే నెంబర్ 98లో 3.30ఎకరాలు, 102 సర్వే నెంబర్‌లో 1.22 ఎకరాలు 132లో 2ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇక్కడ శ్యామ్‌లాల్ అనే వ్యక్తి ట్రస్టు మెంబర్‌గా ఉండి నిర్వహణను చేపడుతున్నాడు. సామాజిక సేవ పేరుతో రైతుల నుంచి కారుచౌకగా భూములు కొనుగోలు చేసిన రాంరహీం గుర్మిత్‌సింగ్ ఆగడాలు తెలంగాణలో కొనసాగకుండా ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం పేదలకు పంపిణి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 2002లో ఇద్దరి మహిళలపై లైంగిక దాడి కేసులో దోషిగా సీబీఐ కోర్టు పేర్కొంది. రేప్ కేసులో దోషిగా తేలిన గుర్మిత్‌సింగ్ తనకు తానుగా దేవుని అవతారంగా చెప్పుకోవడం సిగ్గుచేటని పలువురు అసహ్యించు కుంటున్నారు.

డేరా స్వచ్ఛసౌద స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో



వివాదస్పద ఆధ్యాత్మిక గురువు రాంరహీం గుర్మిత్ సింగ్‌బాబాకు చెందిన డేరా స్వచ్ఛ సౌదా స్థలాన్ని నల్లగొండ ఆర్డీవో వెంకటాచారి చిట్యాల తహసీల్దార్ సీహెచ్ విశాలాక్షితో కలిసి ఆదివారం పరిశీలించారు. సంస్థ కొనుగోలు చేసిన 54 ఎకరాల భూమిలో 7.24 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నట్లు తేలినందున ఆయన పరిశీలనకై విచ్చేశారు. స్థలం నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్న శ్యామ్‌లా ల్‌తో మాట్లాడి వివరాలు సేకరించా రు. అసైన్డ్ భూములు ఆక్రమించుకున్న విషయం వాస్తవమేనని ఆర్డీవో విలేకరులకు తెలిపారు. అసైన్డ్ భూములు పొందిన వారు లోపాయ కారిగా సంస్థతో ఒప్పందం కుదుర్చు కొని డబ్బులు పొందారని ఈ విషయాన్ని ఇరువురు ధ్రువీకరించినట్లు ఆర్డీవో వెంకటాచారి చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్డీవో వెంట సీఐ పాండురం గారెడ్డి, ఆర్ఐ పృథ్వీ, వీఆర్వో బొడిగె యాదయ్య తదితరులున్నారు. అనంతరం చిట్యాల తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసి స్వచ్ఛదేరా భూముల మ్యాప్‌ను ఆయన పరిశీలించారు.

42 మందితో రాష్ట్రీయ రైతు సమన్వయ సమితి


(మొదటి పేజీ తరువాయి)

అందించాలన్నా సంబంధిత పథకాలను ఈ కమిటీల పర్యవేక్షణలోనే కార్యరూపంలోకి తీసుకువస్తారు. సీఎం ఆమోదించిన ప్రతిపాదనల ప్రకారం 42 మంది సభ్యులతో రాష్ట్రీయ రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర కేబినెట్ హోదాలో రాష్ట్ర సమితి అధ్యక్షుణ్ణి నియమించనున్నారు. ఈ పదవికి పోటీ పడుతున్న వారిలోంచి కొంతమంది పేర్లు ముఖ్యమంత్రి పరిశీలనలో ఉన్నాయి. త్వరలోనే తుదినిర్ణయం వెలువడనుంది. అలాగే 24 మంది సభ్యులతో జిల్లాస్థాయి, మండల స్థాయి రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయనున్నారు. 15 మంది సభ్యులతో గ్రామ రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రస్థాయిలో వ్యవసాయ శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారిగా, మండల స్థాయిలో తహసిల్దార్, గ్రామస్థాయిలో వీఆర్వోలు కార్యనిర్వహణాధికారులుగా వ్యవహరిస్తారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు సమన్వయ సమితిల ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీఎం కేసీఆర్ ప్రతి మూడు జిల్లాలకు ఒకరి చొప్పున మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. సెప్టెంబర్ 9లోపు ఇంచార్జి మంత్రులు ఈ సమితుల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని, అనంతరం నాలుగైదు రోజుల్లోగా కార్యరూ పంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులకు అప్పగించిన బాధ్యతల వివరాలు ఇలా ఉన్నాయి.

మంత్రి పేరు	అప్పగించిన జిల్లాలు
టి.హరీష్‌రావు	సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట
జోగు రామన్న	ఆదిలాబాద్, అసిఫాబాద్
కేటీఆర్	సిరిసిల్ల, జగిత్యాల
మహేందర్ రెడ్డి	రంగారెడ్డి, వికారాబాద్ ,మేడ్చల్
జగదీష్ రెడ్డి	నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి
తుమ్మల	ఖమ్మం, కొత్తగూడెం
పోచారం	నిజామాబాద్, కామారెడ్డి
లక్ష్మారెడ్డి	మహబూబ్ నగర్
కడియం శ్రీహరి	వరంగల్ అర్బన్, వరంగల్
ఈటల రాజేందర్	కరీంనగర్, పెద్దపల్లి
జూపల్లి	నాగర్‌కర్నూల్, వనపర్తి,
కృష్ణారావు	జోగులాంబ గద్వాల
చందూలాల్	జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్
ఇంద్రకరణ్‌రెడ్డి	నిర్మల్, మంచిర్యాల

జలాశయాల్లో జలకళ

● జోరుగా వర్షాలు నిండుతున్న చెరువులు ● అన్నదాతల్లో ఆనందం



నిర్మల్, కెఎన్ఎన్: వర్షాకాలం పూర్తవుతుందన్న తరుణంలో నిర్మల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలు జిల్లా రైతులను ఊరటనిస్తున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు, నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. దీంతో జలాశయాలన్ని జలకళను సంతరించుకుంటున్నాయి.

జిల్లాలో..

నిర్మల్ జిల్లాలో వర్షాకాలం ప్రారంభమై రెండు మాసాలు గడిచిపోయినా రానున్న కాలంలోనైనా వర్షాలు కురుస్తాయో లేదో అన్న బెంగతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నా రు. అంతేకాకుండా జలాశయాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. జిల్లాలోని గడ్డెన్నవాగు, స్వర్ణ, కడెం ప్రాజెక్టుల్లో నీరు ఆశించినంతగా వచ్చాయి. దీంతో ఆయకట్టు రైతులు ఆనందోత్సవాలతో ఉన్నారు. సువూరు రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ సీజన్‌లోజిల్లాలో వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం ఖరీఫ్ పంటకు ఈ యేటా 1.20 లక్షల ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. వీటి పరిదిలోని సువూరు 30వేల ఎకరాల్లో సోయా, 40వేల ఎకరాల్లో మొక్కజొన్, పసుపు 22వేల ఎకరాలు, కంది 20వేల ఎకరాలు, పత్తి 20వేల ఎకరాలు, వరి 18వేల ఎకరాల్లో, ఇతర కూరగాయల పంటలు మిగితావి సాగు చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 1.20 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వాటిలో వరి, మొక్కజొన్న, పెసర, మిరప, పత్తి తదితర పంటలను రైతులు ప్రధానంగా సాగు చేసుకుంటున్నారు. గత నాలుగు రోజుల నుండి వర్షాలు కురుస్తుండడంతో పంట చేలు ఊపిరి పోసుకున్నాయి.

ప్రాజెక్టుల వారీగా నీటి సామర్థ్యం

నిర్మల్ జిల్లా పరిధిలో చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అవి పొంగిపొర్లుతున్నాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 698 అడుగులు, గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 358.50 అడుగులు కాగా, ప్రస్తుతం 355.05 అడుగులు ఉన్నాయి. స్వర్ణ ప్రాజెక్టు నీటి మట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1180ల వరకు నీటి నిలకడ ఉంది. పొరుగు జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1068.80 అడుగుల వరకు నీరు నిలకడగా ఉంది. ప్రాజెక్టుల్లో అనుకున్న స్థాయిలో నీరు రావడంతో ఆయా ప్రాజెక్టుల కింది ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జర్నలిస్టులకు త్వరలో ఇండ్లు

జకీర్ పుస్తకావిష్కరణ సభలో మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, జర్నలిస్టులకు ఇప్పటికే హెల్త్‌కార్డులు ఇచ్చామని.. త్వరలో ఇండ్లు కూడా ఇస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సీనియర్ జర్నలిస్టు జకీర్ రచించిన ట్రూస్టోరీస్- మర్లబడ్డ మొగిలిచర్ల పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం బేగంపేట టూరిజం ప్లాజాలో ఆవిష్కరించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. టిఆర్ఎస్ ప్రచార కార్యదర్శిగా ఉద్యమ సమయంలో జర్నలిస్టుల సాధకబాధకాలు చూశానన్నారు. కొత్తతరానికి జకీర్ లాంటి సీనియర్ జర్నలిస్టుల అనుభవాలతో రాసిన పుస్తకాలు అవసరమన్నారు. జర్నలిస్టులకు చివరకు మిగిలేది తృప్తేనన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. వందకోట్ల రూపాయలతో జర్నలిస్టుల సంక్షేమనిధి ఏర్పాటుచేశామన్నారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇస్తున్నామని, హెల్త్‌కార్డులు కూడా ఇచ్చామన్నారు. జర్నలిస్టులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశానని, వారికి చేయాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. జకీర్ పుస్తకం బాగుందని, ఆయన జర్నలిస్టుగా పడ్డ కష్టమేమిటో ఆయన కుటుంబసభ్యులకు కూడా ఈ పుస్తకంతో ప్రత్యక్షంగా తెలిసినట్టయ్యిందన్నారు. సమాజం కోసం జర్నలిస్టులు చాలా కష్టపడుతున్నారని, ఆర్డీఎస్ పాదయాత్రలో జకీర్ తనతో కలిసి నడిచారన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ జకీర్ చేసిన వినూత్న ప్రయత్నం స్ఫూర్తిదాయకమన్నారు. ఇలాంటి పుస్తకాలు ముందుతరాలకు మార్గదర్శకాలు అవుతాయన్నారు. టిఎస్‌పిఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన జర్నలిస్టు జకీర్‌ది విలక్షణ శైలి అని, ఈ పుస్తకం తెలుగు జర్నలిజంలో కథానాయకుడి లాంటి ప్రయత్నమన్నారు. సుప్రసిద్ధపాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక ప్రయత్నం గొప్పదని, అద్భుత విలువలతో దీనిని రూపొందించారన్నారు. దేవులపల్లి పబ్లికేషన్స్ మంచి ప్రయత్నం చేసిందని, మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని జకీర్ అక్షరాల్లో చదువుతుంటే ఉద్యమంతో కలిసి పరుగెట్టినట్లు ఉందన్నారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ అధ్యక్షత వహించగా, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, ప్రముఖ కవి గోరటి వెంకన్న, పబ్లికేషన్స్ అధినేత దేవులపల్లి అజయ్ పాల్గొన్నారు.

వైశ్యులకు గుర్తింపు ఇచ్చింది కేసీఆరే

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్. సుధాకర్‌రావు

● రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు: రాష్ట్ర అధ్యక్షుడు పుప్పల



తొర్రూరు టౌన్, కెఎన్ఎన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో వైశ్యుల పాత్ర ఎంతో ప్రముఖమైనదని, ఇన్నేళ్లుగా ఏ ముఖ్యమంత్రి వైశ్యులకు గుర్తింపు ఇవ్వలేదని, సీఎం కేసీఆర్ వైశ్యులను గుర్తించి ఎమ్మెల్యేగా, కార్పొరేషన్ చైర్మన్‌గా పదవులను ఇచ్చాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్. సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ సేవలో వైశ్యులు ఎప్పుడూ ముందుంటారని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, వాసవి ఆస్పత్రి, వైశ్య హాస్టల్, రక్తదాన శిబిరాలు నిర్వహించడమే కాకుండా సివిల్స్‌కు సిద్ధమయ్యే వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. గట్టు మహేష్‌బాబు మాట్లాడుతూ వైశ్యుల కోసం వైశ్య ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకులు సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మండల, గ్రామ స్థాయిలో కమిటీలు వేస్తూ సంఘాలను పటిష్టపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్ నాయక్, ఇమ్మడి లక్ష్మయ్య, రేగూరి సోమయ్య,సత్యనారాయణ, ఓలం బుచ్చిలింగం, ఉపేందర్ రావు, బిజ్జాల ప్రభాకర్, కలకొండ మణి మాల, కామిశెట్టి రాణి, సింగికొండ రజని, పసుమర్తి సీతారాములు, రామిని శ్రీనివాస్, బిజ్జాల నారాయణ, డాక్టర్ కిరణ్ కుమార్, తాళ్లపల్లి రాము, నాళ్లం శ్రీనివాస్, కెశెట్టి వేణు, కెశెట్టి శ్రీను, బి.ప్రభాకర్, రేగూరి వెంకన్న, కెశెట్టి ప్రవీన్, వనమాల ప్రకాష్, సోమసుంధర్, శోభన్, బిజ్జాల అమరేందర్, మాశెట్టి జగదీశ్వర్, అనుమాండ్ల సురేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

వచ్చే ఫిబ్రవరికి షిర్డీలో అన్నదాన సత్రం భవనం

శ్రీసాయి అన్నపూర్ణ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా కొనసాగుతున్న శ్రీసాయి అన్నపూర్ణ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ (షిర్డీ) సర్వసభ్య సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడ వైశ్యహాస్టల్లో జరిగింది. సంస్థ అధ్యక్షుడు చకిలం రమణయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. షిర్డీలో సువూరు రూ.25 కోట్లతో చేపడుతున్న నిత్యాన్నదాన సత్రాన్ని వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇప్పటికే 65శాతం మేరకు సత్రం భవన నిర్మాణ పనులు పూర్తికాగా, మిగిలిన పనులను సైతం శరవేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అన్ని పనులు పూర్తి చేసి రానున్న ఫిబ్రవరి మాసంలో భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని తలపెట్టారు. నిర్మాణం పూర్తి అయిన భవనాన్ని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, అఖిల భారత ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నంద కుమార్ దత్తాత్రేయతో పాటు భావనాసి శ్రీనివాస్, గుబ్బ చంద్రశేఖర్, బచ్చు విలాన్, పసునూరి ప్రహ్లాద, ఇల్లూరి లక్ష్మయ్య, శ్రీకాశీ అన్నపూర్ణ వాసవి వృద్ధ్యాశ్రమానికి చెందిన పది మంది సభ్యులు వీరవెంకట సత్యానారాయణ స్వామి దేవస్థానం బోర్డు మెంబర్లు మట్టి సత్యప్రసాద్, కొత్త వెంకటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా షిర్డీ వెళ్ళే భక్తు ల సౌకర్యార్థం వసతి గృహం, అన్నదానం సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు.

ఏపీ అర్బన్ హెల్త్ ఉద్యోగులకు గౌరవ వేతనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏపీలో ఆర్బన్ హెల్త్ ఉద్యోగులకు గౌరవ వేతనం తోపాటు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం ఆదుకుంటుందని గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ మన్నవ సుబ్బారావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మన్నవ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, కార్మికుల అభ్యున్నతికి తెలుగుదేశం ప్రభుత్వం నిరంతరం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఆర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వారికిన్యాయం చేస్తామని మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు.

కేంద్రంతో అమీతుమీ..!

- జీఎస్టీపై ఎదురుదాడి
- అన్ని పథకాలపై భారం సహించేది లేదంటున్న ప్రభుత్వం
- కేంద్రంతో కయ్యానికి సై
- ఇతర రాష్ట్రాలతో సమన్వయం
- అవసరమైతే న్యాయపోరాటం
- సెప్టెంబర్ 2న కౌన్సిల్ సమావేశానికి మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా వ్యవహరిస్తూ సంపూర్ణ మద్దతునిస్తున్న తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా కేంద్రంతో కయ్యానికి కాలుదువ్వేందుకు సన్నద్ధమవుతోంది. కేంద్ర, రాష్ట్రాల సఖ్యతకు జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) చిచ్చు పెడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. జీఎస్టీ బిల్లు ఆమోదానికి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఉభయసభల ఆమోదం తెలిపిన తెలంగాణ ఇప్పుడు భిన్నమైన వైఖరితో కేంద్రం వైపు చూస్తోంది. సుస్థిర ఆర్థికాభివృద్ధికి జీఎస్టీ ప్రతికూలంగా మారిన పరిస్థితి, తాము ఎంచుకున్న విప్లవాత్మక పథకాలకు భారంగా పరిణమించిన దుస్థితిపై సీఎం కేసీఆర్ మదన పడుతున్న వైఖరి పలు దశల్లో వ్యక్తమైంది. ఇటీవలే తనను కలిసేందుకు వచ్చిన ది హిందూ మాజీ ఎడిటర్ రామ్‌తో జీఎస్టీపై సీఎం కేసీఆర్ మాట్లాడుతూ దీనిని ఈ విఫల ప్రయోగంగా కొట్టిపారేశారు. అనేక దేశాలు తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఆ తర్వాత రద్దు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూనే దేశంలో ఏం జరుగుతుందో వేచిచూడాలని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు చేయడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. త్వరలో జీఎస్టీకి తాము వ్యతిరేకమనే సంకేతాలనిచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం వ్యూహం పన్నుతోంది. ఇందుకు జాతీయ స్థాయిలో దేశవ్యాప్త మద్దతుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రాల అభివృద్ధికి జీఎస్టీ అవరోధంగా మారిందని జాతీయ స్థాయిలో ప్రచారం చేసేలా ఆయన ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నారని సమాచారం. సెప్టెంబర్ 2న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ భేటీలో అమీతుమీ తేల్చుకోవాలని తెలంగాణ ప్రభుత్వం వేచి చూస్తోంది. కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో నీళ్లూ, నిధులు, నియామకాలు ధ్యేయంగా ప్రభుత్వం కీలక పథకాలకు అంకురార్పణ చేసింది. అనేక ప్రాధాన్యతా పథకాలను సీఎం కేసీఆర్ స్వయంగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నారు. ఇందులో ప్రధానంగా సాగునీరు ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణను సశ్యశ్యామలం చేయడం ఒకటైతే, ఇంటింటికీ నల్లాల్లో సురక్షిత తాగునీరు అందించక పోతే 2019లో ఓట్లే అడగనని ఆయన ప్రతిజ్ఞ చేయడం ఇంకో గొప్ప విషయం. తెలంగాణలో ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం తెలంగాణకు మరో మకుటాయమనంగా నిలిచేలా రూపొందించుకున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఆదరణకు నోచని రహదార్ల అభివృద్ధికి కూడా కీలక రోడ్ మ్యాప్‌ను నిర్ధేశించుకుని ఆ దిశగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు వీటన్నింటిమీద జీఎస్టీ ప్రభావం పడింది. ఒక్క సాగునీటి ప్రాజెక్టుల రంగంపైనే దాదాపుగా రూ. 19వేల కోట్ల భారం పడుతోందని తెలంగాణ సర్కార్ ఆందోళన చెందుతోంది. ఇరిగేషన్, త్రాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, హౌసింగ్ స్కీముల వంటి వాటిపై జీఎస్టీ పన్ను రేటు 18 శాతంగా నమోదు కావడంతో ఆయా పథకాలపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే దీనిని మినహాయించాలని కోరుతూ సీఎం కేసీఆర్ నేరుగా ప్రధానికి లేఖ రాయాలని కూడా ఒక దశలో భావించారు. ఇదే అంశాలను ప్రధాన ఎజెండాగా తెలంగాణ సర్కార్ జీఎస్టీ కౌన్సిల్‌లో తన వాణిని బలంగా వినిపించింది. అయినా కేంద్రం పెడచెవిన పెడుతూ వస్తోంది. మరోవైపు జీహెచ్ఎంసీ నిర్ధేశిత స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌కు రూ. 24,000కోట్లను వెచ్చిస్తోంది. లక్షమేర రెండు పడకగదుల ఇండ్ల నిర్మాణం దిశగా ప్రణాళికలు ముమ్మర మయ్యాయి. వీటిపై కూడా జీఎస్టీ భారం కారణంగా రూ. 4వేల కోట్ల అదనపు భారంతో జీహెచ్ఎంసీ వెనుకంజ వేసింది. తెలంగాణ రహదారులకు మండలాల నుంచి జిల్లాలకు 4 లేన్ల రహదారులతో అనుసంధానించాలన్న రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయానికి కూడా జీఎస్టీ గండం ఎదురైంది. 12వేల కిలోమీటర్ల రహదారుల ఆధునీకరణపై రూ. 4వేల కోట్ల అదనపు భారం జీఎస్టీ రూపంలో పడుతోంది.

వచ్చే నెల 2న సమర భేరీ...

సెప్టెంబర్ 2న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ భేటీలో ప్రస్తావించాల్సిన అంశాలు, ఆయా రాష్ట్రాల మద్దతు సమీకరణకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. జీఎస్టీ భారంతో అభివృద్ధికి బ్రేకులు పడుతున్నాయని, పేదల పథకాలపై భారీగా ప్రభావం చూపుతున్నదని సమావేశంలో వెల్లడించ నున్నారు. ఈసారి సమావేశానికి వ్యూహాత్మకంగా కేటీఆర్‌ను పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయన వాగ్దాటితో జాతీయ స్థాయిలో ఇతర రాష్ట్రాలను కూడా సమన్వయం చేసి ఏకాభిప్రాయం సాధిస్తారని ప్రభుత్వం భావిస్తోంది.

అన్ని రాష్ట్రాల ఇబ్బందులను ఆయన ఈ సమావేశంలో ప్రస్తావించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటోంది. అవసరమైతే న్యాయపోరాటం చేసేందుకు కూడా సిద్ధమని ఈ వేదికపై తేల్చి చెప్పాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. దీనిపై వివిధ రాష్ట్రాలతో సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం.

భాగ్యనగరంలో లలితా జ్యువెల్లరీ



లలితా జువెల్లర్స్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్ దంపతులు, చిత్రంలో లలితా జువెల్లర్స్ చైర్మన్ కిరణ్‌కుమార్

హైదరాబాద్, కెఎన్ఎన్ : జ్యువెలరీ రంగంలోనే ప్రముఖ సంస్థ అయిన లలితా జ్యువెలరీ అతి పెద్ద షోరూమ్‌ను సోమాజిగూడలో ఏర్పాటు చేసింది. ఈ షోరూమ్‌ను ఆదివారం మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంతి బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ లలితా జ్యువెలరీ యజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని శాఖలు ఏర్పాటు చేయాలని ఆయన ఆకాంక్షించారు. వజ్రాభరణాల విభాగాన్ని లైకా గ్రూప్ చైర్మన్ ఏ.సుభాస్కరన్ దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి నాయిని నరసింహా రెడ్డి, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, సినీనటుడు గిరిబాబు, ఎంపీ సుబ్బరామి రెడ్డి, శివ గ్రూప్ చైర్మన్ శివశంకరన్, డీసీ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ దిలీప్ చాబ్రియా, వేల్స్ విశ్వ విద్యాలయం(చెన్నై) చైర్మన్ డాక్టర్ ఐసరి కే.గణేశ్‌అడయార్, ఆనందభవన్ మేనేజింగ్ డైరెక్టర్ కే.టీ.శ్రీనివాసరాజా తదితరులు పాల్గొన్నారు. లక్షా 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత విశాలమైన స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు లలితా జ్యువెలరీ చైర్మన్ డా. ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. వినియోగదారులకు అందుబాటు ధరలో, వారి అభిరుచులకు తగిన కలెక్షన్‌ను అందించనున్నట్లు ఆయన వివరించారు. హిడెన్ చార్జీల భారం లేకుండా, సరసమైన ధరలకే నగలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. తయారీ ధరకే బంగారు ఆభరణాలను అందించడమేగాక, తమ సేవలు పారదర్శకంగా అందించనున్నట్లు ఆయన వివరించారు.

ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లు...

ప్రారంభోత్సవం సందర్భంగా లలితా జ్యువెలరీ స్టోర్‌లో ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నారు. తయారీ ధరకే బంగారు ఆభరణాలను అందిస్తున్నారు. బంగారు, వెండి, వజ్రాభరణాలు, ప్లాటినంతో పాటు అన్ని నగలను తయారీ ధరకే అందిస్తున్నారు. బంగారు ఆభరణాలకు 1 నుంచి 9శాతం వరకు మాత్రమే తరుగు ఉంటుంది. కొన్ని నగలకు 10నుంచి 16శాతం వరకు తరుగు. వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.48వేలు మాత్రమే. అలాగే తరుగు గ్రాముకు 975మాత్రమే. వెండి వస్తువులకు తరుగు లేదు. వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.2000 తగ్గింపు ఇస్తున్నారు.

ప్రతి జిల్లాలో వైద్య కళాశాల



(మొదటిపేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లా తాండూరులతో పాటు కొత్త జిల్లాలలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కొత్త వైద్య, దంత కళాశాలలను ప్రారంభించాలన్న ఆవశ్యకత ఎంతో ఉందని ప్రభుత్వం గుర్తించింది. వెనుకబడ్డ పాత పాలమూరు జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజక వర్గాలలో వచ్చే ఏడాది ప్రభుత్వ వైద్య కళాశాలలను కచ్చితంగా ప్రారం భించాలని.. ప్రైవేటు సంస్థలు ముందుకొస్తే వెంటనే పనులను మొదలుపెట్టాలన్న అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైద్య కళాశాలలను ప్రారంభించే అంశంపై త్వరలోనే సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపాదిం చారు. హైదరా బాద్‌లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసినందున ఈ కళాశాలకు తొలిదశలోనే కనీసం 200 వైద్య సీట్లకు అనుమతులు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కేసీఆర్.. తెరాస పార్లమెంటరీ పార్టీనాయకుడు జితేందర్‌రెడ్డిని ఆదేశించినట్లు సమాచారం. ఎయిమ్స్ అనుమతికి సంబంధించి ఒకట్రెండు రోజుల్లో ప్రధాని నరేంద్ర మోదీ, వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి నడ్డాకు లేఖ రాయాలని నిర్ణయిం చారు. రాష్ట్రంలో వైద్య విద్యకు డిమాండ్ పెరగడంతో పాటు ప్రవేశాల కోసం రాష్ట్రానికి చెందిన విద్యార్థులు పొరుగు రాష్ట్రాలకు వెళుతున్నారని, ఈ వలసను అరికట్టేందుకు కొత్త కళాశా లలను ఏర్పాటు చేయడం మినహా ప్రత్యా మ్నాయం లేదని ప్రభుత్వం భావిస్తోంది. కరీంనగర్, సంగారెడ్డి జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని ఇందుకు సంబం ధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ఉంచాలని ముఖ్యమంత్రి కార్యాలయం సంబంధిత శాఖను ఆదేశించింది. ఇప్పటికే సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఎంఎన్ఆర్ వైద్య కళాశాల ఉంది.

మంత్రి హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట జిల్లా కేంద్రంలో గతేడాది ప్రభుత్వ కళాశాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు వైద్య కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని.. పరిస్థితిని బట్టి వచ్చే రెండు మూడేళ్లలో ఇక్కడ కళాశాల ప్రారంభించాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉంది. పూర్వపు నల్గొండ జిల్లా సూర్యాపేట, మహబూబాబాద్, గద్వాల, నిర్మల్, కామారెడ్డి, పెద్దపల్లి తదితర కొత్త జిల్లాలలో దశలవారీగా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో వైద్య కళాశాలలను ప్రారంభించి వైద్య విద్యను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో వైద్య కళాశాలను ప్రారంభించాలంటే వెయ్యి పడకల ఆసుపత్రితో పాటు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండేది. ప్రస్తుతం వెయ్యి పడకల ఆసుపత్రి నిబంధనను తొలగించ డంతో వైద్య కళాశాల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగి పోయాయి. ప్రైవేటు ఆసుపత్రితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని వైద్య కళాశాల ప్రారం భించే అవకాశాలు ఉన్నందున రాష్ట్రంలో దశల వారీగా ప్రైవేటు, ప్రభుత్వ రం గంలో వైద్య విద్యను ప్రొత్సహిం చాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు చెబుతున్నారు.

సర్వం స్వాహా!

- బెట్టింగ్‌లపై సర్వేల ప్రభావం
- లగడపాటి సర్వేతో మారిన స్వరూపం
- బూత్‌లు, రౌండ్ల మధ్య పందేలు
- పండుతోన్న పంటర్ల పంట
- నష్టపోయేది బెట్టింగ్ రాయుళ్లే



అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: ఇంతవరకు దేశంలో ఎప్పుడూ చోటు చేసుకోని ఉత్కంఠ నంద్యాల ఎన్నికల సందర్భంగా నెలకొంది. ఎన్నికల ప్రకటన నుంచి ప్రతి అంశంలోనూ ఇది జాతీయ స్థాయిలో ఆకర్షించింది. అందుకు తగ్గట్లే ఎన్నికల పోలింగ్ శాతం కూడా అనూహ్యంగా నమోదైంది. ఇదికూడా ఒక రికార్డే. కాగా ఇప్పుడు ఫలితాల సమయం వచ్చేసింది. ఈ ఉపఎన్నికకు సుమారు రూ. 200కోట్లు ఖర్చయ్యాయని పరిశీలకులు అంచనాలేస్తున్నారు. అయితే ఇందుకు రెండు మూడురెట్లకుపైగా ఫలితాలపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. వాస్తవానికి నంద్యాలలో అభ్యర్థుల ప్రకటన నాటి నంచి ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు మొదలయ్యాయి. కానీ పోలింగ్ రోజు రాత్రి ఎగ్జిట్ పోల్స్ ఫలితాల వెల్లడి తర్వాత బెట్టింగ్ జోరందుకుంది. కాగా మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ సర్వే నివేదిక బైటపెట్టిన అనంతరం ఇది రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. సహజం గా ఏ ఎన్నికల్లోనైనా ఫలితాలపై బెట్టింగ్‌లు ఆయా నియోజక వర్గాల పరిధిలోనే సాగుతుంటాయి. కొన్ని సందర్భాల్లో అయితే జిల్లా స్థాయిలో జరుగుతాయి. కానీ నంద్యాల విషయంలోఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బెట్టింగ్‌లు జరుగు తున్నాయి. ఇక్కడేకాదు.. ఇతర రాష్ట్రాలకు కూడా ఇవిపాకి నట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు ఐదొందల కోట్ల వరకు ఇప్పటికే బెట్టింగ్‌లు జరిగినట్లుతెలుస్తోంది. ఆదిలో 1:1తరహాలోనే బెట్టింగ్‌లు జరిగాయి. అంటే ఏ పార్టీపైనైనా లక్షకాస్తో లక్ష రావడంలేదా లక్ష పోవడం జరుగుతుంది. కానీ లగడపాటి సర్వే నివేదిక మొత్తం ఈ విధానాన్నే సమూలంగా మార్చేసింది. తెలుగుదేశం ఇక్కడ ఆధిక్యత సాధిస్తుందన్న లగడపాటి సర్వేతో ఆ పార్టీపై బెట్టింగ్‌ల జోరు అనూహ్యంగా పెరిగింది. అలాగే వైకాపాపై కాసే వారి సంఖ్య తగ్గింది. దీంతో పంటర్లు కూడా విధానాన్ని మార్చేశారు. ఇప్పుడు 4:1, 5:1 చొప్పున బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.

సోమ వారం కౌంటింగ్ మొదలయ్యే సరికి 10:1జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేని పరిస్థితి కనిపిస్తోంది. అంటే తెలుగుదేశంపై నాలుగొందలుకాస్తే వైకాపాపై వంద రూపాయలు బెట్టింగ్ అన్న మాట. తెలుగుదేశం గెలిస్తే వీరికి ఆ వందరూపాయలొస్తాయి. అదే వైకాపా గెలిస్తే ఈ నాలుగొందలు అటువైపు వ్యక్తికెళ్తాయి. ఇప్పుడు బెట్టింగ్‌లన్నీ ఇలాగే జరుగుతున్నాయి.దీనంతటికి లగడపాటి సర్వేయే కారణంగా చెప్పుకోవాలి. గతంలో లగడపాటి చేయించిన కొన్ని ప్రైవేటు సర్వేలు ఫలితాలకు కాస్త అటూ ఇటూగా యదార్థమయ్యాయి. దీంతో ఆయన సర్వేలపై జనానికి గురికుదిరింది. అయితే అప్పట్లో ఆయన రాజ కీయాల్లో కీలకంగా ఉండేవారు. కానీ గత మూడు న్నరేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. పైగా ఇప్పుడాయన ఏ పార్టీలో లేరు. తెలుగుదేశంలో చేరేందుకు ఉవ్విళ్ళూరు తున్నారన్న వార్తలు వెలువడ్డాయి. ఈ మధ్యనే ఆయన చంద్రబాబును కలిసొచ్చారు. ఇందులో రాజకీయ కోణం లేదంటూ కొట్టి పారేశారు. అయినప్పటికీ లగడపాటి దేశంవైపు మొగ్గు చూపుతున్నారన్న వార్తలు ఆగిపోలేదు. ఈదశలో నంద్యాల ఫలితం తెలుగుదేశానికి అనుకూలంగా ఉంటుం దంటూ లగడపాటి ఇచ్చిన నివేదిక సహజంగానే ఆ పార్టీ అనుకూల వర్గాల్ని ఆకర్షిస్తోంది. వారిలో మరింత ఉత్సా హాన్ని, విశ్వాసాన్ని పెంచుతుంది. అయితే పంటర్లు మాత్రం ఈ సారి తమకనూహ్యంగా లాభిస్తుందని అంచనా లేస్తున్నారు. తమ పంట బాగా పండుతుందని ఆనంద పడుతున్నారు. ఏ ఇద్దరు బెట్టింగ్ కాసినా పం టర్లకు మాత్రం కమీషనే మిగులుతుంది. అయితే పోగొట్టుకున్న వ్యక్తు ల్నుంచి పంటర్లకు లాభముం డదు. గెలుపొందే మొత్తం నుంచి కమీషన్ తీసుకుంటారు. ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటే వచ్చే కమీషన్ తక్కువే. కానీ ఎక్కువ మొత్తాన్ని నష్టపోకుండా కాపాడుకున్నవార్నుంచి అదనంగా కమీషన్ వస్తుంది.

అదే వైకాపా గెలిస్తే ఇక వారిపంట పండినట్లే. బెట్టింగ్ దారుడికి నాలు గురెట్లు లాభమొస్తున్నందున కనీసం 25శాతం అందులో కమీషన్‌గా వసూలు చేస్తారు. అలా చూస్తే బెట్టింగ్‌దారుల మొత్తం పెట్టుబడి సమానస్థాయిలో వీరికి కమీషన్ ముడుతుంది. లగడపాటి సర్వే తర్వాత రౌండ్లవారీ లెక్కింపుపై బెట్టింగ్‌లు మొదలయ్యాయి. గతంలో ఫలితాల పైనే ఉండేవి. కాగా మెజార్టీల కనుగుణంగా బెట్టింగ్‌లొచ్చాయి. క్రికెట్‌లో బాల్ బాల్‌కి, పరుగు పరుగుకి, ఓవర్ ఓవర్‌కి బెట్టింగ్‌లు మొదలైన విధంగానే నంద్యాలలో కూడా ప్రారంభ మయ్యాయి. ఫలానా బూత్‌లో టిడిపికి ఆధిక్యత, మరో బూత్‌లో వైకాపాకు అనుకూలతంటూ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. అలాగే ఒకటో రౌండ్‌లో దేశం లేదా వైకాపా ఆధిక్యతంటూ బెట్టింగ్ వేస్తున్నారు. లగడపాటి సర్వేను ఏ విధంగానూ మార్చే అవకాశమైతే లేదుగానీ, రాష్ట్ర వ్యాప్తంగా బెట్టింగ్ రాయుళ్ళు తీవ్రంగా నష్టపోయే ప్రమాదమేర్పడింది.

ఇంటిపై పంట – ఇంట్లో వంట

- ఆరోగ్యవంతమైన సమాజానికి ఉద్యానవనశాఖ చేయూత
- కూరగాయల సాగులో అధునాతన సాంకేతిక పద్ధతులు: వ్యవసాయ మంత్రి పోచారం
- ఐదు రోజుల ఉద్యాన మహోత్సవం ప్రారంభం



నెక్లస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఐదు రోజులపాటు జరిగే తెలంగాణ ఉద్యాన మహోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబించి కూరగాయల సాగులో రైతులకు మెళకువలు నేర్పేందుకు అన్ని చర్యలు తీసుకుం టున్నామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే ప్రతియేటా ఉద్యాన మహోత్సవాన్ని సాంప్రదా యంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. రకరకాల ఉద్యాన పంటల మొక్కల ప్రదర్శనతో పాటు సాగు విధానం పట్ల శాస్త్రవేత్తలు, నిపుణులతో శిక్షణ కూడా ఇప్పిస్తున్నామన్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఐదు రోజుల పాటు జరిగే తెలంగాణ ఉద్యాన మహోత్స వాన్ని ఆదివారం నెక్లస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పోచారం మీడియాతో మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజం కావాలంటే ప్రజలకు ఆరోగ్యవంతమైన ఆహారం అందుబాటులో ఉండాలన్నారు. దాదాపు గ్రామీణ ప్రజలందరికీ తాజా కూరగాయలు అందుబాటులో ఉండడం సహజమేనని, పట్టణ ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకు రావాలన్న సంకల్పంతో ఉద్యాన శాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మిద్దెలు, బంగ్లాలపై ఉండే ఖాళీ స్థలాలను ఉపయోగించుకుని కూరగాయలు పండించేందుకు చేయూతనిస్తూ, ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తు న్నా మన్నారు. అలాగే ఆసక్తి గలవారికి సాగుపై అవగాహణ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఇంటిపై పండించిన తాజా కూరగాయలతో ఇంట్లో హాయిగా వంట చేసుకునే అవకాశాలు సొంతి ళ్ళు ఉన్న ప్రతి కుటుంబానికీ ఉన్నాయ న్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజానికి బాటలు వేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పురుగు మందులు వాడకుండా సేంద్రీయ పద్ధతులను అవలంబించి కూరగాయలు పండించుకోవాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యాన ప్రదర్శనను సందర్శించి సాగు పట్ల, సాంకేతిక విధానాల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు, పండ్లు మనవద్దే పండించుకుంటే రాష్ట్రం ఆర్థికంగా ఎదిగేందుకు మరిన్ని అవకాశాలు మెరుగుపడు తాయన్నారు. అదే సమయంలో ప్రజారోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం కూరగాయల కొరతతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న మనమే ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతామన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా రాయితీలను అందిస్తుందన్నారు.

గ్రామ రైతు సంఘాలతో మంచి ఫలితాలు

ప్రభుత్వం సంకల్పించిన మేరకు గ్రామ రైతు సమన్వయ సంఘాల ఏర్పాటుతో మంచి ఫలితాలు సాధించగలుగుతామని మంత్రి పోచారం ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10800 రెవెన్యూ గ్రామాలను 3600 యూనిట్లుగా విభజించి వచ్చే నెల 1 నుంచి 9 వరకు ఈ సంఘాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అలాగే 10 నుంచి 14 వరకు మండల రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసి రిసోర్స్ పర్సన్ల ద్వారా సదస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. రైతు సమగ్ర సర్వే వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి సమన్వయకర్త స్థానిక ఏఈవో సంతకాలతో రికార్డులను తయారు చేయిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మే నెల 15 నాటికే రైతు ఖాతాల్లో ఎకరాకు రూ.4వేల చొప్పున పెట్టుబడి రాయితీ మొత్తాన్ని జమచేస్తామన్నారు. రెండు పంటలు పండించే ఉద్యాన రైతులకు కూడా ఈ రాయితీని వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకువచ్చి ఆత్మహత్యల రహిత తెలంగాణ సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్ రెడ్డి, వ్యవసాయ ఉద్యాన శాఖ కార్యదర్శి సి.పార్థ సారథి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పరిరక్షణకు ప్రత్యేక బోర్డు

- గంగా మాదిరిగా బోర్డు ఏర్పాటుకు డిమాండ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ రేణుకా చౌదరి
- ఖమ్మం జిల్లాలో పార్లమెంటరీ బృందం పర్యటన



ఖమ్మం, కెఎన్ఎన్ : ఉత్తరాదిన కలుషితమై పోతున్న గంగా జలాలను పరిరక్షించేందుకు ఏవిధంగా కేంద్ర ప్రభుత్వం గంగా నదీ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేసి చర్యలు చేపడుతుందో అదే రీతిలో అటు హెవీ వాటర్ ప్లాంటు, ఇటు ఐటీసీ కలుషిత, రసాయనిక పదార్థాలతో కలుషితం కాబడి విషపూరితంగా మారుతున్న గోదావరి జలాలను పరిరక్షించుకునేందుకు దక్షిణాదిన గోదావరి పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయబడింది. అవిభాజ్య ఖమ్మం జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఖమ్మం చేరుకున్న 20 మందితో కూడిన ఎంపీల బృందం ఆదివారం ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అటవీ పార్కులో పర్యటించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అటవీ పరిరక్షణ, ఆటమిక్ ఎనర్జీ అంశాలపై అధ్యయనం చేసేందుకు వచ్చిన ఎంపీల బృందానికి మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి చైర్‌పర్సన్ హోదాతో నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి మాట్లాడుతూ గోదావరి కలుషితానికి సంబంధించి అనేక ఫిర్యాదులు, లేఖలు అవిభాజ్య ఖమ్మం జిల్లా ప్రజలు, మేధావులు, విద్యావంతుల నుండి వచ్చా యని, ఆ నేపథ్యంలోనే జిల్లాలో స్టాండింగ్ కమిటీ పర్యటిస్తున్నట్లు చెప్పారు. అవిభాజ్య ఖమ్మం జిల్లాపై తనకు అపార అనుభవం ఉన్నప్పటికీ పార్లమెంటరీ కమిటీ వీటిని పరిశీలించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఐటీసీ కలుషిత జలాల ప్రభావం, మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ బహిర్గత జలాలు, కేటీపీఎస్ బూడిదలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వా నికి వీటిపై సమగ్ర రిపోర్టును అందించడం జరుగు తుందని పేర్కొ న్నారు. పార్కులో రూ.2.50 కోట్ల వ్య యంతో చేప డుతు న్న గార్డెనింగ్, పబ్లిక్ గార్డెన్ పను లను 20 మంది ఎంపీల (లోక్‌సభ, రాజ్యసభ సభ్యు లు) బృందంతో కలిసి పరిశీలించారు. అటవీ పార్కులో మొక్కలు నాటిన అనంతరం రేణుకా చౌదరి మాట్లా డుతూ కేంద్రం అందిస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఏవిధంగా అమ లవుతుందనే అంశంపైన పరిశీలించ నున్నట్లు పేర్కొ న్నారు. దేశ ప్రజలకు ఈ అధ్యయనం యాత్ర(స్టడీ టూర్) ఉపయోగపడే విధంగా ఉంటుందని, అనేక పారిశ్రామిక, పర్యావరణ సమస్యలను అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేధికను అందించనున్నట్లు స్పష్టం చేశారు. రైతులు పండ్లను డీహైడ్రేషన్ చేయడం ద్వారా పండ్లలోని నీటిని శాస్త్ర సాంకేతికత ద్వారా తొలగింప చేసి ఎక్కువ కాలం నిల్వ చేసుకోవడంతో పాటు మంచి లాభాలు ఆర్జించ వచ్చనే విషయాన్ని రైతులకు చేరవేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. శాటిలైట్ ద్వారా రైతులకు సమాచారం అం దించా ల్సిన విషయాన్ని కూడా ప్రస్తావిం చారు. వర్షాలు, వాతావరణ మార్పు లతో పాటు కరువు పరిస్థితులను కూడా శాటిలైట్ ద్వారా రైతులకు అందించడం ద్వారా జరిగే నష్టాల నుండి పంటలను కాపాడుకోవడం జరు గుతుందని, వీటి న్నిటి ప్రాధాన్యత తెలియచేసేం దుకే ఎంపిల బృందం స్టడీ టూర్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు రేణుకా చౌదరి పేర్కొన్నారు. అనంతరం కొత్తగూడెం జిల్లాలో ఎంపీల బృందం పర్యటిం చారు. సుజాత నగర్ వద్ద సింగభూపాలెం చెరువును పరిశీలించారు. కొత్తగూడెం లో గౌతమ్‌ఖని ఓపేన్‌కాస్టులో దిగి బొగ్గు నిక్షేపాలను పరిశీలించారు. అనంతరం కేటిపిఎస్, ఐటీసీ లలో పర్యటించారు.

వనజీవి రామయ్యకు అభినందనలు

కోటి మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాంతం నిరంతర కృషి చేస్తున్న వనజీవి పద్మశ్రీ పురస్కార గ్రహీత దరిపల్లి రామయ్య దంపతులను పార్లమెంటరీ కమిటీ ప్రత్యే కంగా అభి నందించింది. ఈ కార్యక్రమాల్లో ఎంపిల బృందంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఎంపిలు నానా పటేల్, సుక్రాంసింగ్, వందనా చౌహాన్ తది తరులు 20మంది వరకు ఎంపిలు ఉండగా, జిల్లా కలెక్టర్ డి.ఎస్. లోకేష్‌కుమార్, ఆర్డీఓ పూర్ణచంద్ర, నగర కమిషనర్ బి.శ్రీనివాస్, తాహశీల్దార్ శ్రీలత, అటవీశాఖ కన్జర్వేటర్ డాక్టర్ నర్సయ్య, డిఎఫ్ఓ డాక్టర్ సునీల్ ఎస్. హేరేమాత్, పలువురు సిఐలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

'గిడుగు' తెలుగు భాషా బెడగు



గ్రాంథిక బంధనాల విముక్తి కల్పించి
కాఠిన్య పదబంధ పంజరాలు బద్దలు కొట్టి
భాషకు స్వాతంత్ర్యాన్ని అందించినవాడు
నోరు తిరగని శ్లేషల స్థితి నుండి
నోరారా ఊరూరా హారతి పట్టే వీధులలోకి
పద రథ స్వరాలను చేర్చిన నెగడు
పెద్దల భాషలోనే కాదు
పేద ప్రజా భాషలో కూడా
ప్రభను దర్శించిన ఘనుడు
తరగతి గదిలో నల్లబల్లపై
పాఠ్యపుస్తకాలలో
తేలికైన అక్షర తారా తోరణాలతో
తెలుగు తల్లికి అంజలి ఘటించిన హితుడు
భాషే శ్వాసనాళాలుగా జీవించి
సాధారణ గళానికి
పదపూజ పాదపూజలతో పట్టం కట్టిన విభుడు
పండిత ప్రకరణల సంకెళ్లను తెంచి
భాషను బడుగుల పాదపీఠంగా మలచిన రేడు
తెలుగు భాషకు అన్నికాలాల గొడుగు
అడుగు అడుగున అతడే 'గిడుగు'
అచ్చమైన హంస నడకల బెడగు
(ఆగస్టు 29 మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని)

- వై.హెచ్.కె.మోహన్‌రావు
9440154114

కవిత రాయడం ఒక కళ

ఇటీవల కాలంలో వస్తున్న కవిత్వంలో వస్తు వైవిధ్యం ఉన్నట్టు కనిపించినా ఒకే వస్తువుపై అనేకమంది కవితలు రాస్తున్నారు. అలాగే కవితా నిర్మాణంలో రూపంలో అనుకరణ పెరిగిపోయింది. చక్కని తెలుగు పదాలు, పదబంధాలు ఉన్నప్పటికీ, ఆంగ్లపదాలను ఇరికిస్తే అదేదో గొప్ప కవిత్వమనుకొంటారని, అవసరం లేకున్నా ఆంగ్ల పదాలను, కృతకభాషను సృష్టించుకుంటున్నారు. కవిత్వం భాష యొక్క భాష అన్న మో మాటను మరిచిపోయారు.



కవిత్వం-డిక్షన్-5

దక్షిణాది భాషల్లో తెలుగు కవిత్వానికి ప్రత్యేక స్థానముందని భావిస్తారు. 1930 ఆర్థిక మాధ్యం శ్రీశ్రీలాంటి మహాకవులను సృష్టించింది. ఒక కొత్త డిక్షన్‌తో కవిత్వం మొదలెట్టిన కవి శ్రీశ్రీనే అని చెప్పవచ్చు. కుందుర్తి నేరేటివ్ పొయెట్రీ నిర్మాణాన్ని అంతకు ముందే శ్రీశ్రీ రాసి చూపించాడు. మహాప్రస్థానం తర్వాత మరో ప్రస్థానం కవితా సంపుటిలో శ్రీశ్రీ కవిత్వ డిక్షన్ మారిపోయింది. భాషలో, అభివ్యక్తిలో చాలా మార్పు వచ్చింది. శబ్ద చిత్రణ కవిత్వం కాదని శ్రీశ్రీ తెలుసుకున్నాడు. అటు తర్వాత ఆరుద్ర సినీవాలి, శ్రీరంగం, నారాయణబాబు, రుధిరజ్యోతి, బైరాగి నూతిలో గొంతుకలు, తిలక్ అమృతం కురిసిన రాత్రి, మొదలైన కవితా సంపుటాల్లో కవిత్వం డిక్షన్ కొత్తగా మెరిసింది. ఎవరి పంథాలో వారు కవితా నిర్మాణాలు చేపట్టినా అందులోని గొప్ప ఇమేజరి తెలుగు కవిత్వాన్ని మెస్మరిజం స్థాయికి తీసుకెళ్లింది. ఆ తర్వాత వచ్చిన శేషేంద్ర, అజంతా, మో.శివారెడ్డి, ఇస్మాయిల్, తదితరులు కవిత్వంలో కొత్త ప్రతీకలు, కొత్త భావాలు, కవిత్వపు భాషలో విరుపులు, మెరుపులు, ఆంగ్లభాషా పదబంధాలు, సరికొత్త వాక్యనిర్మాణం, పదబంధాలు, ఇమేజరి, ఈస్తటిక్ సెన్స్...ఇలా అనేకాంశాలు వచన కవిత్వానికి సొగసులద్దాయి. అయితే ఇటీవల కాలంలో వస్తున్న కవిత్వంలో వస్తు వైవిధ్యం ఉన్నట్టు కనిపించినా ఒకే వస్తువుపై అనేకమంది కవితలు రాస్తున్నారు. అలాగే కవితా నిర్మాణంలో రూపంలో అనుకరణ పెరిగిపోయింది. చక్కని తెలుగు పదాలు, పదబంధాలు ఉన్నప్పటికీ, ఆంగ్లపదాలను ఇరికిస్తే అదేదో గొప్ప కవిత్వమనుకొంటారని, అవసరం లేకున్నా ఆంగ్ల పదాలను, కృతకభాషను సృష్టించుకుంటున్నారు. కవిత్వం భాష యొక్క భాష అన్న మో మాటను మరిచిపోయారు. గతం కంటే ఇప్పుడు కవితా సంకలనాలు ఎక్కువగానే వస్తున్నాయి. కాని వాటిలో కవిత్వాన్నివెతుక్కోవాల్సి వస్తుంది. ఎవరికి తోచిన విధంగా వారు కవిత్వం రాసి, కవిత్వం తెలియని వారితో ముందు మాటలు రాయించి తాము పెద్ద కవులై పోయినట్టు ఫోజులు కొడుతుంటారు. కవిత్వం రాని కవులు రాసిన కవితా సంపుటాలకు కవిత్వమంటే తెలియని న్యాయనిర్ణేతలు ఇచ్చిన అవార్డులను చూసి పాపం...అదే కవిత్వమని యువకవులు భ్రమపడకండి. ఎందుకంటే కవిత్వం రాయటం ఒక కళ. కవిత్వాన్ని ఆస్వాదించడం కూడా ఒక కళే. కవిత్వాన్ని ప్రోత్సహించడానికి గొప్ప సహృదయముండాలి. గొప్ప సహృదయమున్నవాడే గొప్ప కవి. అయితే అందరూ గొప్ప కవులు, మహాకవులు కాకపోయినా మంచి కవులుగా రాణించాలంటే కవిత్వం రాయటాన్ని సీరియస్ యాక్టివిటీగా చేపట్టాలి. ఏ ఉద్యోగం చేస్తున్నా,ఏ పనిచేస్తున్నా,రోజూ కొంత సమయం కవిత్వం చదవటానికి,రాయటానికి కేటాయించాలి. కవిత్వం డిక్షన్ సాధించడమన్నది ఒక నిరంతర తపస్సు అని యువకవులు భావించాలి. ఏదో గుర్తింపుకోసం నాలుగు కవితలు రాశాం. ఫేస్‌బుక్‌లో పెట్టాం...కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాం. శాలువాలు కప్పించుకున్నాం. అంటే సరిపోదు. కవిత్వం లేని కవిసమ్మేళనాలు, వాసనలేని పూలతోటల్లాంటివని గుర్తించాలి. కవిత్వపు మెరుపులు లేని కవితా సంపుటాలు రంగులు లేని సీతాకోక చిలుకలని గమనించాలి. కవిత్వం పండాలంటే కవిగుండె నిరంతరం అగ్ని సదస్సులా మండుతుండాలి. మెదడులో కొత్త కొత్త ఆలోచనలు తటిల్లతల్లా తళుక్కుమనాలి. కవితల్లో గొప్ప ఇమేజరీ మెరుపులు చిందాలి. గొప్ప ఇమేజరీతో రాస్తున్న కవులెందరో ఉన్నారు. వారిలో కెన్‌స్మిత్స్ ఒకరు. ఆమె రాసిన 'ఇన్స్ ప్రైజ్ ఆఫ్ ఓడ్కా' కవితలో 'ది టేస్ట్ ఆఫ్ ఎయిర్, ఆఫ్ విండ్ ఆన్ ఫీల్డ్స్, ది విండ్ త్రూ ది లాంగ్వెట్ ఫారెస్ట్' అన్న కవితా పాదాల్లోని ఇమేజెస్ కంటికి కనిపించవు కాని మనసులో దృశ్యాలు దృశ్యాలుగా కదులుతాయి. అలాగే జేమ్స్ బెర్రీస్ సీ షెల్ కవితలోని సముద్రపు అలల ఇమేజరి చెవులకు వినిపించేలా ఉంటుంది. అయితే కవిత్వంలో ఇమేజరీ కల్పనలో ఎన్నో మసాలాలను జోడించాలి. కవితను చక్కని పదచిత్రాలతో ముస్తాబు చేయాలి. పదచిత్రమంటే ఏదైనా ఆలోచనను, అనుభూతిని, భావావేశాన్ని, లేక దృశ్యాన్ని అందంగా వర్ణించి చూపించాలి. అనుభూతులన్ని ఇంద్రియానుభవాలే కదా? అలాంటి అనుభూతులను కళాత్మకంగా రసాత్మకంగా, సౌందర్యాత్మకంగా వ్యక్తీకరించడానికి పదచిత్రాలు లేక భావచిత్రాలు బాగా ఉపయోగపడుతాయి. పాశ్చాత్య విమర్శకులు imagery in poetry creates similar snapshots in a readers mind అన్నారు. కవితను చదువుతుంటే దృశ్యాలు అలా కదిలిపోతుండాలి. తమ అనుభవాల పోలికలు ఆ కవిత్వపు షాట్స్‌లో ఉండాలి. అప్పుడే పాఠకుడు ఎమోషనల్‌గా ఫీలయి ఆ కవి పోయెమ్‌తో కనెక్టవుతాడు. mind Sylvia plath రాసిన డాడి కవితలోని ఇమేజరి రీడర్స్‌ను విస్మితులను చేస్తుంది.

'ది బూట్ ఇన్ ది ఫేస్' యు స్టాండ్ అట్‌ది బ్లాక్ బోర్డ్, డాడి' ఇవి విజ్యువల్ ఇమేజెస్. అయినా ఇందులో మనం బూట్, బ్లాక్ బోర్డును చూస్తూ పోల్చుకుంటాం. ఇలాంటి ఇమేజెస్‌ను సీరిస్‌గా చూస్తే మనం భావోద్వేగాలకు గురవుతాం. ఇలా సీరిస్ ఆఫ్ ఇమేజెస్‌ను కవితలో వాడటాన్నిConflation అంటారు. కొన్ని క్యారెక్టరిస్టిక్స్‌ను ఒకదానితో ఒకటి ఐడెంటిఫై చేయడాన్ని కాన్‌ఫ్లాషన్ అంటారు. ప్రత్యేక అర్థాలకోసం వాడే పదాలను బట్టి Logical Conflation అని Congruent Conflation అని వేరువేరుగా పిలుస్తారు. అయితే మంచి ఇమేజరీతో కవితలు రాసిన వారిలో wild geese కవితను రాసిన mary oliver ఒకరు. ఆమె 'mean while the sun and the clear pebbles of the rain' అంటూ ఆ కవితలో వర్ణించారు. clear pebblesఅన్నది వర్ణన. ఇక్కడ మన sense of soundను ఉపయోగించి ఊహించుకోవాలి. ఇది పూర్తిగా ఇంతకు ముందు చెప్పుకున్న plaths daddy పొయెం ఇమేజరీకి విరుద్ధమైంది. 'మరణించి నా శరీరాన్ని గొడ్డలి పారతో ముక్కలు చేసిన కట్టెమంటల్లో బొగ్గు చేయడం అసహ్యంగా ఉంది నా మనసుకు' 'అక్కడ నుంచే ప్రపంచమంతా రాబోయే తరాలకు నేను శాంతి పరిమళాల్ని వ్యాప్తి చేస్తాను' అన్న ఇరోంచానూ శర్మిలా 'శాంతి పరిమళం' కవితలోనూ రెండు రకాల ఇమేజరీని చూడవచ్చు. ప్రతి కవిత ఇమేజిస్ట్ పొయెం కాకపోవచ్చు. ఇంద్రియాలను ఉద్దీపింపజేసే క్రొగొరీస్ ఇమేజస్‌ను చాలామంది కవులు తమ కవితల్లో ఉపయోగిస్తున్నారు. కొత్తగా కవితలు రాసే కవులు ఇమేజస్ గురించి జాగ్రత్త పడాలి. 'నేను పక్షిని చూశాను' అందులో స్పెసిఫిక్ ఇమేజేముంది? simile ఏముంది? ఆపక్షి రంగుల గాలిపటంలాగుంది. అంటే అందులో వెరైటీ ఇమేజరి ఉంది అలాగే పవర్‌ఫుల్ ఇమేజస్‌ను సృష్టించడాన్ని ఫిగరేటివ్ ల్యాంగ్వేజ్(figurative language) అంటారు. కవిత్వంలోని ఇమేజరి మనకు సరికొత్త అనుభవాలనిస్తుంది. అనుభూతుల పరిమళాలు పంచుతుంది. మనసొంత జ్ఞాపకాలకు, అనుభవాలను కొత్త వెలుగుల్లో చూపెడుతుంది. పెద్ద ప్రపంచాన్ని చిన్న కవితలో ఓ కవి కేవలం ఇమేజస్ ద్వారానే చూపెట్టగలడు. కవితా నిర్మాణం డిక్షన్‌లో వచనకవిత్వపు భాషతో పాటు ప్రతీకలు ఎలా కవితలో ఒదిగించాలో యువకవులు తెలుసుకోవాలి. ప్రతీకలు ఎందుకువాడాలి? అంటే ఒక వస్తువును చెప్పి మరొక వస్తువును అనుభూతికి తేవటం ప్రతీక లక్షణం. గనక అనుభూతి ప్రధానమైన కవిత్వానికి ప్రతీకలు సోపానాలవుతాయి. భావనాబలం, ప్రతీకలు, చక్కని పదబంధాలే గాక అద్భుతమైన ఇమేజరీతో కవిత్వం రాస్తూ రుచికరమైన వచనకవిత్వపు వంటను వండుతున్న కవిత్వపు వలలుడు బివివి ప్రసాద్..ఆయన ఆకాశం, నీలో కొన్నిసార్లు దృశ్యాదృశ్యం, నేనే ఈ క్షణం, కవితా సంపుటాలు, హైకూల సంకలనాల్లో అద్భుతమైన ఇమేజరీని చూడవచ్చు.

భయపడినప్పుడు మనిషి ముఖం అరణ్యమౌతుంది
అతని కళ్లల్లో ఏవో మృగాలు విశ్రాంతి లేక తిరుగుతాయి.

అడవిలో వికసించి రాలిన అనామక పుష్పంలా
ఎవరూ చూడనప్పుడు ఎగురుతూ వెళ్లిపోయిన పేరుతెలియని పిట్టలా
అక్షరాలు గుర్తించేలోపు అదృశ్యమైన ఊహలా
గుడి తలుపులు మూశాక లోపల వెలుగుతున్న దీపంలా
నిశ్శబ్దంగా బ్రతికితే ఏమిటి? నిరాడంబరంగా వెళ్లిపోతే ఏమిటి?

ప్రసాద్ కవితల్లో ఇమేజరి మజ్జిగను చిలుకుతున్నప్పుడు వెన్నెలా బయటపడుతుంది.croggories images తో sense లోకి శబ్దాలను, దృశ్యాలను వొంపుతాడు. ప్రకృతి, ఆకాశం, పక్షులు, నదులు, పువ్వులు, కనిపించే ఆ...ఇమేజరీలో దృశ్యాలైతే, దయ, ప్రేమ, శాంతి, స్నేహం, ఆయన కవిత్వంలో కనిపించని ఇమేజస్‌లు, అనేక ప్రతీకలతో, అందమైన పదబంధాలతో సరికొత్తగా కనిపిస్తాయి. భయపడినప్పుడు మనిషి ముఖం అరణ్యం కావడాన్ని ఎవరైనా ఊహిస్తారా? అనామక పుష్పం, పేరు తెలియని పిట్ట, అదృశ్యమైన ఊహ, గుడి తలుపులు మూశాక వెలుగుతున్న దీపం... ఇలా అనేక ప్రతీకలతో బతుకును ఉపమింపజేస్తూ ఒక తీవ్రమైన తాత్విక ఆలోచనతో వాటిలా బతికితే ఏమిటి? నిరాడంబరంగా వెళిపోతే ఏమిటి? అన్నప్పుడుwhen we compare the snapshots in our mind to our memories or experiences, we connect emotionally to the poem అన్నట్లు బివివి ప్రసాద్ కవిత్వంతో ఎమోషనల్‌గా కనెక్టయిపోతాం. అందుకే నేడు కవిత్వం రాస్తున్న చాలా మంది కవులు కవితా నిర్మాణం పట్ల, ప్రతీకలు, కవిత్వపు భాష, మోటపర్ల వాడకం, గొప్ప ఇమేజరీ సృష్టించడం పట్ల జాగ్రత్తలు తీసుకున్నప్పుడే మంచి కవితలు రాయగలరు.

(యువకలాల కోసం -ఆధునిక వచన కవితా నిర్మాణ పద్ధతులు)

- బిక్కి కృష్ణ
8374439053

ఒక కవి వియోగ చింతన

అనంతయాతనగా సాగుతున్న జీవనయాత్రలో ఏకపక్షంగా జరుగుతున్న అంతర్గత సంభాషణను దివ్యలోక ఉన్మత్త అమృతనాదంగా భావిస్తూ మానవాతీతను మధుర సంవేదనగా సంభావిస్తూ, వాస్తవిక స్వప్న సాదృశ్య చలనశీలై నడుస్తున్న ఒక కవి ఆవేదన వినాలంటే దేవిప్రియ రాసిన ఇం...కొకప్పుడు కవితా సంపుటిని చదవాల్సిందే!

రెండు కట్టెలు కాలప్రవాహంలో కలసి పయనిస్తూ పయనిస్తూ విడిపోవడం, ఒంటరితనంలోకి వెళ్లిపోవడం ఊహిస్తూ ఒంటరితనపు వల అనే కవితలో దేవిప్రియ నేను లేని నిన్ను పలుమార్లు/ ఊహించి చింతలో మునిగాను కానీ/ నువ్వులేని నన్ను ఎన్నడూ/ ఏ క్షణంలోనూ ఊహించలేకపోయాను నా జీవన సన్నివేశం నుంచి/ నువ్వు అకస్మాత్తుగా అంతర్థానమై/ నా నవనాడులూ కుంగిపోయి/ నేనొక ఏకాంతవలలో చిక్కి గిలగిల లాడుతూ/... నీ మీద ఒట్టు/ నువ్వులేని నన్ను నేనెప్పుడూ/ క్షణమాత్రం కూడా ఊహించలేక పోయాను అంటూ తన జీవిత భాగస్వామి తాను లేకపోతే ఎట్టా బాధపడుతుందో నంటూ ఊహిస్తాడే కాని, తన భాగస్వామి ముందే వెళ్లి పోతే తానేమౌతాడోనన్న సంగతి ఊహించని నిస్వార్థమైన ప్రేమను వ్యక్తీకరిస్తాడు కవి.



కవి ఉన్నట్లుండి జీవితం మీద విముఖత వ్యక్తపరుస్తూ ఏకాంత ఆలోచనా గర్భంలోకి వెళ్లిపోతాడు. మకర మత్స్య పన్నగ సన్నిధానంలో తన్ను వేలాడనీయమంటాడు. కవికి ఎటు చూసిన ఏపుగా పెరిగిన జ్ఞాపక వృక్షాలే కనిపిస్తాయి. కవి గత కవిత్వానికి ఈ కవిత్వానికి అభివ్యక్తిలో గొప్ప మార్పు కనిపిస్తుంది.

తోడు నీడగా బతికే జంటలో ఒకరు పోయాక రెండోవారు ఊపిరాడని స్థితిలో, నిస్సహాయులై పోతారు ఈ స్థితిని కవి నువ్వులేని తొలి పెళ్ళిరోజు అనే కవితలో గుండెను పిండే విధంగా ఆవిష్కరిస్తాడు నువ్వు లేకుండా వచ్చిన తొలి పెళ్ళిరోజుని/ వెక్కి వెక్కి ఏడవకుండా/ గడపడం యెలా?/ అంటూ ఎంతో అమాయకంగా ప్రశ్నిస్తాడు. నాకు బొత్తిగా తెలియని/ అసలు చేతకాని /ఈ విద్యలతో సతమతమవుతున్న నాకు/ ఏది. దారి రాజీ? / అంటారు నువ్వులేని జీవితం/ ఒక బీభత్సమైన తుపానులా/ ఒక అనుక్షణ భూకంపంలా/ ఊపిరాడకుండా ముఖానికే కొడుతున్న / గాలివాన జల్లులా వుంది అంటూ తన దయనీయ స్థితిని వ్యక్తీకరిస్తాడు కవి.

తన తోడు కరువయ్యాక కవికి తనయిల్లు కూడా పరాయి ఇల్లు లాగానే ఉంటుంది. నువ్వు లేని మన ఇల్లు/ నన్ను అణువణువూ భయపెడుతోంది/ నువ్వు లేని ఇంట్లో/ అడుగు పెడితే. ఎవరో పరాయి ఇంటిలో ప్రవేశించినట్టుంటోంది/ అక్కడున్న ఆకాసేపూ / నేనొక యంత్రంలా తిరుగుతున్నాను/ అంటూ తన ప్రాణమైన జీవిత భాగస్వామి తనతో కూడా తన జీవన చైతన్యాన్ని ఊపిరిని కూడా తీసుకు వెళ్లినట్లు భావిస్తాడు కవి. 2014లో జీవన సహచరిని పోగొట్టుకున్నాక దేవిప్రియ హృదిలో పొరలుపొరలుగా తెరలే దిగులును దుఃఖాన్ని కవిత్వంగా ఒలుసుకున్నాడు. దిగులు కుంపటి మీద కవితా శ్వాసలతో కటిక చీకట్లను ఊహిస్తూ అనంతాన్వేషణతో మానసిక యాత్ర చేస్తాడు తన రాజ్యలక్ష్మి కోసం. తన, జీవిత భాగస్వామిని ఒక దేవతగా భావిస్తాడు. రాజీ/ నాకు శక్తి ఇవ్వు ముందుకు చూడడానికి/ ఈ కొత్తల వంతెన మీద నడిచి వెళ్ళడానికి/ కన్నీళ్ళ వరదలో మునిగిపోకుండా/ నీకోసం యెదురు చూడడానికి అంటూ తన దుఃఖాన్ని తట్టుకునే మార్గాన్వేషణకు ఒక మంత్రాన్ని ఉపదేశించమంటాడు. మనుషుల్లో ఎన్నో రకాలున్నా ఈ కవికి తన భార్యావియోగంలో రెండు రకాలుగానే కనిపిస్తున్నారు మనుషులు ఇప్పుడున్నది రెండు రకాలు/ మరణించిన వాళ్ళు/ మరణించబోతున్న వాళ్ళు అంటారు.

అమృతమయమైన, ఆత్మీయమైన, ప్రేమాన్వితమైన తోడు, తోడుగా ఉన్నన్నినాళ్ళే ఆట అద్భుతంగా సాగుతుంటూంది. ఒకరు లోపిస్తే నడుమ తెరపడకుండా సాగే అనేక అంకాల/ మహానాటకం ఈ ప్రాణం/ వెయ్యి వయొలిన్ల విశ్వవాద్య గోష్ఠి/ ముగిసిన తరువాత ఖాళీ అయిన/ ఆవరణని ఆవరించిన/ ప్రగాఢ నిశ్శబ్దం నాశేషజీవితం అంటూ ఇక మీద జీవితం ఏ విధంగా నిశ్శబ్దంలోకి వెళ్ళిపోతుందో కవి అంతరాత్మ ఆవేదనా పూర్వకంగా ఆవిష్కరిస్తుంది. అందుకే కవి గారంటారు ఒంటరితనాన్ని గూర్చి చెప్తూ ఈ దిగులు/ భూమి కన్నా బరువు/ నా వగపు/ ఏటికన్నా లోతు/ ఈ కోత /కత్తికన్నా పదును అంటారు.

సముద్రంలో పయనించే నావకు దిక్సూచీ లేకపోతే పయనంలో గమ్యం తెలదు. అగమ్యం గోచరిస్తుంటుంది. అంతే జీవితభాగస్వామి దిక్సూచై నడిపే ఆమె లేకపోతే చీకటిలో తడుముకుంటూ/ వేదనలో ముడుచుకుంటూ/ ఆ గమ్యాన్ని తలచుకుంటూ/ ఇక యెంతదూరం పోగలనో? అనుకుంటూ ఒక నిస్పృహ, నిరాశలోకి వెళ్లిపోతుంటారు.


వయస్సు మీదపడ్డాక, సతీవియోగమంత బాధ మరేది ఉండ దు. ఎటుచూసినా నిరాశ. దుఃఖం చుట్టమై వస్తుంది. దిగులు ఇంట్లోనే తిష్ఠవేసి కూర్చుంటుంది. జ్ఞాపకాల కొరడాలు ఒడలు చీరేస్తుంటాయి. ఏదీ అందనట్టే, ఏదీ పొందనట్టే. చుట్టూ తెలీని పంజరాలు. తనివి తీరని తపన, ఎన్నో బీభత్సాలు వెంటాడుతూ ఒంటరినిచేసి వేధిస్తుంటాయి. ఈ స్థితిలో నేనొక/ దారి తప్పిన చేపపిల్లలా/ ఆందోళన. నది అడుగున/ అటూ ఇటూ అగమ్యంగా ఈదులాడుతుంటాను/ ఏటి నీటిలో/ ఎంత తాగినా తీరని దాహం నాది అంటారు.

ఇం...కొకప్పుడు అనే కవితా సంపుటలో దేవిప్రియ సతీవియోగ దుఃఖం కవిత్వాన్ని తారాస్థాయికి చేర్చింది. దేవిప్రియ రాసిన ఇంకొకప్పుడు అందరూ చదువతగిన కవితా సంపుటిగా భావిస్తూ కవిని అభినందిస్తున్నాను.

-కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి
9948774243

అక్షర సత్యాల ఔను...నిజం!

వ్యక్తిలో అంతర్గతంగా మెదిలే భావాలకు అక్షరరూపమివ్వడమే కవిత్వం. కవి ఆలోచనా ప్రపంచం ఎంత విశాలమైతే అంత మంచి కవిత్వం వెలువడుతుంది. అలాగే కవి సమకాలీన ప్రపంచపు అవకతవకల్ని చూస్తూ మనకెందుకులే అని తప్పించుకుపోలేడు. అలాంటి అంశాలను తన కవిత్వంలోకి తీసుకోవడం జరుగుతుంది. ఇది కవి కనీస బాధ్యత. అలాంటి బాధ్యతతో ముందుకు సాగే కవయిత్రి మాదిరాజు మాలతి. తేలిక పదాలతో, సూటిగా విషయాన్ని తెలపటం మాలతిలో ఉన్న ప్రత్యేక లక్షణం. అలాంటి సూటితనంతో ఆమె 'ఔను... నిజం'' పేరుతో ఒక మినీ కవితా సంపుటిని వెలువరించారు. ఇందులోని కవితలన్నీ నేటి సమాజానికి ప్రతిబింబాలే.



పేజీలు-64,
వెల-అమూల్యం,
ప్రతులకు- సృజన సాహితీ సమాఖ్య, సత్తుపల్లి-507303,
ఖమ్మం జిల్లా,
సెల్ నెం.9949804565

''సమాజంలోని దురాగతాలను దుయ్యబడే యుక్తికంటే రూపుమాపే చిత్తశుద్ధి చాలని, నొక్కి వక్కాణిస్తూ పౌరుల బాధ్యతలను గుర్తు చేశారు. ప్రేమించలేదనే ఉక్రోషంతో ప్రాణాలు హరిస్తున్న శాడిస్టుల గురించి ప్రేమ ముసుగులో వారు చేస్తున్న అకృత్యాలను వివరించారు'' అంటూ మాలతి కవిత్వం గురించి వివరించారు ఎన్.రవి తన ముందు మాటలో. రవి తెలిపినది అక్షరసత్యమని ఈ కవితా సంపుటిలోని కవితలు చదివితే విశదమవుతుంది. మాదిరాజు మాలతి బాధ్యత గల ఉపాధ్యాయురాలిగా విద్యార్థు లను తీర్చిదిద్దే పనిలో నిమగ్నమైనారు. జిల్లా స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డులు పొంది ఉన్నారు. విద్యార్థులనే గాక సమాజాన్ని సరిదిద్దాలనే లక్ష్యంగలవారు. రచయిత్రిగా ఆ బాధ్యతను నిర్వహించడంలోనూ ఆమె ముందు నిలుస్తున్నారు. ఆక్రమంలో వచ్చినదే ఈ ఔను...నిజం కవితా సంపుటి.


ఆనాటి బాల్యానికి/ ఆటవిడుపు/ఈనాటి బాల్యానికి/ర్యాంకుల జడుపు అంటూ నేటి విద్యావ్యవస్థలో బాల్యం బలైపోతున్న వైనాన్ని వివరిస్తారు.

చెట్ల జీవనానికి వర్షమవసరం/వర్షం రాకకు చెట్లు ఆకరం/ ఒకరి మనుగడకు మరొకరు/ఔను! పరస్పర సహకారం అవశ్యం అంటూ చెట్ల అవసరాన్ని తెలుపుతారు. పట్టుదల-పక్షిగూడు/ ఏకాగ్రత -సాలెపురుగు/ త్యాగనిరతి-తరువు/ ఇవి వ్యక్తిత్వ వికాస గురువులు అని ఒక సత్యాన్ని ఆవిష్కరిస్తారు. అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల/కవిత కర్తృత శ్రీశ్రీ మాట/గడ్డీ గాదం కూడా/ కుంభ కోణాల కర్షం- ఇది నేతల బాట అంటూ రాజకీయ నాయకులకు చురకలంటిస్తారు ఒక కవితలో మాలతి. ఇలా'ఔను ...నిజం!' కవితా సంపుటిలోని కవితలన్నీ అక్షర సత్యాలతో ఆకట్టుకుంటాయి. కవితలింకా చిక్కదనంతో వెలువడాల్సి ఉంది. ఆ దారిలో మాదిరాజు మాలతి పయనించాలని ఆశిద్దాం.

- నియోగి
9553097319

యువతకు నడతను నేర్పే జనరేషన్ జెడ్

సామాజిక మాధ్యమాల ప్రభావం యువతపై ఎక్కువగా ఉంది. రోజులో అధిక భాగం యువత సామాజిక మాధ్యమాల ద్వారానే ఎక్కువ మాట్లాడు కోవడం జరుగు తోంది. దీనినే చాటింగ్ అంటున్నారు. యువత దైనందిన జీవితం గురించి విశ్లేషణతో పాటు మంచి యువత ఎలా ఉండాలనే దాని పై వృత్తి రీత్యా సీనియర్ పోలీసు అధికారి అయిన బి.మరియకుమార్ విశ్లేషణాత్మకంగా రాసిన పుస్తకమే జనరేషన్ జెడ్.



సమాజంలో తాను చూసిన సంఘటనలను సంకలనం చేసి ఆయన రాసిన ఈ పుస్తకంలో మొత్తం పదకొండు అధ్యాయాలు ఉన్నాయి.యువత -జీవితం, ఆరోగ్యం,మనస్తత్వం,సామాజికం, ఆర్థికం,సంబంధం, పర్యావరణం, సాంకేతికం, నిర్వాహకం, మంచితనం, ఆనందం అనే అధ్యాయాల్లో ఆయన యువత తీరుతెన్నులు,అలవాట్లు,వారు ఎదుర్కొనే సమస్యలు, సమాజం మొదలైన అంశాల గురించి కూలంకషంగా చర్చించారు.యువతపై ఎందుకు రాయాల్సి వచ్చిందంటే వాళ్ళు మన భవిష్యత్తు, మన సమాజం, మన దేశం,మన ప్రపంచం, వాళ్ళు రేపు ఎలా వ్యవహరిస్తారో దాని మీద ఆధార పడి ఉన్నాయని అంటారు ఆయన. ఆయన గతంలో తెలుగు,ఆంగ్ల భాషల్లో రచనలు చేశారు. మహిమలేశ శతకం,సంజీవయ్య శతకం,ఇందిరాపార్కు ముచ్చట్లు,వన్నెల దొరసాని,నేను,ఆనందంగా ఉండాలంటే మొదలైన తెలుగు పుస్తకాలు,బి హ్యాపీ, బి సెల్ఫిష్ బట్ గుడ్, అనే ఆంగ్ల పుస్తకాలు రాశారు. జనరేషన్ జెడ్‌లో డిజిటల్ టెక్నాలజీ యుగంలో యువతకు కావల్సిన మార్గదర్శకాలు ,వెనకటి తరంతో పోలిస్తే నేటి యువతలో స్వార్థం పెరిగిందా?ఆధునిక సమాజంలో పెద్దవారు,యువజనుల మధ్య సంబంధాలు మొదలైన అంశాల గురించి ఆయన విపులంగా చర్చించారు. ఆలోచనలు రేకెత్తించే అంశాలు ఎన్నో ఉన్నాయి ఇందులో. ఈ పుస్తకానికి మరియ పుత్ర శతకం అని పేరు కూడా పెట్టారు. ఈ పుస్తకాన్ని తన శ్రీమతి విజయలక్ష్మికి అంకితం ఇచ్చారు.ఈ పుస్తకం విక్రమ్ మోడరన్ సీరీస్ కింద వెలువడింది.

- అనంత పద్మనాభస్వామి

సాహిత్య వార్తలు

గిడుగు రామమూర్తి పంతులు జయంతి

ఆగస్టు 29 తేదీన వ్యవహారిక భాషోద్యమ పితామహులు, రావుబహద్దూర్ గిడుగు రామమూర్తి పంతుల జయంతి ఉత్సవాలు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6గంటలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ప్రముఖ నవలా రచయిత ప్రభాకర్ జైని, విమర్శకులు జి. లక్ష్మీనర్సయ్య, ప్రముఖ కవి శిఖామణి తదితరులకు పురస్కారాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బి. చంద్రకుమార్, ఆంధ్రప్రభ ఎడిటర్ వై.ఎస్.ఆర్.శర్మ, నళేశ్వరం శంకరం, బైస దేవదాస్, కాంతి కృష్ణ, పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొంటారు.

- బిక్కి కృష్ణ, కార్యదర్శి
గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, హైదరాబాద్.

పాదముద్రలు ఆవిష్కరణ

ప్రభాకర్ జైన్ రచించిన 'పాదముద్రలు' పుస్తకావిష్కరణ సభ 3-9-17 సాయంత్రం ఆరుగంటలకు రవీంద్రభారతి మినీహాల్ నందు జరుగుతుంది. బిక్కికృష్ణ అధ్యక్షతన జరిగే ఈ సభలో ముఖ్య అతిథిగా డా॥ ఎన్.గోపి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రభ ఎడిటర్ వై.ఎస్.ఆర్. శర్మ, అన్వర్, బైసా దేవదాసు, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొంటారు.

డా॥రాచపాళెంకు అద్దేపల్లి పురస్కారం

నిరంతర సాహితీ సంచారి, మహాకవి డా॥అద్దేపల్లి రామమోహనరావు పేరిట తెలుగు కవితా విమర్శకు పురస్కారాన్ని ఇవ్వడానికి నిశ్చయించాము. 2017వ సంవత్సరానికిగాను డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి డా॥అద్దేపల్లి రామమోహనావు కవితా విమర్శ పురస్కారాన్ని అందచేయడం జరుగుతుంది. 6-9-2017న కాకినాడలో జరిగే అద్దేపల్లి జయంతి సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తాము. ఈ పురస్కారం కింద రూ.పదివేల నగదు, మెమెంటో ప్రదానం చేయడం జరుగుతుంది.

అద్దేపల్లి ఉదయ భాస్కరరావు,
అద్దేపల్లి కవితా విమర్శ పురస్కార వ్యవస్థాపకులు, కాకినాడ


బి.వి.ఆర్.మెమోరియల్ ట్రస్టు జాతీయ స్థాయి కవితల పోటి

బి.వి.ఆర్. మెమోరియల్ ట్రస్టు మల్లెతీగ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీకి 30 పంక్తులు మించని సామాజిక స్పృహ కలిగిన కవితలను ఆహ్వానిస్తున్నాం. ఒక్కొక్కరు రెండు కవితలు పంపవచ్చును. మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా వరుసగా 2000/-రూ.లు, 1500/-రూ.లు, 1000/-రూ.లు ఇవ్వబడతాయి. మూడు ప్రోత్సాహ బహుమతులకు ఒక్కో బహుమతిగా 500/-రూ.లు చొప్పున ఇవ్వబడును. కవితలు చేరవలసిన చివరతేదీ సెప్టెంబరు 30వతేది. కవితలు పంపవలసిన చిరునామా: బండికల్లు జమదగ్ని,, ఎం.బి.ఏ.402, హిమజ టవర్స్, 3/10, బ్రాడీపేట, గుంటూరు-522002, మరిన్ని వివరాలకు 9848264742 నెంబర్‌లో సంప్రదించవచ్చును.

బండిపల్లి జమదగ్ని-అధ్యక్షులు, బండిపల్లి శ్యామ్‌ప్రసాద్-కార్యదర్శి, బి.వి.ఆర్. మెమోరియల్ ట్రస్టు

'భగీరథ'కు ఇసుక తిప్పలు

●ఇంట్రా పనుల వాహనాలను సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు ●ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులిచ్చిన అనుమతులు బుట్టదాఖలు ●ఆందోళనలో ఇంట్రా కాంట్రాక్టర్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ఇంట్రా పనులకు ఇసుక తిప్పలు తీవ్రంగా వేధిస్తున్నాయి. ఇసుక కొరతతో ఇంట్రాపనులు ముందుకు సాగడంలేదు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఇసుక వాహనాలను సీజ్ చేస్తున్నారు. మిషన్ భగీరథకు ఇసుకను తరలిస్తున్నామని చెప్పిన కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు జారీ చేసిన అనుమతులు చెల్లవని ఆయా మండలాల రెవెన్యూ, పోలీసు యంత్రాంగం బుట్టదాఖలు చేస్తున్నారు. దీంతో ఇంట్రా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ పనులకు ఇసుక తరలించుకునేందుకు గనుల శాఖ అనుమతులు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గనులశాఖ జారీ చేసిన నిబంధనలను స్థానిక రెవెన్యూ, పోలీసులు పట్టించుకోవడం లేదు. వాహనాలను సీజ్ చేసి కేసులు పెడుతున్నారు. దీంతో ఇంట్రాపనులకు ఆటంకం కల్గుతున్నట్లు సమాచారం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మొరపెట్టుకున్నా కూడా సమస్య పరిష్కారం కావడం లేదు.

రాష్ట్రంలో ఇసుకను ఇసుక రీచ్‌ల ద్వారా కాకుండా మాఫియా యథేచ్ఛగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిలో రెవెన్యూ, పోలీసు అధికారుల హస్తమున్నదని ఇటీవల వెలుగు చూసింది. దీంతో గనులశాఖ ఇసుక పాలసీలో పలు కఠినమైన నిబంధనలు రూపొందించింది. ప్రభుత్వ నిర్మాణాలకు వెసులుబాటు కల్పించింది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు ఈ నిబంధనలను పాటించడం లేదు. ఇసుక తరలించే వాహనాలను జియో ట్యాగింగ్ చేయాలని గనులశాఖ నిబంధనల్లో పేర్కొంది. కానీ చాలా మండలాల్లో జియో ట్యాగింగ్ చేయలేదని తెలిసింది. జియో ట్యాగింగ్ చేసేందుకు వాహన యజమానులు కూడా ముందుకు రావడం లేదు. జియో ట్యాగింగ్ వల్ల తమకు గిట్టుబాటు ఉండదని వాహన యజమానులు వాపోతున్నారు. దీంతో ట్యాగింగ్ చేయకుండా ఇసుక అక్రమ రవాణాకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

వాస్తవానికి ఇంట్రాపనులు చేసేందుకు మొదట్లో స్థానిక కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో ఇంట్రా పనులను చేసేందుకు కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకొని పనులు ప్రారంభిస్తున్నారు. స్థానిక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్టర్లకు కూడా ఇంట్రా పనులు అప్పగించింది. కానీ ఇసుక విషయంలో అధికారులు చుక్కలు చూపెడుతుండడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 20,404 గ్రామాల్లో ఇంట్రా పనులు చేపట్టారు. ఈ గ్రామాల్లో 15,916 ఓహెచ్‌ఎస్ఆర్‌లను నిర్మించాల్సి ఉంది. వీటిని 4056 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ యోచించింది. ఇదే పద్ధతిలోనే ఆయా గ్రామాల్లోని స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశం ఇచ్చేందుకు నిబంధనలను కూడా ప్రభుత్వం సడలించింది.

ఈ ఏడాది డిసెంబర్ నాటికీ ప్రతి ఆవాసానికి సురక్షిత మంచినీటిని అందించాలని సీఎం కేసీఆర్ ఇటీవల నిర్వహించిన మిషన్ భగీరథ ప్రాజెక్టు సమీక్షా సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు తనకు జీవనర్మణ సమస్యయని కూడా ప్రకటించారు. కానీ అధికారుల మధ్య సమన్వయం లోపంతో ఇంట్రా పనులకు ఆటంకం కల్గుతున్నది. దీంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మాదిరిగా మిషన్ భగీరథకు ఉచితంగా ఇసుకను తరలించుకునే అవకాశం కల్పిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నా..

పట్టాలు తప్పుతున్న రైళ్లు

●మూడేళ్లలో 207 ప్రమాదాలు

●దాదాపు 1,135 మంది మృతి



ఇటీవల గోరఖ్‌పూర్‌లో జరిగిన రైలు ప్రమాదం (ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం రైల్వే భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. భద్రతా పరంగా అనేక చర్యలు తీసుకుంటుంది. రైళ్ల భద్రత కోసం కేటాయించేనిధులు రూ. 33,972 కోట్ల నుండి రూ. 54,021 కోట్లుకు పెంచారు. జోన్‌ల వారిగా భద్రతపైన ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి ఆధునీకరణ పనులు చేపట్టారు. కేంద్ర మంత్రి సురేష్ ప్రభు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది.

పట్టాలు తప్పిన సంఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికుల సంఖ్య పెరుగు తోంది. భద్రతా పరంగా గతంతో పోల్చకుంటే 48శాతం మెరుగుపడిందని, ప్రమాదాలు తగ్గుతున్నాయని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకూ, జరుగుతున్న ప్రమాదాలకు పొంతన ఉండటం లేదు. రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు 2014-15లో 63, 2016-17లో ఈ సంఖ్య 78కి పెరిగింది. యూపీఏ చివరి మూడేళ్లలో జరిగిన 157 రైలు ప్రమాదాల్లో 84 మంది మృతి చెందారు. వీరిలో 2011-12లోనే 73 మంది వరకు రైలు ప్రమాదాల్లో మరణించిన వారున్నారు. గత మూడేళ్లలో 207 రైలు ప్రమాదాలు జరిగి 1135 మంది మృతి చెందారు. గాయపడిన వారి సంఖ్య అంతకు మూడింతలు అధికంగా ఉంది.


2016-17లో అత్యధికంగా 193 మంది ప్రయాణికులు రైలు ప్రమాదాల్లో మృతి చెందారు. ముజఫర్‌నగర్ ప్రమాద మృతులతో కలిపి మొత్తం 249 మంది ప్రయాణికులు సురేష్ ప్రభు హయాంలోనే ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. భారత రైల్వే మంత్రిత్వ శాఖ ప్రమాదాలు, వాటి వల్ల మరణించిన వారి సంఖ్యను దాచిపెడుతుందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. 2014 నవంబర్‌లో సురేష్ ప్రభు రైల్వే మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాల నేపథ్యంలో ఆయన ఒక దశలో రాజీనా మాకు సిద్ధపడ్డారు. రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే విధంగా సురేష్ ప్రభుకు ప్రధాని మోడీ నచ్చజెప్పినట్టుగా తెలిసింది. మంత్రి రాజీనామా రాజకీయ దుమారానికి తావిస్తుందనే కారణంతోనే ప్రధాన మంత్రి ఆయన రాజీనామాను ఆమోదించలేదని కూడా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తదుపరి మంత్రివర్గ విస్తరణలో సురేష్ ప్రభును రైల్వే మంత్రిత్వ శాఖ నుండి తప్పించే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిసింది.

ఉత్కల్ రైలు ప్రమాద ఘటనలో 22 మంది మృతి చెందగా 156 మంది గాయపడ్డారు. గత ఏప్రిల్-జూన్ మధ్య కాలంలోనే సుమారు 15 రైలు ప్రమాదాలు జరిగాయని భారత రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. పాలకులు గత ప్రభుత్వాలను నిందిస్తూ జరుగుతున్న రైలు ప్రమాదాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఉత్కల్ రైలు ప్రమాద ఘటన సమయంలో విపక్షాలు విరుచుకుపడ్డాయి. కొంతకాలంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న చిన్న ప్రమాదాలను పరిగణలోకి తీసుకోవడం లేదని విపక్షాలు ఆరోపించాయి.

మరణంలోనూ వీడని స్నేహం

●రైలు కింద పడి యువకుల ఆత్మహత్య




చరణ్ నాగరాజు

మిర్యాలగూడ టౌన్, కెఎన్ఎన్ : ఆ ఇద్దరు ప్రాణ స్నేహితులు .. చిన్నతనం నుంచి ఒకేచోట పెరిగి ఒకే పాఠశాలలో విద్యనభ్యసించారు. గ్రామంలో జరిగే పండుగ కార్యక్రమాలు, వేడుకల్లో చురుకుగా పాల్గొనే వారు. ఒకరు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, మరొకరు మొబైల్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ స్నేహితులిద్దరూ చావులో కూడా తమ స్నేహం విడిపోలేదన్న రీతిలో ఒకేసారి బలవన్మరణానికి పాల్పడ్డారు. కారణాలేవైనప్పటికీ ఆ ఇద్దరి ఆత్మహత్య చర్చనీయాంశమైంది. నల్లగొండ జిల్లా, త్రిపురారం మండలం బాబుసాయిపేటకు చెందిన బచ్చు భద్రయ్య (లేట్), రేణుక దంపతుల రెండవ కుమారుడు బచ్చు చరణ్ (19), బూరుగు అంజయ్య, అరుణ దంపతుల మొదటి సంతానం బూరుగు నాగరాజు(20)లు ప్రాణస్నేహితులు. చరణ్ తండ్రి చనిపోవడంతో తల్లి రేణుక వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. నాగరాజు తండ్రి అంజయ్య గ్రామంలోనే కిరాణా దుకాణం నడుపుతున్నాడు. స్నేహితులిద్దరు శనివారం బాబుసాయిపేటలో వినాయక చవితి ఉత్సవ వేడుకల్లో పాల్గొని సాయంత్రం 6 గంటలకు నాగరాజుకు చెందిన ద్విచక్రవాహనంపై మిర్యాలగూడకు వచ్చారు. రాత్రి 8గంటల సమయంలో మున్సిపల్ కాంప్లెక్స్‌లో స్నేహితులను కలిసి వారితో కొంత సమయం కేటాయించారు. అనంతరం ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరిన ఇరువురు ఆదివారం తెల్లవారుజామున మండలంలోని కేశవనగర్ సమీపంలోని రైలు పట్టాలపై విగతజీవులై కనిపించారు. రైలు వారిపై నుంచి వెళ్లడంతో నాగరాజు తల మొండెం నుంచి వేరవ్వగా, చరణ్ కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. నల్లగొండ రైల్వే ఎస్సై అచ్యుతం కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నదిలో దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

ఆదిలాబాద్ , కెఎన్ఎన్ బ్యూరో : ఆదిలాబాద్ పట్టణంలోని దోబి గల్లిలో నివాసముంటున్న అమరేశ్వర్‌భార్య స్వప్న మూడేళ్ల కూతురు అతిథితో కలిసి పెన్‌గంగ నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్వప్న భర్త అమరేశ్వర్ మంచిర్యాల జిల్లాలో వైద్యారోగ్యశాఖలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లైన 14ఏళ్ల తర్వాత వారికి పాప పుట్టింది. పాపను ప్రేమతో చూసుకుంటున్న తల్లిదండ్రుల మధ్య ఏ సమస్య ఉత్పన్నమైందో కాని స్వప్న ఆదివారం ఆటోలో ఎక్కి పెన్‌గంగకు వెళ్లింది. ఆటో డ్రైవర్‌కు అద్దె ఇవ్వడానికి తన వద్ద డబ్బులు లేకపోవడంతో చెవికమ్మలు అతనికిచ్చేసి పాపను పెన్‌గంగలోకి విసిరేసింది. అనంతరం తాను దూకింది. దీనిని గమనించిన కొందరు బంధువులకు సమాచారం ఇవ్వడంతో పెన్‌గంగ నదిలో శవాల కోసం అన్వేషించగా తల్లి స్వప్న (43) శవం దొరికింది. కాని చిన్నారి అతిథి(3) శవం ఇంకా దొరకలేదు. మృతురాలు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనీషా బంధువు. పోలీసులు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సిద్దిపేట, కెఎన్ఎన్: సిద్దిపేట జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. రాజీవ్ రహదారిపై కొండపాక శివారులో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న షిఫ్ట్‌కారు, ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సిద్దిపేట ఏరియా సుపత్రికి తరలించారు. సిద్దిపేట పట్టణం వేములవాడ కమాన్ రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తా పడటంతో రాజేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నకోడూర్‌మండలం మల్యాల స్టేజీ వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వ్యవసాయ బావిలో పడగా డ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి.

'ఎన్నికల హామీలను మరచిన టీఆర్ఎస్'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సిఎం కేసీఆర్ తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాల కారణంగానే తెరాస ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్ళలేని పరిస్థితి నెలకొందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేసీఆర్ తుంగలో తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. అందుకే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్ళడానికి జంకుతున్నారని వ్యాఖ్యానించారు. 81 ఏళ్ళ గ్రామస్థాయిలో భూరికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని గతంలో ప్రతిపక్షాలు ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి పనులు చేయలేదని కేసీఆర్ మాట్లాడం హాస్యాస్పదంగా ఉందని ఆదివారం ఒక ప్రకటనలో నర్సిరెడ్డి పేర్కొన్నారు. భూమి ప్రభుత్వానిదా? ప్రైవేటు వ్యక్తులదా? అని చూడకుండా ఒక సర్వే నెంబర్ భూమిని అనేక మంది పేర్ల మీద బదిలీ చేసే రెవిన్యూ, రిజిస్ట్రార్ వ్యవస్థల ప్రక్షాళనపై దృష్టి పెట్టకుండా కేవలం గ్రామ స్థాయిలో రికార్డులను ప్రక్షాళన పేరిట గ్రామాల్లో హడావిడి చేయడం ప్రజలను మభ్యపెట్టడానికే అని అన్నారు.

డిండిపై పోరాటం చేస్తాం



●ఎవరెన్ని మాట్లాడినా సోనియా మాటే ఫైనల్

●కోమటిరెడ్డి బ్రదర్స్‌కు జైపాల్ చురక

నారాయణపేటటౌన్, కెఎన్ఎన్: కాంగ్రెస్ పార్టీలో ఎవరెన్ని మాట్లాడినా అంతిమ తీర్పు సోనియాగాంధీదేనని, ఆమె చెప్పిందే వేదం.. అదే ఫైనల్ అని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జైపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ కుంతియాపై కోమటిరెడ్డి బ్రదర్స్ చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ ఆయన పై విధంగా స్పందించారు. సోనియాగాంధీ నిర్ణయాన్ని అందరూ అనుసరించాల్సిందేనన్నారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణతో పాటు స్వేచ్ఛ కూడా ఎక్కువేనని అందుకే వారు అలా మాట్లాడి ఉంటారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పటిష్టంగా ఉందన్నారు. తెరాసకు కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయమని, వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ కన్నా బాబు మేలు..

రాజకీయ సైద్ధాంతిక పరంగా కేసీఆర్ కంటే చంద్రబాబు నాయుడే మేలని జైపాల్‌రెడ్డి కితాబు నిచ్చారు. రాజకీయాల్లో బాహాటంగా ఉండాలన్నారు. ఆంధ్రా సీఎం చంద్రబాబు బీజెపీతో స్పష్టతతో ఉన్నారన్నారు. కాని తెలంగాణ సీఎం కేసీఆర్ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లువేసి బయటకొచ్చి వ్యతిరేకంగా మాట్లాడుతారన్నారు. ఓటు వేయడంలో ఉన్న రహస్య ఒప్పందం ఏమిటని ప్రశ్నించారు. తెరాస, భాజపా రహస్య ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తెరాస ప్రభుత్వానిది బాధ్యతారాహిత్యమన్నారు. కేసీఆర్ ఏ సమస్యపై ఎవరితోనూ మాట్లాడరని, తనతో తానే మాట్లాడు కుంటారని విమర్శించారు. ఇంతటి అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రాజెక్టులు కడుతున్నది ప్రజల కోసమా కాంట్రాక్టర్ల కోసమా అని ప్రశ్నించారు. పాలమూరు - రంగారెడ్డి పథకానికి సైతం తూట్లు పొడిచారన్నారు. డిండిద్వారా నీటిని తరలించడం తగదని, దీనిపై పోరాటం సాగిస్తామన్నారు. 69జీవోను గత తమ ప్రభుత్వం మంజూరు చేస్తే ఎందుకు పక్కన పెట్టారని ఈ ఎత్తిపోతలను చేపట్టి నారాయణపేట, కొడంగల్, మక్తల్ ప్రాంతాలకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. తెరాస ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. ఎమ్మెల్యేలు చేతకాని వారన్నారు. విలేకరుల సమావేశంలో నారాయణపేట నియోజక వర్గ ఇన్‌చార్జీ సరాఫ్ కృష్ణ, నాయకులు డాక్టర్ మల్లికార్జున్, కెంచి నారాయణ, విశ్వనాధ్ కళ్యాణి, అశోక్, ప్రకాష్, శరణ్యానాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల అభివృద్ధికి నిధులు

●వృత్తులద్వారా ఆదాయం పొందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఈటల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం నిధులు ఎంతైనా కేటాయిస్తామని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలో కుల వృత్తుల వారి ఆదాయం పొందేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్వర్యంలో ముద్రించనున్న ముదిరాజ్ టైమ్స్ మాస పత్రికను మంత్రి ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షులు అల్లం నారాయణ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్ ముదిరాజ్, ముదిరాజ్ టైమ్స్ ప్రతిక ఎండి శ్రీనివాసరావు, సీఈవో వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులు చొప్పరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌ల కోసం చేపల పెంపకాన్ని ప్రభుత్వం నిధులు ఇచ్చి ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని గంగపుత్ర, బెస్త, ముదిరాజ్‌లు అందరూ ఈ వృత్తిలో ఉన్న వారు వీటిని ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు.

కులవృత్తులను ప్రోత్సహించి, వాటికి ఆధునిక పరికరాలను సైతం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ముదిరాజ్ టైమ్స్ పత్రికలో తమ జాతి జనాభా సమస్యలతోపాటు, అభివృద్ధి కార్యక్రమాలను సైతం ప్రచురించేలా చూడాల న్నారు. ముదిరాజ్‌లకు ముదిరాజ్ టైమ్స్ పత్రిక ఉపయో గపడాలని సూచించారు. అందుకు అందరూ కృషి చేయాలని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు.

పీజీటీ ప్రధాన పరీక్షకు 87 శాతం హాజరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లోని పోస్టు గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ టీచర్ పోస్టులకు ఆదివారం ప్రధాన రాతపరీక్షను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించింది. మూడు జిల్లా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. పరీక్షకు 87.51 శాతం మంది హాజరయ్యారు. ఆదివారం 408 పీజీటీ పోస్టులతో పాటు 463 ఏఈఈ, 04 ఇన్స్‌పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, 07 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు రాత పరీక్షలను నిర్వహించారు. పీజీటీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించగా మిగిలిన వాటిని ఓఎంఆర్ షీట్ల ద్వారా నిర్వహించారు. మొత్తం పరీక్షలను 130 కేంద్రాల్లో నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పరీక్షలను నిర్వహించారు. పీజీటీ హిందీ, తెలుగు, ఉర్దూ పరీక్షలను ఆదివారం నిర్వహించగా పీజీటీ ఇంగ్లీష్‌ను సోమవారం నిర్వహించనున్నట్టు కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు.

'ప్రైవేట్ టీచర్లకూ ఉత్తమ అవార్డులివ్వాలి'




హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రైవేటు స్కూల్స్‌లో పనిచేస్తున్న వారికి కూడా ఇవ్వాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరమ్ డిమాండ్ చేసింది. ఉత్తమ టీచర్ అవార్డులను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిపిటిఎఫ్ ఆదివారం గన్‌పార్క్ దగ్గర మౌన దీక్షను చేపట్టింది. రాష్ట్రంలో ప్రైవేటు ఉపాధ్యాయులను గుర్తించకపోవడం బాధాకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ షబ్బీర్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 55 శాతం ప్రైవేటు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారిని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. ప్రైవేటు టీచర్ల సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం స్పందించి ప్రైవేటు టీచర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. తమను కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రావు, నవీన్ కుమార్ గౌడ్, బోనాల ప్రకాష్, రేణుక, రూప ఉన్నారు.

జైళ్ల శాఖలో పదోన్నతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ జైళ్ల శాఖలో ముగ్గురు అధికారులకు పదోన్నతులు లభించాయి. చంచల్‌గూడ జైలు పర్యవేక్షణ అధికారి సైదయ్యకు హైదరాబాద్ రేంజ్ డీఐజీగా.. చర్లపల్లి జైలు ఇన్‌ఛార్జి పర్యవేక్షణ అధికారి ఎంఆర్ భాస్కర్‌కు పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారిగా పదోన్నతి లభించింది. అలాగే సికా ప్రిన్సిపాల్ మురళిబాబును చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం జైలు పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ పదోన్నతులపై అధికారికంగా నాలుగు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

'సింగపూర్'కు పనులివ్వొద్దు

●ఏపీ సీఎంకు మాజీ సీఎస్ కృష్ణారావు లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అమరావతి రాజధాని ఏరియా డెవలప్‌మెంట్‌కు సంబంధించి స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో సింగపూర్ కంపెనీలకు పనులు అప్పగించటాన్ని విరమించుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వానికి రాష్ట్ర విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు సూచించారు. స్విస్ ఛాలెంజ్‌కి సంబంధించిన జీవోలను రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 19పేజీల లేఖ రాశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లేఖలోని సారాంశాన్ని వివరించారు. జీవో 179 ద్వారా సింగపూర్ కంపెనీలు అసెండస్ ,సింగ్‌బ్రిడ్జి, సెంబ్‌కార్ప్ కంపెనీలకు దొడ్డిదారిలో పనులు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా వీటిని అప్పగించారన్నారు. తక్షణమే ఆజీవోను రద్దు చేయాలని ,స్విస్ ఛాలెంజ్ విధానం అమలు చేయటం భావ్యం కాదన్నారు. ఆ పనులు స్విస్ ఛాలెంజ్ విధానం ద్వారా చేసేవి కావన్నారు. అసలు స్విస్ ఛాలెంజ్ విధానం ఏపీ ప్రభుత్వం అనుసరించాల్సిన విధానం కాదన్నారు. స్విస్ ఛాలెంజ్ అంటే సుమోటోగా కంపెనీలే రావాలన్నారు. తొలుత వచ్చిన కంపెనీ దాఖలు చేసిన రేటును బహిర్గత పరచాలని, ఆ ధరకంటే తక్కువకు మరే కంపెనీ అయినా ముందుకు వస్తే ఆ పనులను రెండవ కంపెనీ ధర కంటే తక్కువకు చేసేందుకు తొలికంపెనీకి అవకాశం ఇవ్వాలన్నారు. అలా తొలో కంపెనీ ముందుకు రాకపోతే తక్కువ ధర కోడ్ చేసిన రెండవ కంపెనీకి పనులు అప్పగించే విధానమే స్విస్ ఛాలెంజ్ అన్నారు.

ముగిసిన కాకినాడ ఎన్నికల ప్రచారం

అమరావతి, ఆంధ్రప్రభ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ఆదివారంతో ముగిసింది. ప్రచారం చివరి రోజు కావటంతో పార్టీలు హోరాహోరీ ప్రచారంతో కాకినాడ ఒక్కసారిగా వేడెక్కింది. కాకినాడలోని మొత్తం 48 డివిజన్లకు ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. సెప్టెంబర్ 1న ఓట్లను లెక్కిస్తారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ కూటమి పోటీ చేస్తుండగా టీడీపీ 39, బీజేపీ 9 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. వైసీపీ మాత్రం ఒంటరిగానే బరిలోకి దిగి, మొత్తం 48 స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇప్పటికే కాకినాడలో ఏపీ ముఖ్యమంత్రి రెండురోజులు ప్రచారం చేయగా, ప్రతిపక్షనేత జగన్ చివరి రోజు విస్తృతంగా ప్రచారం చేశారు. గత కొన్ని రోజులుగా కాకినాడలో ఒకపక్క టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయగా మరోక పక్క బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా వైసీపీ ఎమ్మెల్యేలు ప్రచారం చేయగా చివరి రోజు వైసీపీ అధినేత జగన్ ప్రచారం చేశారు.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు

టీఎన్‌టీయూసీ సమాయత్తం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు టీడీపీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ సమాయత్తమవుతోంది. ఇందుకు సంబంధించిన కసరత్తుపై దృష్టి సారించింది. ప్రతిష్టాత్మకమైన సింగరేణి యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించి అధికార పార్టీ తెరాసను చావుదెబ్బతీయాలన్న కసితో వ్యూహాలకు పదనుపెడుతోంది. తెరాస పాలనలో సింగరేణి కార్మికులకు జరుగుతున్న అన్యాయాలను ఏకరువు పెడుతూ పెద్దఎత్తున ప్రచారం నిర్వహించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌లో పార్టీ రాష్ట్ర నాయకత్వం, టీఎన్‌టీయూసీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైంది. ఎన్నికల కోసం నిర్వహించిన ఈ సన్నాహక సమావేశానికి టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎన్. రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు మాయమాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. అనంతరం సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. తెరాస అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నప్పటికీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తెరాస ప్రభుత్వ వైఫల్యం చెందిందని ఆయన మండిపడ్డారు. ఎన్నికలలో చెప్పిన దానికి భిన్నంగా సింగరేణిలో ఓపెన్ కాస్ట్ విధానాన్ని కొనసాగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్న సమయంలో చంద్రబాబునాయుడు కేంద్రంతో మాట్లాడి నష్టాలలో ఉన్న సింగరేణికి ప్రత్యేక ప్యాకేజీని తీసుకువచ్చి కాపాడిన విషయాన్ని ఈ సందర్భంగా రమణ గుర్తు చేశారు. సింగరేణి ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీఎన్‌టీయూసీకి పార్టీ రాష్ట్ర శాఖ అన్ని విధాలుగా వెన్నుదన్నుగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తెదేపా జెండాను ఎగరవేసే విధంగా టీఎన్‌టీయూసీ నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, బొగ్గుగనుల కార్మికుల సమస్యలను చూపించి బలోపేతమైన తెరాస పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వారిని మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు ఉన్నాయంటే దానికి సింగరేణి కార్మికుల శ్రమే కారణమన్నారు. వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, ఓపెన్ కాస్టును మూయించి గని కార్మికుల ఉద్యోగాలు పెంచుతామని కేసీఆర్ చెప్పి మోసం చేశారన్నారు. ఒక చేత్తో వారసత్వ ఉద్యోగాలు ఇస్తున్నామని జీవో ఇచ్చి, మరో చేత్తో తెలంగాణ జాగృతి సంస్థచే కేసు వేయించి వారసత్వ ఉద్యోగాల జీవోను కొట్టివేయించాలని ఆయన ధ్వజమెత్తారు. సింగరేణిలో జరిగిన ఉద్యోగాల నియమాకల్లో తెరాస వాళ్ళకే ఉద్యోగాలు వచ్చాయన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు.

పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో పట్టుదలతో పనిచేసి మన బలమెంటో నిరూపించుకునేందుకు మంచి అవకాశం లభించిందన్నారు.

ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బోడ జనార్దన్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తుళ్ళూరు బ్రహ్మయ్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు గండ్ర సత్యనారాయణ, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు జి. ఆనంద్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌బాబు, కార్యక్రమాల కమిటీ అధ్యక్షుడు బుచ్చి లింగంతో పాటు పలువురు పాల్గొన్నారు.



పోస్టుకార్డుని లిఫాపాగా పేరు మార్చిన పేటీఎం

హైదరాబాద్ : ప్రత్యేక సందర్భాల్లో కస్టమర్లకు నగదు రహిత సదుపాయాల్ని ఉపయోగించడానికి ఈ రాఖీకి పేటీఎం షగున్ డిజిటల్ వెర్షన్‌ని ప్రారంభించింది. ఈ సదుపాయాన్ని వినియోగించుకొని దేశవ్యాప్తంగా కస్టమర్లకు ఒకరితో మరొకరు నగదును వెంటనే ఇచ్చిపుచ్చుకోవచ్చు. ప్రారంభించిన 24 గంటల్లోపే రాఖీ ఇతివృత్తం కోసం పేటీఎం లావాదేవీల్లో అనూహ్యమైన పెరుగు దల కనిపించింది. కేవలం మూడు వారాల్లో ఐదు లక్షల లావాదేవీలతో ఈ సేవ విస్తృతప్రజాదరణ పొందిం ది. థాంక్యూ, లక్కీ యు, బెస్ట్ విషెష్ వంటి వివిధ ఇతర ఇతి వృత్తాల్ని కలిపి యూజర్లు నగదు పంపే సేవలు కూడా ప్రసిద్ది చెందాయి. సామాన్య ప్రజల్ని ఆకట్టుకోవడానికి పేటీయం తన బహుమానాలను పేటీఎం లిఫాపాగా బ్రాండింగ్ అందిస్తోం దని పేటీయం సీనియర్‌వైస్ ప్రెసిడెంట్ దీపక్ అబ్బోట్ చెప్పారు. తక్కువ సమయంలో ఎక్కువ మందిని ఆకట్టుకుందని చెప్పారు. డిజిటల్ చెల్లింపును మరింత బలోపేతం చేయడానికి లిఫాపా బాగా పనికొస్తుందని ఆయన అన్నారు.

సిగ్నిటీ బోర్డులోకి శ్రీనాథ్ బత్ని

హైదరాబాద్ : సిగ్నిటీ టెక్నాలజీస్‌లో లిమిటెడ్ బోర్డులో గ్లోబల్ ఐటి నిపుణుడు శ్రీనాథ్ బత్ని స్వతంత్ర డైరెక్టర్‌గా చేరారు. గతంలో ఆయన ఇన్ఫోసిస్‌లో డెలివరీ ఎక్సలెన్స్ హెడ్‌గా, హోల్‌టైం డైరెక్టర్‌గా మే 2000 నుంచి జులై 2014 వరకు ఆయన సేవలందించారు. ఈ సందర్భంగా సిగ్నిటీ సీఎండీ సీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. డెలివరీ ఎక్సలెన్స్‌లో శ్రీనాథ్‌కు ఉన్న అనుభవం తమ ప్రాజెక్టులకు పనికొస్తుందని అన్నారు. ఆయన సలహాలు, సూచనలు కంపెనీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడతాయన్నారు. శ్రీనాథ్ మాట్లాడుతూ.. వ్యాపారాలు డిజిటల్‌గా మారుతున్న తరుణంలో సిగ్నిటీలో చేరడం ఆనందంగా ఉందన్నారు.

విదేశీ పెట్టుబడులు వెనక్కి!

● వృద్ధిరేటుపై అనుమానం

న్యూఢిల్లీ: విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలో స్టాక్ మార్కెట్ల నుంచి రెండు బిలియన్ డాలర్లు (రూ.13,000 కోట్లు) రూపాయల వరకు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దీనికి ప్రధాన కారణం తయారీ రంగంలో పాటు సేవల రంగం మందగించడం, దీంతో పాటు కార్పొరేట్ ఫలితాలు కూడా పెద్ద ప్రోత్సాహకరంగా లేకపోవడం. అయితే ఇదే విదేశీ ఇన్వెస్టర్లు డెట్ మార్కెట్లో రూ.13,000 కోట్లపైనే పెట్టుబడులు పెట్టాయి. డిపాజిటరీ డేటా ప్రకారం చూస్తే ఈ నెల 1-24 వరకు విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్ల నుంచి రూ.12,626 కోట్లు లేదా 1.96 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులై వరకు గత ఆరు నెలల కాలంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ.62వేల కోట్ల వరకు దేశీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాయి. అంతకు ముందు రూ.1,200 కోట్ల వరకు పెట్టుబడులు ఉపసంహరించుకున్నాయి. ఈ ఏడాది మొత్తానికి చూస్తే ఈక్విటీ మార్కెట్లో విదేశీ పెట్టుబడులు 7 బిలియన్ డాలర్లు రూ.48,329 కోట్లుగా తేలింది. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం కార్పొరేట్ ఫలితాలు పేలవంగా నమోదు కావడంతో విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడి ఆ డబ్బును తరలించుకుపోయారని, ఇప్పటికే భారతీయ ఈక్విటీలు వాస్తవం కంటే ఖరీదు ఎక్కువగా ఉన్నాయని బజాజ్ క్యాపిటల్ సీనియర్ వీపీ అలోక్ అగర్వాల్ చెప్పారు. అయితే విదేశీ ఇన్వెస్టర్లకు డెట్ మార్కెట్ ఆకర్షణీయంగా ఉందని, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం బాగా కలసొచ్చింది. బలమైన కరెన్సీ... రాజకీయ సుస్థిరత, కార్పొరేట్ బాండ్లపై అధిక వడ్డీరేటు తదితర అంశాలు విదేశీ ఇన్వెస్టర్లకు డెట్ మార్కెట్ ఆకర్షిస్తోందని చెబుతున్నారు.

ఈవారం మార్కెట్ అంతంత మాత్రమే!

జీడీపీ గణాంకాలు, డెరివేటివ్ కాంట్రాక్టు ముగింపు



న్యూఢిల్లీ : ఈ వారం స్టాక్ మార్కెట్లో పెద్ద మెరుపులు కనిపించే అవకాశం లేదని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గురువారంతో ఆగస్టు నెల డెరివేటివ్ కాంట్రాక్టు ముగియనుండటంతో ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఆగస్టు 31వ తేదీన జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం జీడీపీ గణాంకాలు వెలువడనున్నాయి. మార్కెట్లపై జీడీపీ గణాంకాలు ప్రభావితం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ వారం మార్కెట్‌కు కీలకం కానున్న మరో అంశం.. నందన్ నీలేకని ఇన్ఫోసిస్ పగ్గాలు తిరిగి చేపట్టడం కూడా మార్కెట్లకు కీలకాంశం కానుందని కొటక్ సెక్యూరిటీస్‌కు చెందిన టీనా వీర్మాని చెబుతున్నారు. అమెరికాలోని జాక్సన్‌హోల్‌లో సెంట్రల్ బ్యాంకర్లు ఆర్థిక విధానం సమావేశం జరుగుతోంది దీని వివరాలు వెలువడనున్నాయి. ఇది కూడా మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. మొత్తానికి మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాలు లేని కారణంగా ట్రేడింగ్ పరిమితి స్థాయిలో ఉంటుందని, ఇక్కడి నుంచి మదుపరులు దృష్టి ఇటీవల ముగిసిన త్రైమాసికంలో మంచి ఫలితాలు ఆర్జించిన కంపెనీల షేర్లపై ఉంటుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ వినోద్ నాయర్ అభిప్రాయపడుతున్నారు. ఇన్ఫీ చైర్మన్‌గా నందన్ నీలేకని బాధ్యతలు చేపట్టనందున సోమవారం ఇన్ఫోసిస్ షేరుపై ఎక్కువఫోకస్ ఉంటుంది. గత వారం సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా 71.38 పాయింట్లు 19.65 పాయింట్లు లాభపడ్డాయి.


ఇండోఫిల్ నుంచి ఇంప్రెషన్



హైదరాబాద్: బహుళజాతి సంస్థ ఇండోఫిల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తన కొత్త తెగుళ్ల మందు ఇంప్రెషన్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. వరిపంటకు మూడంచెల రక్షణ ఇచ్చేలా ఇంప్రెషన్‌ను అభివృద్ధిపరిచినట్లు కంపెనీ తెలిపింది. వరి పంట అధికంగా పండించే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రైతులకు ఈ కొత్త ఉత్పత్తి ఉపయోగపడగలదనే ఆశాభావాన్ని ఇండోఫిల్ సీనియర్ జనరల్ మేనేజర్ టి. నారాయణ రెడ్డి వ్యక్తం చేశారు. రెండుదఫాలుగా వరి పంటపై ఇంప్రెషన్‌ను స్ప్రే చేయాల్సి వుంటుందని, ఎకరాకు 200 గ్రాముల చొప్పున సరిపోతుందని రీజినల్ సేల్స్ మేనేజర్ ఎ. అంజిరెడ్డి ఈ ప్రకటనలో తెలిపారు.

నీలేకని రెండేళ్లుండాలి

● రవి వెంకటేశన్‌ను సాగనంపాలి: బాలకృష్ణన్





న్యూఢిల్లీ: నందన్ నీలెకని కనీసం రెండు లేదా మూడేళ్లపాటు ఛైర్మన్‌గా కొనసాగాలని ఇన్ఫోసిస్ మాజీ సిఎఫ్ఓ వి. బాలకృష్ణన్ అభిప్రాయపడుతున్నారు. దిద్దుబాటు చర్యలతో పాటు, భవిష్యత్ ప్రణాళికలను అమలులోకి తెచ్చేందుకు ఈ సమయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు దిగజారు తున్నాయని ప్రధానంగా ఆరోపించిన వ్యక్తిబాలకృష్ణనే. ఇండిపెండెంట్ డైరెక్టర్ హోదాలో వున్న రవి వెంకటేశన్ వైదొలగాలని కూడా చెబుతున్నారు.

2014లో తీసుకున్న నిర్ణ యం ఒక ప్రయోగంగా అభివర్ణించారు. అప్పటిదాకా వ్యవ స్థాపకులు నిర్వహిస్తున్న బాధ్యతలను సిఇఓకు అప్పచెప్పడ మే కాకుండా, బోర్డును పూర్తిగా ప్రొఫెషనల్స్‌తో నింపారని, ఈ ప్రయోగం పూర్తిగా విఫలమైందని బాలకృష్ణన్ అన్నారు. ఇప్పుడు మరోసారి విఫలమవ్వడానికి తావీయకూడదన్నారు.

భవిష్యత్‌లో తాను వైదొలగేప్పుడు ఒక మంచి ఛైర్మన్‌ను తీసుకు రావాల్సిన బాధ్యత నీలెకనిదేనని, బోర్డు భద్రమైన చేతులలో వుందన్న విశ్వాసాన్ని ఆయన పాదుకొల్పాలని బాలకృష్ణన్ చెప్పారు. కనీసం రెండు, మూడేళ్లు నీలెకని వుండాలి, ఎందుకంటే చేయాల్సిన పనులు చాలానే వున్నాయి. బోర్డు పునర్ వ్యవస్థీకరణ, కొత్త సిఇఓ నియామకం, ఆ సిఇఓ కుదురుకునేదాకా వెంట వుండి నడిపించడం, ఆ తర్వాత కొత్త ఛైర్మన్ రాకకు మార్గం సుగమం చేయడం.... వంటి ముఖ్య మైన పనులను ఈ సందర్భంగా ఉదహరించారు. ఇంతకు ముందున్న బోర్డును బలహీనమైనదిగా పేర్కొంటూ, సమాచారాన్ని సక్రమంగా చేరవేయడంలో విఫలమైందన్నారు. ఆ బోర్డు నిరాశకు గురి చేసిందని వ్యాఖ్యానించారు.

దేశంలోని రెండవ పెద్ద ఐటి సేవల కంపెనీ అయిన ఇన్ఫోసిస్‌కు గడచిన రెండు వారాలు ఇబ్బందికరంగానేగడిచాయి. ఏడాదికాలంగా వ్యవస్థాపకులు, మేనేజ్ మెంట్ మధ్య సాగు తున్న వైరం ముదిరి పాకాన పడటంతో, సిఇఓ విశాల్ సిక్కా, ఛైర్మన్ ఆర్. శేషసాయి, మరో ఇద్దరు డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సహ ఛైర్మన్‌గా వున్న రవి వెంకటేశన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ హోదాకు మారగా, ఆధార్ ప్రాజెక్టు రూపకర్త నీలెకని మరోసారి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

నీలెకని మొదటి ప్రాధాన్యం బోర్డు పునర్ వ్యవస్థీకర ణేనని బాలకృష్ణన్ అభిప్రాయపడుతున్నారు. సంబం ధిత స్టేక్‌హోల్డర్లతో సంప్రదింపుల ద్వారా కంపెనీ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ నీలెకని పరిష్కరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. బోర్డు పునర్ వ్యవస్థీకరణ ద్వారా అంతర్గత నిర్వహణా సామర్థ్యం మెరుగుపడి, కొత్త సిఇఓ కు సులభతరంగా వుంటుందని అభిప్రాయపడ్డారు.పాన్యా డీల్ విషయంలో న్యాయ, ఆడిట్ సంస్థల నివేదికల విషయంలో కంపెనీ వైఖరిని గురించి ప్రస్తావిస్తూ, దర్యాప్తు నివేదికలను కంపెనీ బహిర్గతం చేయా లని బాలకృష్ణన్ చెప్పారు. వ్యవస్థాపకులు, మేనేజ్‌మెంట్‌కు మధ్య విభేదాలకు ఈ పాన్యా డీల్ కూడా ఒక ప్రధాన కారణమే. నీలెకని ఇప్పుడే బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కొంత వ్యవధి ఇవ్వాల్సి వుంటుందని అన్నారు. ఇదిలా వుండగా, నీలెకని అప్పుడే తన పని చురుగ్గా మొదలు పెట్టారు. ముఖ్యమైన క్లయింట్లు, ఉద్యోగులతో సంప్రదింపులు జరుపుతున్నారు. పది బిలియన్ డాలర్ల ఇన్ఫోసిస్ కు తగిన సిఇఓను కనుక్కోవడమే బహుశా నీలెకని ముందున్న ప్రధాన సవాలు కావచ్చు.

కంపెనీలోనూ, బయటా కూడా ఇలాంటి అర్హమైన వ్యక్తి కోసం వెతుకుతారు. ఇన్ఫోసిస్ సిఇఓగా లేదా బోర్డు మెంబర్ గా వుంటారా అనే ప్రశ్నకు బాలకృష్ణన్ సానుకూలంగా స్పందించలేదు. నేను వదిలి పెట్టి మూడేళ్లయింది, వెంచర్ ఫండ్ నిర్వహిస్తున్నాను, నాకు ఇప్పుడు ఆ ఆసక్తి లేదని బాలకృష్ణన్ స్పష్టం చేశారు. అయితే అశోక్ వేమూరి, బిజి శ్రీనివాస్, మోహన్ వంటి వ్యక్తుల పేర్లను ఆయన ఉదహరించారు.

గతంలో ఇన్ఫోసిస్‌లో పనిచేసి వెళ్లిన ఉన్నతాధికారుల సంఖ్య చాలా అధికంగానే వుందన్నారు. తాత్కాలికి సిఇఓగా వున్న ప్రవీణ్ రావు, సిఎఫ్ఓ రంగనాథ్, డి. మవీనకెరె, ప్రెసిడెంట్, డిప్యూటీ సిఓఓ రవి కుమార్, బిఎఫ్ఎస్ఐ హెడ్ మోహిత్ జోషి వంటి వారి పేర్లు సిఇఓ పదవికి ఇప్పటికే వినబడుతున్నాయని తెలిపారు.

నీలేకని ముందున్న సవాళ్లు

న్యూఢిల్లీ: ఛైర్మన్‌గా నీలేకని రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టడంతో ఇన్ఫోసిస్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లేనని భావిస్తున్నారు. గత ఏడాది కాలంగా వ్యవస్థాపకులు, మేనేజ్‌మెంట్ జరుగుతున్న యుద్ధం రూపుమాసినట్లేనని, ఇన్వెస్టర్లు, రెండు లక్షల మంది ఉద్యోగులు కంపెనీలో మామూలు స్థితికి కార్యకలాపాలు చేరిరట్లేనని విశ్వసిస్తున్నారు. విశాల్ సిక్కా రాజీనామాతో గత వారమంతా షేర్ ధర పతనవమవుతూనే వుంది. 12 మంది ప్రధాన సంస్థాగత పెట్టుబడిదారులు వ్యవస్థాపకులు ఏడుగురిలో ఒకరయిన నీలెకనిని మరో దఫా ఛైర్మన్‌గా రావల్సిందిగా అభ్యర్థించారు. దాదాపు పదేళ్ల విరామం తర్వాత మళ్లీ కంపెనీలోకి వచ్చిన నీలెకని ముందు ఇప్పుడు పెద్ద సవాళ్లే వున్నాయి. పదేళ్ల కిందటి ఇన్ఫోసిస్ స్థితిగతులకీ, ఇప్పటికీ చాలా మార్పులున్నాయి. అవుట్‌సోర్సింగ్ రంగంలో అగ్రగణ్యుడుగా పేరొందిన నీలెకని, కంపెనీకి దూరంగా వున్న సమయంలో ఐటి రంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా దేశీయ ఐటిసేవల రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. సాంప్రదాయిక అవుట్‌సోర్సింగ్ రంగం తీవ్ర మైన మార్జిన్ల వత్తిడిని చవిచూస్తోంది.కొత్త వ్యాపారాలు ఇంకా సంపాదన బాట పట్టలేదు. అమెరికాలో వీసా నిబంధనల మార్పులు కంపెనీకి తలనొప్పే అనడంలోనూ సందేహం లేదు. నీలెకని ముందున్న సవాళ్లంటే, ఇన్ఫోసిస్ ముందున్న సవాళ్లేనని అల్వారెజ్ అండ్ మార్సల్ సీనియర్ డైరెక్టర్ మలయ్ షా అభిప్రాయపడ్డారు. నీలెకని మొదటి ఇన్నింగ్స్‌లో ఈయన ఇన్ఫోసిస్‌లో పనిచేశారు. నీలెకని తన పేరు ప్రఖ్యాతులను ఇప్పుడు పణంగా పెట్టినట్టేనని, కంపెనీ విజయంతో ఇప్పుడు ముడిపడి వున్నయాని పేర్కొన్నారు. 2013తో విపత్కర పరిస్థితి వచ్చినప్పుడు నారాయణమూర్తి మళ్లీ వచ్చి, నీలెకనిని కూడా ఆహ్వానించారు. కాకపోతే అప్పుడు నీలెకని అంగీకరించలేదు. సిఇఓ నియామకాన్ని వీలయినంత తొందరగా పూర్తి చేయడం ఆవశ్యకం, సిక్కా రాజీనామా తర్వాత షేర్ ధర బాగా పతనమైంది. ఎస్ఏపి నుంచి ఇన్ఫోసిస్‌లో చేరిన సిక్కా మార్జిన్లు ఎక్కువగా వుండే ఆటోమేషన్, బిగ్‌డేటా, క్లౌడ్, ఎనలిటిక్స్ వంటి రంగాల వైపు కంపెనీని నడిపించే ప్రయత్నం చేశారు.ఇన్ఫోసిస్‌లో ఫోర్బ్స్ అంచనా ప్రకారం, ప్రస్తుతం నీలెకని, ఆయన సతీమణికి కలిపి 1.7 బిలియన్ డాలర్ల విలువయిన 2.3 శాతం వాటా వుంది. నీలెకని అంతర్జాతీయ సంబంధాలు అనుపమానవైనవని అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఆ సత్సంబంధాలే కంపెనీ భవిష్యత్‌కు కీలకంగా మారతాయని అంచనా వేస్తున్నారు. నిపుణులయిన ఉద్యోగులు కొనసాగేలా చొరవ తీసుకోవడం కూడా చాలా ముఖ్యమైన అంశంగా ప్రస్తావిస్తున్నారు. అనిశ్చితి కొనసాగితే చాలా మంది వలస వెళ్లే ప్రమాదం పొంచి వుందని విశ్లేషకులు ఇప్పటికే హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు సూచనలు కూడా ప్రస్ఫుటమవుతున్నాయని వివరిస్తున్నారు.

ఉద్దేశపూర్వక ఎగవేతదార్లపై...

పీఎస్‌యు బ్యాంకుల కొరఢా

● సర్ఫేషి చట్టం కింద చర్యలు షురూ

● 5954 మంది రూ.70 వేల కోట్ల బకాయి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు 5954 మంది రుణ ఎగవేతదారుల నుంచి రూ. 70 వేల కోట్ల రుణాలను రికవరీ చేసేందుకు సర్ఫేసి చట్టం కింద చర్యలు ప్రారంభించాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ గణాంకాలు విడుదల చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 1444 మంది రుణ ఎగవేతదారుల నుంచి రూ. 20,943 కోట్లు రాబట్టేందుకు సర్ఫేసి చట్టం కింద చర్యలు మొదలుపెట్టగా, మిగి లిన 20 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 48,496 కోట్ల రుణ రికవరీకి 4,510 మంది ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులకు చర్యలు చేపట్టినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల నుంచి రావల్సిన బకాయిల మొత్తం మార్చి 2017 నాటికి రూ. 92,376 కోట్లకు చేరిందని ప్రకటించింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలోని రూ. 76,685 కోట్లతో పోలిస్తే ఇది 20.40 శాతం ఎక్కువయింది. ఇదే కాలంలో ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన చూస్తే పది శాతం పెరిగింది. మార్చి 2016 నాటికి 8,167 గా వున్న ఈ సంఖ్య మార్చి 2017 నాటికి 8,915 కి చేరింది. రూ. 32,484 కోట్ల రికవరీకి సంబంధించి బ్యాంకు లు 1,914 కేసులలో ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేశాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరించింది. ఎస్‌బిఐ, దాని అనుబంధ అయిదు బ్యాంకులతో కలిపి మొత్తం 27 బ్యాంకులు 2016-17 ఆర్థికసంవత్సరంలో రూ.81,683 కోట్లను రైటాఫ్ చేశాయి. గడచిన అయిదు సంవత్సరాలలో ఇదే అత్యధికం. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఈ రైటాఫ్ చేసిన మొత్తం 41 శాతం అధికం. ఇక మార్చి 2017 నాటికి స్థూల నిరర్ధక ఆస్తులు రూ.6.41 ట్రిలియన్‌లకు చేరినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు ఉద్దేశపూర్వక ఎగవేతదారుల భరతం పట్టేందుకు నియమ, నిబంధనలను మరింత కఠినతరం చేస్తోంది. రుణాలు ఎగవేసిన కంపెనీలో ప్రమో టర్లుగా వున్న వ్యక్తులు ఒకవేళ హోల్‌టైమ్ డైరెక్టర్ కాకపోయినా కూడా బాధ్యతల నుంచి తప్పించుకోజాలరని ఆర్‌బిఐ ప్రకటించింది. ఈ నిబంధన గతంలో లేదు. సామర్థ్యం వున్నప్పటికీ రుణాలు చెల్లించని వారిని లేదా బ్యాంకుకు తెలియకుండా ఆస్తులను విక్రయించిన వారిని, ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా పరిగణించాలని ఆర్‌బిఐ స్పష్టం చేస్తోంది. ఇలాంటి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల ఫొటోలను పబ్లిక్ దృష్టికి వచ్చేలా పబ్లిష్ చేయడానికి బ్యాంకులకు అనుమతిచ్చినట్లు కూడా ఆర్‌బిఐ తెలిపింది.

ప్యాసింజర్ కార్ల అమ్మకాల్లో మారుతి హవా



న్యూఢిల్లీ : దేశీయ ప్యాసింజర్ కార్ల మార్కెట్ (పీవీ)లో మారుతి సుజుకి ఇండియా తన హవా కొనసాగిస్తోంది. జులైలో టాప్ 10 బ్రాండ్‌లలో మారుతికి చెందిన ఏడు మోడల్స్ అత్యధికంగా అమ్ముడుపోయాయి. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యూఫ్యాక్చ రర్స్ (సియామ్) తాజా గణాంకాలను విడుదల చేసింది. దేశంలో అత్యధికంగా అమ్ముడయ్యే కార్లలో మారుతి ఆల్టో నెంబర్ నంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. జులైలో మొత్తం 26,009 యూనిట్లు విక్రయించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 19,844 యూనిట్లు విక్రయించింది. ప్రీమియం హెచ్‌బ్యాక్ బలెనో రెండవ స్థానంలో ఉంది. 19,153 యూనిట్లు విక్రయించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 9,120 యూనిట్లు విక్రయించింది. కాంపాక్ట్‌కారు వ్యాగన్ ఆర్ మూడవ స్థానంలో ఉంది. 16,301 యూనిట్లు విక్రయించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 15,207 యూనిట్లు విక్రయించింది. విటారా బ్రెజ్జా నాలుగవ స్థానంతో 15,243 యూనిట్లు విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో ఆరవ స్థానంలో ఉంది 10,232 యూనిట్లు విక్రయించింది. స్విఫ్ట్ ఐదవ స్థానంతో 13,738 యూనిట్లు విక్రయించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 13,934 యూనిట్లు విక్రయించింది. ఆరవ స్థానంలో హ్యుందాయ్ హెచ్‌బ్యాక్ గ్రాండ్ ఐ10 దక్కించుకుంది. గత నెలలో 12,002 యూనిట్లు విక్రయించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 11,961 యూనిట్లు విక్రయించింది. హ్యుందాయ్ ప్రీమియం హెచ్‌బ్యాక్ ఎలైట్ ఐ20 ఏడవ స్థానంలో ఉంది. గత నెలలో 11,390 యూనిట్లు విక్రయించింది. మారుతికే చెందిన సెడాన్ డిజైర్ ఎనిమిద స్థానంలో ఉంది.

ఈ వారంలోనే కార్లపై సుంకం పెంపు?

కేంద్ర కేబినెట్ ఈ వారంలోనే ఆర్డినెన్స్ జారీ చేసి మిడ్‌సైజ్, పెద్ద కార్లు, ఎస్‌యూవీపై జీఎస్‌టిపై ప్రస్తుతం ఉన్న సుంకాన్ని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచే అవకాశాలున్నాయి.

ఎయిర్‌పోర్టు చార్జీలు, పన్నులతో


విమానయానరంగం కుదేల్!

● జెట్ ఎయిర్‌వేస్ ఛైర్మన్ నరేశ్ గోయెల్

ముంబై : కేంద్రప్రభుత్వం ఎయిర్‌పోర్టు చార్జీలు, సుంకాలు, అధికమొత్తంలో పన్నులు వసూలు చేసి విమానయాన రంగాన్ని ఎదగకుండా చేస్తున్నాయని జెట్‌ఎయిర్‌వేస్ ఛైర్మన్ నరేశ్ గోయెల్ ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెల జరిగే కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశానికి సంబంధించి వాటాదారులకు 2016-17 వార్షిక నివేదికలో ఈ అంశాలను ప్రస్తావించారు. విపరీతంగా పెరిగిపోతున్న ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు ప్రస్తుతం విమనాశ్రయాల్లో మౌలికసౌకర్యాలు లేవన్నారు. విమానాల సంఖ్య పెరుగుతున్నా దానికి తగ్గట్లు విమానాశ్రయాల్లో మౌలికసదుపాయాలు విస్తరించడం లేదన్నారు.

దేశీయ పౌరవిమానయానరంగం ప్రస్తుతం క్రమంగా జోరందుకుంటోంది, ఈ రంగంలో కొత్త సంస్థలు కాలుమోపేందుకు అవకాశాలున్నాయని ఆయన అన్నారు. విమానయాన రంగాన్ని వాస్తవంగా అభివృద్ధిలోకి తేవాలనుకుంటే ప్రభుత్వం ఈ రంగం ఎదుర్కొంటున్న వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా పెరిగిపోతున్న ఎయిర్‌పోర్టు చార్జీలు, సర్‌చార్జీలు పెద్దమొత్తంలో పన్నులు వసూలు చేస్తే ఈ రంగం కుదేలవుతోందని గోయెల్ అన్నారు.

పెరిగిపోతున్న ప్యాసింజర్ ట్రాఫిక్‌కు తగ్గట్టు ఎయిర్‌పోర్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జోరందుకోవడం లేదని, ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీటిని అధిగమిస్తే దేశీయ విమానయానరంగం భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉడాన్ స్కీంతో దేశంలోని మారుమూల ప్రాంతానికి ఎయిర్ కనెక్టివిటి పుంజుకుంటుందన్నారు. ఉడాన్ స్కీంకింద గంట ప్రయాణానికి రూ.2,500 పరిమితి విధించారు. విమాన సర్వీసులు లేని ప్రాంతాలకు విమాన సర్వీసులు కల్పించారు. అయితే ఇక్కడ గుర్తించుకోవాల్సింది గోయెల్‌కు చెందిన జెట్ ఎయిర్‌వేస్ మాత్రం ఉడాన్ స్కీం బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. మొదటి సారి జరిగిన బిడ్డింగ్‌లో మొత్తం ఐదు ఆపరేటర్లు అలయెన్స్ ఎయిర్, స్పైస్‌జెట్, ట్రూజెట్, ఎయిర్ డెక్కన్, ఎయిర్ ఒడిషాలు పాల్గొన్నాయి. మొత్తం 128 రూట్లను దక్కించుకున్నాయి.




రాజకీయంగా, ఆర్థికంగా స్థిరత్వం ఏర్పడినందు వల్ల భారతీయ పౌర విమానయాన రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, జీడీపీ వృద్ధి రేటు పుంజుకోవడంతో పాటు ప్రజల ఆదాయాలు కూడా పెరుగుతున్నాయి. విమానయాన రంగం పుంజుకోవడానికి యువతకే కీలకంగా మారిందని వార్షిక నివేదికలో గోయెల్ పేర్కొన్నారు.

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం ఫలితాలు వచ్చే నెల విడుదల చేయబోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కొత్తగా గ్లోబల్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. క్యూ1 ఫలితాలను సెప్టెంబర్ 14న స్టాక్‌ఎక్స్ఛేంజీలకు సమర్పిస్తామని ఈ నెల ప్రారంభంలో జెట్ ఎయిర్‌వేస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది.

మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను జెట్ ఎయిర్‌వేస్ రూ.438 కోట్లు నికరలాభాన్ని ఆర్జించగా.. రూ.22,693 కోట్ల రెవెన్యూ సాధించింది. కాగా జులైలో దేశీయ ఎయిర్‌ట్రాఫిక్ 17 శాతం పెరి గింది. మొత్తం 95.65 లక్షల మంది విమానాల్లో ప్రయాణించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 85.08 లక్షల మంది విమాన ప్రయాణాలు చేశారు.

సహారా హోటల్స్ కొనుగోలుకు

గల్ఫ్ ఫండ్‌ల ఆసక్తి



న్యూఢిల్లీ / న్యూయార్కు : సంక్షోభంలో చిక్కుకున్న సహారా గ్రూపునకు చెందిన అమెరికాలోని రెండు లగ్జరీ హోటల్స్‌ను మధ్యప్రాచ్య దేశానికి చెందిన ఒక కంపెనీకి విక్రయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. న్యూయార్కులోని డ్రీమ్‌డౌన్‌టౌన్ హోటల్‌లో సహారాకు 85 శాతం, ప్లాజా హోటల్‌లో 70 శాతం వాటాలు సహారాకున్నా యి. అయితే మధ్య ప్రాచ్య దేశానికి చెందిన ఏ కంపెనీ సహారా ఆస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తుందో ఇతమిద్ధంగా తెలియదు. అయితే ఖతార్‌కు చెందిన సావరిన్ ఫండ్ ఈ ఆస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించి నట్లు చైనాతో పాటు అమెరికా వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి. మొత్తానికి సహారాకు చెందిన రెండు ఆస్తుల అమ్మకాలపై చర్చలు జరుగుతున్న సమాచారాన్ని ఆ వర్గాలు ధ్రువీకరించాయి. ఈ రెండు హోటల్స్‌ను విక్రయిస్తే సహారా రాయ్‌కు బిలియన్ డాలర్ల వరకు (రూ.6,400 కోట్ల) వరకు వచ్చే అవకాశాలున్నాయన చెబుతున్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మార్కెట్ బలహీనంగా ఉందని బిలియన్ డాలర్లకంటే ఎక్కువ వచ్చే అవకాశాల్లేవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనిపై సహారా అధికార ప్రతినిధిని సంప్రదించగా ఆయన వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. అయితే మధ్యప్రాచ్యానికి చెందిన సంస్థ ఒకటి సహారాకు చెందిన అమెరికా ఆస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తిని కనబరుస్తోందన్న వార్తను ఆయన ధ్రువీక రించారు. అమెరికా మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం సహారా.. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ జెఎల్ఎల్‌తో సంప్రదింపులు జరిపి ప్లాజా హోటల్‌లో వాటాలు విక్రయించమని కోరిందని చెబుతున్నారు. ఈ వాటాల విక్రయం ద్వారా సహారాకు 500 మిలియన్ డాలర్లు వస్తాయి.

ఇక అసలు విషయానికి వస్తే .. సహారా గ్రూపుచీఫ్ సుబ్రతారాయ్ మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి అనుమతి తీసుకోకుండా చోటామోటా ఇన్వెస్టర్ల నుంచి రూ.24వేల కోట్ల డిపాజిట్లు వసూలు చేశారు. దీనిపై సెబి సుప్రీంకోర్టును ఆశ్రయించడం, కోర్టు సెబి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పాటు డిపాజిటర్ల నుంచి సేకరించిన డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడంతో రాయ్‌ను అరెస్టు చేసి తిహార్‌జైలుకు తరలించడం జరిగింది. అటు తర్వాత ఆయన తల్లి మృతి చెందడంతో ప్రస్తుతం పెరోల్‌పై ఉన్నారు. తదుపరి కోర్టు విచారణలోగా డబ్బు డిపాజిట్ చేయకపోతే తిరిగి జైలుకు రావాల్సి ఉంటుందని రాయ్‌ను కోర్టు హెచ్చరించింది. ఇటీవలే సహారాకు చెందిన ఆంబే వ్యాలీ వేలం వేసి ఆ డబ్బును సెబి - సహారా ఖాతాలో డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలను జారీ చేసిన విషయం తెలిసిందే.

పన్నును ఎత్తివేయండి

ఎంపీ కవితకు గౌడ సంఘం నేతల విజ్ఞప్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కల్లుగీత వృత్తిని మరింత పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం నేతలు ఎంపీ కవిత, మంత్రి హరీష్‌రావులను కలిసి విజ్ఞప్తి చేశారు. నూతనంగా రూపొందించేకల్లు విధానంలో తాటి, ఈత చెట్లపై విధించేపన్నును ఎత్తివేయాలని కోరారు. శాశ్వత లైసెన్స్ విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లైసెన్సులను ఆటోమేటిక్‌గా రెన్యూవల్ చేసి రిజిస్టర్ పోస్టులో పంపాలని డిమాండ్ చేశారు. కల్లు దుకాణాలలైసెన్సులను రద్దు చేయరాదని కోరారు. సొసైటీ రద్దయితే కేవలం సొసైటీ అధ్యక్షుడిని తొలగించాలని సూచించారు. టిఎఫ్టిలను టిసి ఎస్‌లుగా మార్చుకునే విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. పలు కీలక డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ బృందంలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు ఈద శేషగిరి, చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ అంబాల నారాయణగౌడ్, ఎలికట్టే విజ య్‌కుమార్‌గౌడ్, కె నాగరాజుగౌడ్, హరిచరన్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ తది తరులున్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

రాం మాధవ్‌కు బీసీ సంఘం నేతల విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి ఆమోదింప చేసేలా భారతీయ జనతా పార్టీ మద్దతు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీలకు ఉద్యోగా నియామకాల్లో అమలు చేస్తున్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని కోరుతూ సంఘం నేతలు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్‌కు విజ్ఞప్తి చేశారు. సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, గుజ్జ రమేష్, తదితరులు ఆదివారం ఆయనను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయనతోపాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్‌ను కూడా కలిశారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజ్వేషన్లు కల్పించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజ్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రస్థాయిలోని విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీ జనాభా దామాషా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలకు రక్షణ చట్టం రూపొందించాలన్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం స్వాధీనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగుతోంది. కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించిన ప్రతీసారి పెద్ద మొత్తంలో బంగారం పట్టుబడుతుండటం గమనార్హం. విదేశాలలో తక్కువ ధరకు బంగారం లభ్య మవు తుండటంతో బంగారాన్ని అక్రమంగా నగరానికి తరలించేవారి సంఖ్య ఎక్కువైంది. విమానాల ద్వారానే బంగారం తరలింపు జరుగుతోందని పోలీసులకు పట్టుబడ్డ నిందితులు కూడా పేర్కొంటున్న సంగతి విదితమే. తాజాగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు ఆదివారం తనిఖీల ఏ నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి 1 కిలో 233 గ్రాముల బంగారం బిస్కెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బంగారం బిస్కెట్ల విలువ రూ.36,86,670 లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రయాణీకుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆర్టీసీకి ఆదాయం పట్టదా?

- సీఎం సూచనలు భేఖాతరు
- ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించని వైనం
- ప్రైవేటు ప్రకటనలను ఆకర్షించని ఆర్టీసీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు చూపిన ప్రత్యామ్నాయ మార్గాలు అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆర్టీసీ పని తీరు పైన 2016 జూన్ 17న ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సంస్థను లాభాల బాట పట్టించేందుకు అనేక ప్రత్యామ్నాయాలను చూపించారు. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష అనంతరం రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి కూడా పరిస్థితిని సమీక్షించారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయం పెంచుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రధానంగా చేసిన సూచనలను అధికారుల దృష్టికి తెచ్చారు. అమలుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యమంత్రి సూచించి ఏడాది గడిచిపోయినప్పటికీ ప్రత్యామ్నాయ మర్గాలను గుర్తించడం, ఆదాయం పెంచుకోవడంలో ఆర్టీసీ పెద్దగా పురోగతిని సాధించలేక పోయిందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. పర్యాటక శాఖతో ఆర్టీసీ అనుసంధానం కావాలని కీలక ఆదాయ మార్గాన్ని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సూచన అమలైన దాఖలాలు కనిపించడం లేదు. ఎక్కడ కూడా పర్యాటక శాఖతో ఆర్టీసీ అనుసంధానమైనట్లు సమాచారం లేదని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. పర్యాటక శాఖ వద్ద పరిమితంగానే బస్సులు ఉన్నాయి. వారికి అవసరమైన బస్సులను ఆర్టీసీ నుండి తీసుకొనడం ద్వారా సంస్థకు అదనంగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఈ దిశగా ఆర్టీసీ పెద్దగా దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదు. దర్శనీయ స్థలాలు, పుణ్యక్షేత్రాలకు బస్సులను తిప్పడం పై ప్రధానంగా దృష్టికేంద్రీకరించాలని ముఖ్యమంత్రి మరో సూచన చేశారు. యాత్రికులకు రవాణా, వసతి, దైవదర్శనం బాధ్యతలు తీసుకొనడం ద్వారా ఆర్టీసీని భక్తులు ఆకట్టుకొనే అవకాశం ఉందని సూచించారు. ముఖ్యంగా శబరిమల, కొండగట్టు, బెంగుళూరు, తిరుపతి, షిర్డీకి బస్సులను పెంచవలసి ఉందని, యాత్రికులను ఆకట్టుకొనే విధంగా చర్యలు తీసుకొనవలసి ఉందని ముఖ్యమంత్రి కోరడం జరిగింది. ఈ దిశగా కూడా పెద్దగా ప్రయత్నం జరగలేదు. ఆశించిన మేరకు బస్సుల సంఖ్య పెరగలేదు. బస్సులపై ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించినప్పటికీ ఆర్టీసీకి ఆ రూపంలో పెద్దగా ప్రైవేటు రంగం నుండి ఆదాయం రావడం లేదు. ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమయ్యారు. అడపా దడపా ప్రైవేటు, సినిమా ప్రకటనలు వస్తున్నప్పటికీ పరిమితంగానే ఆదాయం వస్తుంది. పెరిగిన దాఖలాలు మాత్రం ఏ మాత్రం కనిపించడం లేదు. హైదరాబాద్‌లో తిరిగే ఏసీ బస్సుల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత వైఫై సదుపాయం మూడు మాసాలు కూడా అమలు కాలేదు. 2016 నవంబర్ 23న ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావులు ఎయిర్‌టెల్ సౌజన్యంతో ఏసీ బస్సుల్లో వైఫై సదుపాయాన్ని ఆర్భాటంగా ప్రారం భించారు. బస్సుల్లో ఎయిర్‌టెల్ ప్రకటనలు కనిపిస్తున్నాయి కాని వైఫై సేవలు మాత్రం నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి చేసిన సూచనలపై పెద్దగా దృష్టి పెట్టలేక పోయిన యాజమాన్యం బస్ బాడీ బిల్డింగ్ యూనిట్‌ను, ప్రింటింగ్ ప్రెస్‌ను, వరంగల్‌లోని టైర్ రీ ట్రేడింగ్ షాప్‌ను, తారనాక ఆసుపత్రిని ప్రైవేటైజేషన్ చేయడం, నియామకాలు నిలిపి వేసి కార్మికులపై పని ఒత్తిడి పెంచడం, సొంత బస్సులను సమకూర్చుకోకుండా ప్రైవేటు బస్సులను 16 నుండి 27 శాతానికి పెంచుకోవడం పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంతో కార్మిక అశాంతికి కారణం అవుతుంది. ఇప్పటికే కార్మికులు దశల వారిగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆర్టీసీలో సమ్మెలు ఉత్పన్నం కారాదని ముఖ్యమంత్రి సూచించినప్పటికీ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి.

హక్కుల కోసం ఉద్యమించాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యాంగం కల్పించిన హక్కుల పరి రక్షణకు మహోద్యమం నిర్మించాలని దళిత్ శోషన్ ముక్తిమంచ్ జాతీయ నాయకులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. ఆదివారం హైద రాబాద్‌లో డీఎస్ఎంఎం జాతీయ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా రాజ్యాంగం సామాజిక న్యాయం సవాళ్లు అనే అంశంపై జాతీయ సెమినార్ జరిగి ంది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్థిక సమానత్వం లేదన్నారు. సమా నత్వం సాధించేందుకే రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. దేశంలో 235 ప్రభుత్వ సంస్థలు, శాఖ లున్నాయని అన్నారు. 20 సంస్థలను ఇప్పటికే మూసివేశారని గుర్తు చేశారు. మిగతా సంస్థలు, శాఖలను ప్రైవేటుపరం చేయాలని సిఫార్సు చేసిందన్నారు. నీతిఆయోగ్ రూపొం దించిన మూడేళ్ల ప్రణాళిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయా లున్నాయని తెలిపారు. ఇది దేశానికే ప్రమాదమని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం నిధులు యంత్రాలకే ఖర్చు చేస్తున్నారని, కూలీలకు పనులను కల్పించడం లేదని ఆరోపించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ధ్వంసం చేశారని తెలిపారు. ఆధార్ అనుసంధానం వల్ల పేదలు నష్టపోతున్నారని తెలిపారు. ప్రణాళిక, ప్రణాళికేతర లేనప్పుడు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు నిధులు ఎక్కడా కేటాయిస్తారని ప్రశ్నించారు. సబ్‌ప్లాన్‌కు నిధులు లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. రిజర్వేషన్లను తొలగించాలని లేదంటే అగ్రకులాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు.

పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ

- ఈ ఏడాది 36 మరణాలు
- 180 పాజిటివ్ కేసులు నమోదు
- నోడల్ ఆసుపత్రిగా గాంధీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వర్షాలు పడుతుండటంతో స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. పాజిటీవ్ కేసులు పెరగడమే కాకుండా మరణాలు సైతం పెరుగుతున్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 180 పాజిటీవ్ కేసులు నమోదు కాగా అందులో 36 మంది మరణించారు. స్వైన్‌ఫ్లూ చికిత్సకు గాంధీ ఆసుపత్రి నోడల్ హస్పిటల్‌గా ఉండటంతో క్రిటికల్‌గా ఉన్న కేసులు ఇక్కడకు వస్తున్నాయి. ప్రస్తుతం గాంధీలో 12 మందికి చికిత్స పొందుతున్నారు. గాంధీ ఆసుపత్రితోపాటు హైదరాబాద్‌లోని మరికొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ స్వైన్ ఫ్లూ కేసులకు చికిత్స అందిస్తున్నట్టు తెలుస్తోంది. వర్షాకాలం ప్రారంభం కావడం గత కొద్ది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో స్వైన్‌ఫ్లూ పెరుగుతోంది. వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని సర్కార్ ఆదేశించింది. ప్రజల్లో సైతం స్వైన్‌ఫ్లూపై అవగాహనను పెంచే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

అవగాహన లేకపోవడంతో...

తీవ్రమైన దగ్గు, జలుబు ఉండటంతోపాటు ఒళ్లు నొప్పులు ఉండటం, తెమడ రావడం స్వైన్‌ఫ్లూ ప్రధాన లక్షణాలు. ఆ లక్షణాలు ఉన్న వారు వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుని స్వైన్‌ఫ్లూ రాకుండా నివారించుకునేలా చూడాలి. స్వైన్‌ఫ్లూ ప్రధానంగా ఎక్కువ వయస్సు వారికి, పిల్లలు, గర్భిణీలకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో గర్భిణీల్లో స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. గాం ధీ ఆసుపత్రి నోడల్ హాస్పిటల్ కావడంతో కేవలం ఇక్కడ నమోదు అయిన కేసులు మాత్రమే బయటికి తెలుస్తున్నాయి. జిల్లాల్లోనూ, అలాగే



ఇతర ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదు అయ్యే స్వైన్‌ఫ్లూ కేసులు బయటికి రావడం లేదు.

అప్రమత్తంగా సర్కార్...

వర్షాకాలం కావడంతో ఉష్ణోగ్రతలు తక్కు వగా ఉండటంతో ఈ కాలంలో స్వైన్‌ఫ్లూ ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి గ్రామీణ ప్రాంతాలతోపాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ అప్ర మత్తంగా ఉండేలా చూడాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధపెట్టి స్వైన్‌ఫ్లూతోపాటు ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను సర్కార్ ఆదేశించింది.

స్వైన్‌ఫ్లూకు సంబంధించిన మందులను సరఫరా చేయడంతోపాటు ప్రధానంగా దీనిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. శుభ్రంగా ఉండటంతోపాటు, ఇల్లు, ఇతర పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలనే అవగాహనను కల్పించాల్సిన అవసరం ఉంది.

రైల్వేస్టేషన్‌లో డిప్యూటీ సీఎండీ తనిఖీ



కరీమాబాద్, కెఎన్ఎన్ : వరంగల్ రైల్వేస్టేషన్‌ను దక్షణ మధ్య రైల్వే డిప్యూటీ మెడికల్ డైరెక్టర్ డా. సువర్ణాజ్యోతి సందర్శించారు. స్వచ్ఛ రైల్వే, స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా ఆమె ఆదివారం తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్‌లోని క్యాంటిన్, తాగునీటీ పరిశుభ్రతను తనిఖీ చేసి ప్రయాణికులకు స్వచ్ఛమైన నీరు అందిస్తున్నారా.. అని రైల్వే మేనేజర్‌ను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు స్వచ్ఛమైన నీరు అందించాలని తాగునీరు ఎప్పటికి అప్పుడు క్లోరినైజేషన్ చేయాలని సూచించారు. క్యాంటిన్‌లో నీటితో పాటు తాగునీరును క్షుణ్ణంగా పరిశీలించి ప్రయాణికులతో మెడికల్ డైరెక్టర్ డా. సువర్ణాజ్యోతి మాట్లాడారు. ప్రయాణికులకు రైల్వే స్టేషన్‌లో ఏ మేరకు సౌకర్యాలు అందిస్తున్నారో.. పరిసరాల పరిశుభ్రత విశ్రాంత గదులు తదితర వాటిపైఆరా తీశారు. ఆ సమయంలో వచ్చిన దురంతో, ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్‌లల్లోని ప్యాంటీ కార్న్ ను తనిఖీలు చేసి అందలో విక్రయిస్తున్న తినుబండారాలు, నీటని తనిఖీలు చేశారు. ఈక్రమంలో దురంతో ఎక్స్‌ప్రెస్ బోగిలో జారిపడిన ప్రయాణీకుడికి డా. సువర్ణాజ్యోతి ప్రథమ చికిత్స చేశారు. కార్యక్రమంలో ఏడిఎంఓ డా. కమల, స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, శేఖర్‌బాబు, ఆర్పీఎఫ్ సీఐ యు. నర్సింహ, రాజగోపాల్, రాంచందర్ నాయక్, వెంకటేశ్వర్లు, హెల్త్‌ఇన్స్ పెక్టర్ మీన, సిబ్బంది పాల్గొన్నారు.

అజేయుడు

- కానర్ మెక్‌గ్రెగర్‌పై ఫ్లాయిడ్ మేవెదర్ విజయం
- 50-0తో తిరుగులేని రికార్డు




ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ఓటమి అన్న పదమే ఎరుగని అమెరికా బాక్సింగ్ దిగ్గజం.. ఫ్లాయిడ్ మేవెదర్ రింగ్‌లో తనకు ఎదురేలేదని మరోసారి చాటాడు. కెరీర్‌లో తన విజయాల రికార్డును 50-0తో పదిలంగా కాపాడుకున్నాడు. ప్రొఫెషనల్ బాక్సింగ్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బౌట్‌గా అందరూ అభివర్ణించిన పోరులో మేవెదర్ శనివారం అమెరికాలోని లాస్‌వేగాస్‌లో ఐర్లాండ్ బాక్సర్ కానర్ మెక్‌గ్రెగర్‌పై తిరుగులేని విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన ఈ జూనియర్ మిడిల్‌వెయిట్ బాక్సింగ్ పది రౌండ్ల పోరులో మేవెదర్ చివరకు మెక్‌గ్రెగర్‌పై టెక్నికల్ నాకౌట్‌లో గెలిచాడు. ఈ విజయంతో మేవెదర్ సుమారు రూ.1300 కోట్ల రూపాయల ప్రైజ్‌మనీని దక్కించుకున్నాడు. ఓడిన కానర్‌కు సుమారు రూ.480 కోట్లు దక్కనున్నాయి. కానర్‌పై గెలిచిన తర్వాత 40 ఏళ్ల మేవెదర్ బాక్సింగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం పకియావోతో పోరు అనంతరం బాక్సింగ్‌కు వీడ్కోలు పలికిన మేవెదర్.. మనసు మార్చుకొని మళ్లీ రింగ్‌లోకి దిగాడు.

లాస్‌వెగాస్: వేదిక.. లాస్‌వెగాస్‌లోని సబీనా పార్క్. బాక్సింగ్ అభిమానులతో కిక్కిరిసిపోయింది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రొఫెషనల్ బాక్సింగ్ పోరు మరికొద్ది నిమిషాల్లోనే ఆరంభం కానుంది. ప్రేక్షకుల్లో ఒకటే సందడి. కానర్‌కు మద్దతివ్వడానికి ఐర్లాండ్ నుంచి భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులు కానర్‌కు అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు. హెవీ వెయిట్ మాజీ చాంపియన్ మైక్ టైసన్ సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. ఆ సమయం రానే వచ్చింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 9 గంటలు. లాకర్ రూమ్ నుంచి ముందుగా కానర్ రింగ్ వైపు అడుగులు వేసుకుంటూ వచ్చాడు. అంతే పెద్ద పెట్టున హర్షధ్వానాలు. ఆ వెనుకే మాస్క్ వేసుకొని మేవెదర్.. కానీ ఆ మాస్క్ అభిమానుల నుంచి అతని ముఖాన్ని దాచలేకపోయింది. అభిమానుల కేరింతల మధ్య ఇద్దరు రింగ్‌లోకి ప్రవేశించారు. ముందుగా కానర్ గురించి.. తర్వాత మేవెదర్ గురించి ప్రకటన.

మేవెదర్ -కానర్





40	వయసు	29
4	మ్యాచ్‌లు	0
50	విజయాలు	0
26	నాకౌట్‌లు	0
0	డ్రాలు	0
0	ఓటములు	1
5.8 అడుగులు	ఎత్తు	5.9 అడుగులు
	బరువు 149.5 పౌండ్లు	

ప్రైజ్‌మనీ
మేవెదర్ సుమారు రూ. 1300 కోట్లు
కానర్ మెక్‌గ్రెగర్ సుమారు రూ. 480 కోట్లు

"కానర్ నేను అనుకున్న దానికంటే మెరుగ్గా పోరాడాడు. భిన్నమైన పంచ్‌లు విసిరాడు. కానీ నేనే అతనికంటే మెరుగైన బాక్సర్‌ను. ప్రణాళిక ప్రకారం అతనికి సమయం ఇచ్చి పడగొట్టాను" - మేవెదర్

బౌట్ ఆరంభమైంది. ఆ పోరు ఎలా సాగిందో చూద్దాం. వారిద్దరు ఎలా స్కోరు చేశారో ఓ అనధికారిక స్కోరర్ ద్వారా తెలుసుకుందాం..

తొలి రౌండ్: తాను ఇన్ని రోజులూ చెబుతున్నట్లే ... ఆరంభంలోనే కానర్ ముష్టిఘాతాలు గుప్పించాడు. వాటిని మేవెదర్ తట్టుకున్నాడు. తిరిగి ఎదురుదాడి చేశాడు. కానీ కానర్ వాటి నుంచి తనను కాపాడుకొని మరింత దూకుడు ప్రదర్శించాడు. పదునైన అప్పర్ కట్‌ను ప్రత్యర్థికి రుచిచూపించాడు.

(స్కోరు: మేవెదర్ 9-10 కానర్)

రెండో రౌండ్: కానర్ తన ప్రత్యర్థిని త్వరగా నాకౌట్ చేస్తాననే వాడు. దానికి తగ్గట్టుగానే ఈ రౌండ్లో మేవెదర్ తల వెనుక భాగంపై పిడిగుద్దులు గుప్పించాడు. రిఫరీ హెచ్చరించాడు. కానర్ పంచ్‌లు విసురుతూనే ఉన్నాడు. అవి కాస్త క్రూరంగానే ఉన్నాయి. మేవెదర్ ఇంతవరకు పెద్దగా పంచ్‌లు గుప్పించలేదు.

(స్కోరు: మేవెదర్ 9(18)- 10 (20) కానర్)

మూడో రౌండ్: మేవెదర్ తల వెనుక భాగాన కానర్ మ రో బలమైన పంచ్ విసిరాడు. మరోసారి రిఫరీ హెచ్చరిక. స్వ ల్ప జరిమానా కూడా విధించారు. మేవెదర్ చిరునవ్వుతో కా నర్‌ను ఎదుర్కొన్నాడు. ఈ రౌండ్లో మేవెదర్ మెరుగ్గా పో రాడాడు. మూడో రౌండ్ తర్వాత కూడా కానర్‌దే పైచేయి

(స్కోరు: మేవెదర్ 9 (27)- 10 (30) కానర్)

నాలుగో రౌండ్: కానర్.. మేవెదర్ శరీరంపై కొన్ని షాట్లు గుప్పించాడు. తర్వాత ఎడమ చేతి పంచ్ విసిరాడు. దాన్ని మేవెదర్ ప్రతిఘటించి కొన్ని క్షణాలు కానర్‌ను పట్టుకున్నాడు. మేవెదర్ ముందుకు దూసుకుపోయి వేగం పెంచాడు. కానర్‌లో అలసట ఆరంభమైంది.

(స్కోరు: మేవెదర్ 10 (37)- 9 (39) కానర్)

ఐదో రౌండ్: మేవెదర్ ముందుగా పోరుకు సిద్ధమయ్యాడు. కానర్ అనుకున్నంత తేలిక పాటి ప్రత్యర్థి కాదని అతనికి తెలిసింది. 30 సెకన్లలో రౌండ్ ముగుస్తుందనగా మేవెదర్ బలమైన లెఫ్ట్ హుక్ విసిరాడు.

(స్కోరు: మేవెదర్ 10 (47)- 9 (48) కానర్)

ఆరో రౌండ్: కానర్ తీవ్రంగా పోరాడాడు. అతనికి మేవెదర్ కూడా ఏమీ తీసిపోలేదు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు విసురుకున్నారు. మేవెదర్ ముందుకొచ్చి కానర్‌పై బలమైన పంచ్‌లు గుప్పించాడు. కానర్ నీరసించి వాలిపోయాడు.

(స్కోరు: మేవెదర్ 10 (57)- 9 (57) కానర్)

ఏడో రౌండ్: పోరులో తొలి అర్ధం ముగిసినా కానర్ తన ప్రత్యర్థిని నాకౌట్ చేయలేకపోయాడు. తీవ్రమైన పంచ్‌లతో ఆకట్టుకున్నాడు. కానీ అప్పటికే బాగా అలసిపోయాడు. పంచ్‌లలో బలం, వేగం తగ్గాయి.

(స్కోరు: మేవెదర్ 10 (67)-9 (66) కానర్)

ఎనిమిదో రౌండ్: మేవెదర్ దాడులనుంచి తప్పించుకోవడానికి కానర్ పక్క నుంచి అద్భుతమైన హుక్ విసిరాడు. కానర్ కాళ్లు తేలుతున్నాయి. చేతులు కూడా అలసిపోయాయి. అతని పంచ్‌లు మేవెదర్‌ను బాధించడం లేదు. మేవెదర్ అప్పర్‌కట్ సంధించాడు. కానర్ కూడా ప్రత్యర్థి తలపై గుద్దాడు.

(స్కోరు: మేవెదర్ 10 (77)-9 (75) కానర్)

తొమ్మిదో రౌండ్: ఒక బౌట్‌లో ఇంత సుదీర్ఘ పోరాటం ఎరుగని కానర్.. మేవెదర్ పంచ్‌లకు చిత్తవుతూ వచ్చాడు. మరో 90 సెకన్ల సమయమే ఉండడంతో మేవెదర్ విజృంభించాడు. అప్పటికే కానర్ బాగా నీరసించాడు.

(స్కోరు: మేవెదర్ 10 (87)- 9 (84) కానర్)

పదోరౌండ్: కానర్ గెలవాలంటే నాకౌట్ ద్వారానే సాధ్యం కాని, అతను బాగా అలసిపోయాడు. అతని పంచ్‌లలో బలం లేదు. అనుభవం లేని కానర్ సుదీర్ఘ పోరులో నిలవలేకపోయాడు.

మేవెదర్ ముందుకొచ్చాడు. కుడి చేతిని బలంగా విసిరాడు. అది తట్టుకొని కానర్ పోరును కొనసాగించాడు. కానీ మేవెదర్ బలంగా దాడి చేయబోయాడు. ఇంతలో రిఫరీ పోరును ఆపి వేశాడు. అనంతరం ఇద్దరు రింగ్‌లో కౌగలించుకొని అభి నందనలు తెలుపుకున్నారు. మేవెదర్ టెక్నికల్ నాకౌట్‌లో గెలిచినట్లు రిఫరీలు ప్రకటించారు. దీంతో మేవెదర్ తన కెరీర్లో ఓటమి ఎరుగుని వీరుడిగా చరిత్ర సృష్టించాడు. వెంటనే బాక్సింగ్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు.

కష్టాల్లో ఆసీస్

- 18కి 3 వికెట్లు
- బంగ్లా 260 ఆలౌట్



షకిబుల్

ఢాకా: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 18 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ వార్నర్ 8 పరుగులకే ఔట్ కాగా, లియోన్ డకౌటయ్యాడు. ఖవాజా ఒక పరుగు వద్ద రనౌటై వెనుదిరిగాడు. హసన్ 7 పరుగులిచ్చి 1, షకిబుల్ మూడు పరుగులకు ఒక వికెట్ తీసి ఆసీస్‌ను ఇబ్బందుల్లోకి నెట్టారు. అంతకుముందు టాస్ గెలిచిన బంగ్లా ముందుగా బ్యాటింగ్ చేసి 78.5 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ తమిమ్ ఇక్బాల్ (71, 144 బంతుల్లో, 5 ఫోర్లు, 3 సిక్స్), షకిబుల్ (84, 133 బంతుల్లో, 11 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు.

విండీస్‌కు ఆధిక్యం



అండర్సన్

లీడ్స్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 169 పరుగులు అమూల్యమైన ఆధిక్యాన్ని సాధించింది. మూడో రోజు ఆదివారం ఆట ఆఖరుకు ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌ను ఉదయం కొనసాగించిన విండీస్ 427 పరుగులకు ఆలౌటైంది. హోప్ ఓవర్‌నైట్ స్కోరు 147 పరుగుల వద్దే వెనుదిరిగాడు. తర్వాత బ్లాక్‌వుడ్ (49), హోల్డర్ (43) రాణించారు. అండర్సన్ (5-76)కు 5 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులకు ఇంగ్లాండ్ ఆలౌటైన సంగతి తెలిసిందే.

చరిత్ర సృష్టించిన అమిత్



హాంబర్గ్: అమిత్ ఫంగల్ చరిత్ర సృష్టిం చాడు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కాడు. రెండో రౌండ్ పోరులో ఆదివారం అతను ఏడో సీడ్ కార్లోస్ క్విపో (ఈక్వెడార్)ను చిత్తుచేశాడు. 49 కిలోల విభా గంలో రిఫరీల ఏకగ్రీవ తీర్పుతో క్వార్టర్స్ చేరాడు. కాగా సీనియర్ మనోజ్ కుమార్ 69 కిలోల విభాగంలో మల్దోవెన్‌ను 3-2 తేడాతో ఓడించాడు.

ఎన్ఎస్జీలోకి భారత్: అమెరికా ఆతృత



వాషింగ్టన్: అణు సరఫరా దారుల గ్రూప్ (ఎన్ఎస్జీ)లోకి భారత్‌ను చేర్చడానికి అమెరికా కంకణం కట్టుకుంది. ఈ ఏడాది జూన్‌లో ఎన్ఎస్జీ సమావేశమైనా భారత్ చేరిక పట్ల ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. అయితే.. ఎన్‌పీటీ మీద సంతకం చేయని దేశాలను ఎన్ఎస్జీలోకి తీసుకునేందుకు నవంబర్‌లో చర్చిద్దామని నిర్ణయించింది. ఎన్ఎస్జీలో సభ్య దేశమైన చైనా, భారత్ చేరికను వ్యతిరేకిస్తోంది. అణు నిరాయుధీకరణ ఒప్పందం (ఎన్‌పీటీ) మీద భారత్ సంతకం చేయకపోవడాన్ని కారణంగా చూపుతోంది. ఎన్‌పీటీలో ఇప్పటికే అణ్వస్త్రాలు ఉన్న దేశాలనూ, లేని దేశాలనూ ఒకే రకంగా పరిగణించాలని భారత్ కోరుతోంది. ఆ కారణంగానే సంతకం చేయడం లేదు. ఎన్ఎస్జీ ఏ నిర్ణయం తీసుకున్నా ఏకగ్రీవంగానే తీసుకుంటుంది కాబట్టి, ఏ ఒక్క దేశం వ్యతిరేకించినా కొత్త దేశానికి సభ్యత్వం ఇవ్వడం కుదరదు. అయితే.. భారత్‌కు ఎన్ఎస్జీ సభ్యత్వం ఇవ్వడమనేది అమెరికాకు చాలా ముఖ్యమైన విషయమైందని తాజాగా అమెరికా అధ్యక్షుడి నివాసం శ్వేతసౌధం అధికారి ఒకరు పీటీఐకి చెప్పారు. దీంతో భారత్‌కు ఎన్ఎస్జీ సభ్యత్వం ఇప్పించడానికి మరిన్ని దారులను అమెరికా వెతుకుతున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఆ అధికారి అన్నారు. ఈ ఏడాది జూన్‌లో భారత ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసినప్పటి నుంచి ఆ దేశానికి ఇది చాలా ముఖ్యమైన విషయమై కూర్చుందని తెలుస్తోంది. ఆ సమావేశం ట్రంప్‌పై చాలా ప్రభావం చూపించిందని వైట్ హౌస్ అధికారులు అంటున్నారు. అయితే.. భారత్ తరువాత పాకిస్థాన్ కూడా చైనా మద్దతుతో ఎన్ఎస్జీలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసింది.

భారత వాయుసేనకు మధ్య తరహా క్షిపణులు



న్యూఢిల్లీ: భారత్‌కు ఎట్టకేలకు ఉపరితలం నుంచి గాల్లోకి ప్రయోగించే మధ్య తరహా క్షిపణి సొంతం కానుంది. మరి మూడేళ్లలో మధ్య తరహా ఉపరితలం నుంచి గాల్లోకి (ఎంఆర్ఎస్ఏఎం) వ్యవస్థ మన సొంతం కానుంది. ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) తో భారత్‌కు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవెలెప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) సంయుక్తంగా నిర్మించే ఈ వ్యవస్థ 2020 నాటికి సిద్ధం కానుంది. ఈ వ్యవస్థ భారత్‌కు ఏర్పడితే మనం దీనిని ఉపయోగించి బాలిస్టిక్ మిస్సైళ్లను, యుద్ధ విమానాలను, యుద్ధ హెలికాప్టర్లను 70 కిలోమీటర్ల దూరంలోనే కూల్చేయొచ్చు. ఎంఆర్ఎస్ఏఎంతో నిఘా డ్రోన్‌లను కూడా కూల్చొచ్చని, యుద్ధంలో యుద్ధ విమానాలకు సమాచారాన్ని సేకరించి చేరవేసే అవాక్స్ రాడార్ విమానాలను కూడా గురి చూసి కొట్టొచ్చని సైన్యం అధికారి ఒకరు పీటీఐతో చెప్పారు అవాక్స్ విమానం యుద్ధరంగంలో ఉంటే దానికి నాలుగైదు యుద్ధ విమానాలు రక్షణ కల్పిస్తుంటాయి. ఇది శత్రు దేశపు సమాచారాన్ని తమ దేశానికి అందిస్తుంటుంది. యుద్ధంలో అవాక్స్ విమానాలు ఉంటే ఆ దేశానిది పై చేయి అయ్యే అవకాశం ఉంది. దీంతో దీనిని కూల్చేస్తే కూల్చిన దేశానికి విజయావకాశాలు పెరుగుతాయి. ఇప్పుడు తయారు కానున్న వ్యవస్థతో భారత వయుసేనతో పాటు నేవీకి కూడా ఉపయోగమే. అంటే యుద్ధ నౌకల మీద నుంచి కూడా ప్రయోగించవచ్చన్న మాట. ఈ ప్రాజెక్టు కోసం రూ. 17,000 కోట్ల ఒప్పందాన్ని ఐఏఐతో డీఆర్‌డీఓ కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా 40 ఫైరింగ్ యూనిట్లతో పాటు 200 క్షిపణులు వస్తాయి. అంటే 200 క్షిపణులను 40 ప్రదేశాల నుంచి ప్రయోగించే అవకాశం 2020 నాటికి మనకు వస్తుంది.

చైనాను తాకిన పాఖర్ తుఫాను



బీజింగ్: ఈ ఏడాది 14వ తుపాను చైనాను తాకింది. ఆదివారం పాఖర్ టైఫూన్ తైషాన్ నగరం వద్ద తీరాన్ని దాటింది దీంతో గంటకు 118.8 కిలోమీటర్ల వేగంతో తీవ్రమైన గాలులు వీయడం మొదలుపెట్టాయి. ఇటీవలే హాలో తుఫాను వల్ల చైనా బాగా నష్టపోయిన విషయం తెలిసిందే. తాజాగా పాఖర్ తుఫాను హాలో తుఫాను తాకిన నాలుగు రోజుల తరువాత తీరాన్ని దాటింది. దీంతో వారం రోజుల్లో రెండు తుఫానులను చైనా ఎదుర్కొన్నట్లైంది. ఈ తుఫానుకు దిగువ మెకాంగ్ నదిలో నివసించే మంచి నీటి చేప పేరు పెట్టారు. ఆదివారం పాఖర్ తీరాన్ని దాటొచ్చన్న అంచనాలతో శనివారం నుంచే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలను మూసివేయడం ప్రారంభించారు. పాఖర్ తుఫాను వాయవ్య దిశగా ప్రయాణించి గువాంగ్జి జువాంగ్ స్వయంపాలిత ప్రాంతాన్ని చేరి బలహీనపడుతుందని చైనా వాతావరణ సంస్థ అంచనా వేసింది. ఈ క్రమంలో గువాంగ్‌డాంగ్, ఫుజియాన్, హైనాన్ రాష్ట్రా లతో పాటు గువాంగ్జి లో ఎడతెరిపి లేని వర్షాలు సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం వరకూ కురుస్తాయి. పాఖర్‌తో పాటు హాలో ప్రభావం వల్ల వారం రోజులుగా పలు విమానాలు రైళ్లు రద్దయ్యాయి.

రుజువైతే తగలబెడదాం

- పంజాబ్, హర్యానాలో హింసకు ముందే ప్లాన్
- బాబాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే అల్లర్లకు సిద్ధం
- దాడులపై డేరా అనుచరుల ఫోన్ సంభాషణ
- గుర్మీత్ పేరు బయటకు రాకూడదని చర్చ
- పంచకుల హింస ప్రణాళికతోనే..



న్యూఢిల్లీ: పంజాబ్,హర్యానాలో హింసకు పాల్పడిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అనుచరులు విధ్వంసాలకు ముందే కుట్ర చేసినట్లు తెలుస్తోంది. సీబీఐ న్యాయస్థానం రామ్ రహీంను దోషిగా తేలుస్తుందని ముందే ఊహించి.. కోర్టు తీర్పునకు ముందే తమ మద్దతుదారులను డేరా నిర్వాహకులు సమీకరించారు. హర్యానాలోని పంచకుల సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గుర్మీత్‌ను దోషిగా తేల్చిన నిమిషాల్లోనే పంచకులలో హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. గుర్మీత్‌ను కోర్టు దోషిగా తేలుస్తుందన్న విషయా న్ని ముందే పసిగట్టిన అతని అనుచరులు బస్సులు,టెంపో వ్యాన్‌ల ద్వారా మద్దతుదారులను పంచకులకు రప్పించారు. మద్దతుదారులు మాట్లాడుకున్న ఫోన్ సంభాషణను ఓ జాతీయ చానల్ బయటపెట్టింది. హింసాత్మక ఘటనలు ఎలా చేయాలి..పోలీసులకు దొరికితే గుర్మీత్ పేరు బయటకు పొక్కకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను ముందే క్షుణ్ణంగా చర్చించుకున్నారు.

డేరా బాబాను కోర్టు దోషిగా ప్రకటించక ముందే అతడి అనుచరుల ఫోన్ సంభాషణ

బాబా అనుచరుడు-1: హలో...దాడులు చేసేందుకు మనవాళ్లు చాలామంది రెడీగా ఉన్నారు....

బాబా అనుచరుడు-2: ఓకే...దాడులు చేసే క్రమంలో ఎక్కడ బాబా పేరు బయటకు రావొద్దని మన వాళ్లకు చెప్పండి.. ఎవరైనా ప్రశ్నిస్తే మా మనోభావాలు దెబ్బతిన్నాయనే దాడులు చేశామని చెప్పాలి.

బాబా అనుచరుడు-1: నేను మనవాళ్లందరికీ మెసేజ్ చేశాను. వాళ్లు ఎవరి పేరు బయటపెట్టరు.

బాబా అనుచరుడు-2: చిన్న పిల్లలైనా దాడికి కారణం బాబా అని చెప్పొద్దు.. మీరెప్పుడు బయలుదేరతారు.

బాబా అనుచరుడు-1: నేను దారిలో ఉన్నాను.. సద్గురు నుంచి మాకు పిలుపు వచ్చిందని రిపోర్టర్లకు చెప్పా. మీకు అవసరమైన అన్ని వస్తువులను తీసుకుని వెళ్లండి.

హర్యానా, పంజాబ్‌లో ప్రశాంతత

డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను పంచకుల సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన తర్వాత చెలరేగిన హింసతో హర్యానా, పంజాబ్ ప్రజలు వణికిపోవడంతో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందు సమస్యాత్మక ప్రాంతాల్లో కర్ఫ్యూను విధించాయి.

ఆదివారం కొన్ని ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో కర్ఫ్యూను ఎత్తివేశారు. శనివారం హర్యానాలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని నివేదికలు అందాయి. సిర్సా జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి 5 గంటలపాటు కర్ఫ్యూను ఎత్తివేశారు. ఢిల్లీ నుంచి కట్రా మీదుగా అంబాలా వెళ్లే రైలు సర్వీసులను పునరుద్ధరించారు. హర్యానాలో ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నారని ఆ రాష్ట్ర డీజీపీ బీఎస్ సంధు తెలిపారు.పంజాబ్‌లోనూ ప్రశాంత పరిస్థితులు నెలకొన్నట్లు అధికార ప్రతినిధి తెలిపారు. సున్‌రాజ్, రోహ్‌తఖ్ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు. సోమవారం గుర్మీత్ సింగ్‌కు శిక్ష ఖరారు చేస్తుండటంతో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

పంచకుల, సిర్సా, రోహ్‌తక్, ఫతేహాబాద్ జిల్లా ల్లో హై అలర్ట్ ప్రకటించారు. పరిస్థితి చేయిదాటిపో కూడదని హర్యానా ప్రభుత్వం ఇప్పటికే గుర్మీత్ సింగ్‌కు చెందిన 30 సమావేశ కేంద్రాలను సీజ్ చేసింది. గుర్మీత్ అనుచరులు గుంపులు గుంపులుగా చేరకుండా హర్యానా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నారని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ ఆరోపించడం గమనార్హం.

విశ్వాసం పేరుతో హింస చెల్లదు

- డేరా హింసపై ప్రధాని హెచ్చరిక
- కొత్త స్వచ్ఛ భారత్ ఉద్యమం కావాలని పిలుపు
- 'జమాత్ ఉలేమా' సంస్థ సేవలు అభినందనీయం



న్యూఢిల్లీ: ఎవరైనా వారి విశ్వాసం పేరుతో చేసే హింస చెల్లదని మోడీ హెచ్చరించారు. ఆదివారం నెలవారీ మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడిన మోడీ, డేరా సచ్చా సౌదా పేరెత్తకుండానే సదరు సంస్థ అనుయాయులు చేసిన హింసను ఖండించారు. ఎవరైనా సరే చట్టానికి లోబడి ఉండాల్సిందేనని ప్రధాని స్పష్టం చేసారు. విశ్వాసం పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం కూడదని ప్రధాని ప్రకటించారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని, చట్టం ముందు అందరూ సమానేమేనని చెప్పారు. రామ్ రహీమ్ సింగ్‌ను రేప్ కేసులో కోర్టు దోషిగా ప్రకటించిన తరువాత శుక్రవారం ఆయన మద్దతుదారులు హింసకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని సదరు హింసను ఖండించే వేదికగా మోడీ చేసుకున్నారు. ఇదే కార్యక్రమంలో ఆయన జన్ ధన్ ఖాతాలను ప్రస్తావించారు. ఈ పథకం మొదలై మూడేళ్లైందని, 30 కోట్ల కుటుంబాలు ఈ ఖాతాలు తెరిచి రూ. 65,000 కోట్ల మొత్తాన్ని డిపాజిట్ చేసారని తెలిపారు. సామాన్యుడు దేశ ఆర్థిక వ్యవస్థలో భాగమైనందుకు తాను మూడేళ్ల నుంచీ గర్విస్తున్నానని మోడీ పేర్కొన్నారు. రూపే డెబిట్ కార్డును చూసిన ఖాతాదారులు తమకు దక్కిన గౌరవానికి సంతోషిస్తారన్నారు. ముద్ర యోజనతో లక్షలాది మందికి రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. దీంతో స్వయం ఉపాధికి దేశంలో అవకాశం పెరిగిందని వివరించారు. హింస, జన్ ధన్ ఖాతాలతో పాటు మతాతీత ఐక్యత గురించి మోడీ మాట్లాడారు. జమాత్ ఉలేమా ఏ హింద్ అనే సంస్థ కార్యకర్తలు గుజరాత్ వరదల్లో పాడయిన 22 ఆలయాలు, రెండు మసీదులను శుభ్రం చేసారని చెప్పారు. అలాంటి ఐక్యత అందరిలోనూ ఉండాలని మోడీ పిలుపునిచ్చారు. దేశంలో 67 శాతం మందికి టాయిలెట్లు వచ్చేసాయని, స్వచ్ఛ భారత్‌కు మూడో వార్సికోత్సవం సందర్భంగా ప్రజలు మరింత స్ఫూర్తితో స్వచ్ఛత విషయంలో కొత్త చరిత్రను లిఖించాలని కోరారు.

నేడే శిక్ష ఖరారు

15 ఏళ్ల క్రితం ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి సీబీఐ కోర్టులో దోషిగా తేలిన డేరాబాబాకు నేడు శిక్ష ఖంారుకానుంది. రోహ్‌తక్‌లోని సునరియా జైలులో ఉన్న గుర్మీత్‌సింగ్‌కు శిక్ష ఖరారు చేసేందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జైలుకు వెళ్లనున్నారు. దీంతో రోహ్‌తక్ పరిసర ప్రాంతాలన్నీ భద్రతా వలయంలోకి వెళ్లాయి. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. డేరా బాబాకు శిక్ష ఖరారు చేసే జడ్జికి ఇప్పటికే ప్రత్యేక సౌకర్యాలు, అదనపు భద్రత ఏర్పాటు చేశారు. చండీగఢ్ హైకోర్టు ఆదేశం నేపథ్యంలో సునరియా జైలులోనే శిక్ష ఖరారు చేసేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రోహ్‌తక్ జిల్లా మొత్తం పారామిలిటరీ బలగాల ఆధీనంలో ఉందని డిప్యూటీ కమిషనర్ అతుల్ కుమార్ తెలిపారు. బయటి ప్రాంతం నుంచి రోహ్‌తక్ వచ్చే ప్రతీ వ్యక్తిని పూర్తిగా చెక్ చేసిన తర్వాత పంపుతున్నామని చెప్పారు. ఎవరైనా గుర్తింపు కార్డు లేకుండా రోహ్‌తక్ జిల్లాలోకి వస్తే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. జైలు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంచారు.

తప్పించేందుకు కుట్ర



పంచకుల సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను దోషిగా తేల్చిన రోజు కోర్టు కాంప్లెక్స్‌లో హైడ్రామా నడిచింది. బాబాను తప్పించేందుకు అతని ప్రైవేట్ సిబ్బంది స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని స్పాట్ లో ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. న్యాయస్థానం బాబాను దోషిగా ప్రకటించిన వెంటనే అతన్ని ప్రైవేటు వాహనంలో తరలించేందుకు ప్రయత్నించగా పోలీసులు..పారామిలిటరీ బలగాలు ప్రతిఘటించినట్లు తెలిపారు. కోర్టు పరిసరాలకు కిలో మీటర్ దూరంలో వేలాదిగా మోహరించిన గుర్మీత్ అనుచరుల వద్దకు తీసుకెళ్తే బాబాను జైలుకు తీసుకెళ్లకుండా కాపాడవచ్చని ప్లాన్ చేశారని చెప్పారు. పోలీసు వాహనంలో ఎక్కిం చేందుకు ప్రయత్నించిన సమయంలోనూ గుర్మీత్ ప్రైవేట్ భద్రతా సిబ్బంది జులుం ప్రదర్శించారని..ఓ దశలో పోలీసులపై దాడికి కూడా యత్నించారని వెల్లడించారు. పోలీసు వాహనాన్ని నిలిపివేసేందుకు ప్రయత్నించిన బాబా ప్రైవేట్ సిబ్బందిని సెక్యూరిటీ అధికారులు అడ్డుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు.


బాబా ఆస్తులు సీజ్

ఛండీగఢ్: అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. గుర్మీత్ చీకటి సామ్రాజాన్ని కూల్చేందుకు హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలు చర్యలు వేగవంతం చేశారు. డేరాబాబా స్థిర,చరాస్థుల వివరాలు సేకరిస్తున్న రెండు రాష్ట్రాల రెవెన్యూ అధికారులు ఇప్పటికే పలు ప్రాంతాల్లో దాడులు కూడా నిర్వహించినట్లు తెలుస్తోంది. చండీగడ్ హైకోర్టు ఆదేశాల మేరకు డేరా బాబా ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు రంంగలోకి దిగారు.

బాబా ఆస్తుల చిట్టాతో పాటు బ్యాంకుల్లో దాచిన డబ్బు, విలువైన వస్తువుల వివరాలను కూడా సేకరించేపనిలోపడ్డారు. ఇప్పటికే డేరా పేరుతో ఉన్న ఆస్తులు, బ్యాంక్ అకౌంట్ల వివరాలు సేకరించిన హర్యానా, పంజాబ్ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. మంగళవారంలోగా డేరాబాబా ఆస్తుల చిట్టాను తమ ముందుంచాలని చండీగఢ్ హైకోర్టు హర్యానా, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. హింసకు పాల్పడిన డేరా అనుచరులు చేసిన ఆస్తినష్టాన్ని బాబా ఆస్తులు అమ్మైనై పూడ్చాలని సూచించింది. ఈనేపథ్యంలో హర్యానా,పంజాబ్ అధికారులు సంయుక్తంగా దాడులు కొనసాగిస్తున్నారు. డేరా బాబాను సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చడంతో అతడి అనుచరులు రెచ్చిపోయి...దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. బాబా అనుచరుల దాడిలో 36 మంది మృతి చెంద గా..250 మందికి పైగా గాయపడ్డారు. వాహనాలు, రైల్వే స్టేషన్ల దగ్ధంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు.

పార్టీ పదవి నుంచి పళని ఔట్

- పావులు కదుపుతున్న దినకరన్



చెన్నై: తమిళనాడు రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ప్రభు త్వం అసెంబ్లీలో బలపరీక్షను నిరూపించుకునేలా ఆదేశించాలని డీఎంకే నేతలు గవర్నర్ విద్యాసాగర్ రావును కోరారు. గవర్నర్ విద్యాసాగర్ రావు సకాలంలో నిర్ణయం తీసుకోకుంటే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలుస్తామన్నారు. ఇంకా అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. మొత్తం 234 ఎమ్మెల్యేలున్న తమిళనాడులో అన్నాడీఎంకే కు 135 మంది ఎమ్మెలుండగా ఇప్పటికే పళని ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ 22 మంది శశికళ వర్గంలో చేరిపోయారు. దీంతో పళనిస్వామి 113 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారు. నిజానికి తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 118 కావడంతో ప్రతిపక్షాలు బలపరీక్షకు డిమాండ్ చేస్తున్నాయి.

అన్నాడీఎంకేలో పన్నీర్,పళని వర్గీయులకు షాక్‌ల మీద షాకిలిస్తున్న ఆ పార్టీ డిప్యూటీ సెక్రటరీ దినకరన్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. సీఎం పళనిస్వామిని పార్టీ పదవి నుంచి తొలగించేశారు. సేలం జిల్లా కార్యదర్శి పదవి నుంచి పళనిస్వామిని తొలగిస్తూ..ఆ స్థానంలో తన వర్గం ఎమ్మెల్యే ఎస్‌కే సెల్వంను నియమించారు. చిన్నమ్మ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు దినకరన్ ప్రకటించారు. పార్టీ నిబంధనల ప్రకారం జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఉండేవారు తనకు అనుకూలంగా ఉండాలనే దినకరన్ పన్నీర్,పళని వర్గీయులను పార్టీ పదవులకు దూరం చేస్తున్నట్లు సమాచారం. పార్టీలోని కీలక స్థానాల్లో తన వర్గం నాయకులు ఉంటేనా పన్నీర్,పళనిలకు చెక్ పెట్టవచ్చని దినకరన్ భావిస్తున్నారు.

ఎన్డీఏలోకి అన్నాడీఎంకే..?

తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకే త్వరలో ఎన్డీఏ కూటమిలో చేరనుందని ప్రచారం జరుగుతోంది. దక్షిణ రాష్ట్రాల వ్యవహారాలు చూస్తున్న బీజేపీ నాయకుడు అన్నాడీఎంకే ను ఎన్డీఏ కూటమిలో విలీనం చేసేందుకు చర్చలు జరుపుతున్నారని బీజేపీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. ఎన్డీఏ కూటమిలో చేరడంతోనే అన్నాడీఎంకే కేంద్ర ప్రభుత్వంలోనూ భాగస్వామి అవుతుందని చెప్పారు.

లాలూ ర్యాలీ.. టార్గెట్ మోడీ



పాట్నా: విపక్షాల ఐక్యతను చాటేందుకు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పాట్నాలో నిర్వహించిన మెగా ర్యాలీకి విపక్షాల కీలక నేతలు లేకుండా ముగిసింది. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల ఐక్యతను చాటేందుకు నిర్వహించిన మెగార్యాలీకి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, జేడీయూ రెబల్ శరద్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ హాజర య్యారు. ఈ ర్యాలీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పతనానికి నాందిపలుకు తుందని లాలూ వ్యాఖ్యానించారు. ముందుగా ప్రకటించినట్లే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరుకాలేకపోయినప్పటికీ...ఆ పార్టీ నుంచి గులాంనబీ ఆజాగ్,సీపీ జోషి హాజరయ్యారు. వామపక్షాల నుంచి సురవరం సుధాకర్ రెడ్డి, జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ ర్యాలీలో పాల్గొన్నారు.

మరో మహాకూటమిని ఏర్పాటు చేస్తాం

బీహార్‌లో మహాకూటమి సర్కార్ పతనంపై జేడీయూ సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్జేడీ నిర్వహించిన మహా ర్యాలీలో పాల్గొన్న శరద్ యాదవ్.. మోడీకి ధీటుగా జాతీయ స్థాయిలో మరో మహాకూటమి ఏర్పాటు చేస్తామని ప్రతినబూనారు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను భయపెట్టేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు.

మార్ఫింగ్ ఫోటోతో బుక్కైన లాలూ

పాట్నాలో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ నిర్వహించిన ర్యాలీకి వచ్చిన జనం ఫోటోను లాలూ మార్ఫింగ్ చేశారని ప్రచారం జరుగుతోంది.వేలల్లో వచ్చిన ఆర్జేడీ కార్యకర్తలతో నిండిన గాంధీ మైదాన్ ఫోటోను లాలూ మార్ఫింగ్ చేసి లక్షల్లో ఉన్నట్లు చూపుతూ ట్విట్టర్లో పోస్ట్ చేశారని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.





చిరంజీవి, టోనిచింగ్

తెలుగు సినిమాలకు హాలీవుడ్ స్టంట్స్

తెలుగు సినిమా కొత్తపుంతలు తొక్కుతోంది. మార్కెట్ పెరగడంతో పాటు సాంకేతిక పరంగా కూడా కొత్త జిలుగులను అద్దుకుంటోంది. బడ్జెట్‌ను సైతం లెక్కచేయక అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్టార్ హీరోల సినిమాలను తీసేందుకు టాలీవుడ్ అత్యంత ఆసక్తిని కనబరుస్తోంది. ఇందులో భాగంగా లొకేషన్ల విషయంలోనే కాదు గ్రాఫిక్స్, ఎఫెక్ట్స్ వంటి సాంకేతికత కోసం ఎంతటి వ్యయాన్ని అయినా భరించేందుకు నిర్మాతలు వెనుకాడటం లేదు. సినిమా క్వాలిటీ పరంగా అత్యున్నతంగా రావడం కోసం హాలీవుడ్ సాంకేతిక నిపుణులను సైతం తమ సినిమాలకు ఎంపిక చేసుకుంటున్నారు. లోగడ భారతీయుడు వంటి కొన్ని సినిమాలకు హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పనిచేసినప్పటికీ బాహుబలి స్ఫూర్తితో హాలీవుడ్ నిపుణులను తీసుకోవడం మరింత ఎక్కువైంది. నితిన్, దర్శకుడు హను రాఘవపూడిల కలయికలో రూపొందిన లై చిత్రం ఈ మధ్యనే విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులోని యాక్షన్ పార్ట్‌కు హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ డాన్ బిల్‌జెరియన్ పనిచేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పలు సినిమాలకు కూడా హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు, ఇతర శాఖలకు చెందిన నిపుణులు పనిచేస్తుండటం విశేషం. ఎన్టీఆర్ కథానాయకుడిగా బాబి దర్శకత్వంలో రూపొందుతున్న జై లవకుశ చిత్రానికి వాన్స్‌హార్ట్‌వెల్ అనే హాలీవుడ్ నిపుణుడు పనిచేస్తున్నారు.

ఈ చిత్రంలో ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తుండటంతో ఒక పాత్రకు మరొక పాత్రకు ఎంతో వ్యత్యాసం చూపాల్సిరావడంతో ఆయనను ఎంపికచేశారని సమాచారం. హాలీవుడ్‌లో ఎఫ్ఎక్స్ ఎఫెక్ట్స్ నిపుణుడిగా వాన్స్‌హార్ట్‌వెల్‌కు మంచి పేరుంది. రజనీకాంత్, శంకర్‌ల కలయికలో రూపొందుతున్న 2.0. చిత్రానికి కూడా వాన్స్ పనిచేస్తున్నారట. అలాగే అఖిల్ అక్కినేని, విక్రమ్‌కుమార్‌ల కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం యాక్షన్ కోసం బాబ్ బ్రౌన్ పనిచేస్తున్నారు. హాలీవుడ్‌లో టెర్మినేటర్, ఐరన్‌మేన్ వంటి సినిమాలకు ఆయన స్టంట్ మాస్టర్‌గా పనిచేశారు. ఇక ప్రభాస్, దర్శకుడు సుజీత్‌ల కలయికలో రూపొందుతున్న సాహో చిత్రం యాక్షన్ కోసం కెన్నీబేట్స్ పనిచేస్తున్నారట. లోగడ హాలీవుడ్‌లో రూపొందిన ట్రాన్స్‌ఫార్మర్స్ వంటి పలు చిత్రాలకు ఆయన యాక్షన్ పార్ట్‌కు పనిచేశారు. ఇక ఈ సినిమాల సంగతి ఇలావుంటే....మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రం సైరా నరసింహారెడ్డి చిత్రం కోసం హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడి కథాంశం కావడంతో దీనిని ఎంతో గొప్పగా, భారీ బడ్జెట్‌తో తీయాలని సంకల్పించారు.

ఇందులో భాగంగా యుద్ధ సన్నివేశాలను అద్భుతంగా తెరకెక్కించాలని అనుకుంటున్నారు. హాలీవుడ్ చిత్రం స్పైడర్‌మేన్ స్టంట్స్ ద్వారా టోనిచింగ్‌కు ఎనలేని గుర్తింపు లభించింది. ఇప్పుడాయన సైరా నరసింహారెడ్డి చిత్రానికి పనిచేయబోవడం ప్రత్యేకతను సంతరించుకుందని పరిశ్రమలో అంటున్నారు.ఏదిఏమైనప్పటికీ తెలుగు సినిమాలకు హాలీవుడ్ నిపుణులు పనిచేయడం గతంతో పోల్చుకుంటే మరింత ఎక్కువైందన్నది వాస్తవం. అయితే తెలుగు సినిమాలకు హాలీవుడ్ సాంకేతిక నిపుణులను తీసుకోవడం అధికం కావడంతో స్థానిక సాంకేతిక నిపుణులలో కొంత నిరాశ అలుముకుంటోంది. మేము కూడా ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ సిద్ధమేనని, ఇప్పటికే ఎన్నో ప్రయోగాలలో తమ వంతు కీలక పాత్ర పోషించామని పలువురు అంటున్నారు.



ఎన్టీఆర్, వాన్స్‌హార్ట్‌వెల్



నితిన్, డాన్ బిల్ జెరియన్



అఖిల్ , బాబ్ బ్రౌన్





ప్రభాస్, కెన్నీబేట్స్



విభిన్నమైన పాత్రలకు ఇమేజ్‌ను అధిగమించాల్సి ఉంటుంది

బాలకృష్ణ

విభిన్నమైన పాత్రలు, వైవిధ్యమైన పాత్రలు చేసేటప్పుడు ఆర్టిస్టులు తమ ఇమేజ్‌ను అధిగమించి నటించాల్సి ఉంటుంది. ఇది ఓ రకమైన సవాల్ వంటింది అని కథానాయకుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం పైసావసూల్ విడుదలకు సన్నద్ధమవుతోంది. కాగా ఈ చిత్రం ఆడియో సక్సెస్‌మీట్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, నాన్న ఎన్.టి.ఆర్.గారి స్ఫూర్తితో విభిన్నమైన పాత్రలు చేస్తూ వస్తున్నాను. గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రం చేసిన తర్వాత పూర్తిగా విభిన్నమైన ఈ చిత్రం చేయాల్సి వచ్చినపుడు ఇదంతా ఆర్టిస్టుకు సర్వసాధారణమైన విషయమేనని నేను ఎక్కువగా ఆలోచించలేదు. నాకిది 101 సినిమా అని కాకుండా ఒకటో సినిమాగా భావించాను. దర్శకుడిగా పూరి జగన్నాథ్ ఏంటో తెలుసున్నందువల్ల సబ్జెక్టు గురించి ఎక్కువసార్లు చర్చలు జరపకుండానే ఈ చిత్రం చేశాను. అయితే కథానాయిక శ్రియ మాత్రం గౌతమీపుత్ర...చిత్రంలోని పాత్ర తర్వాత ఈ చిత్రంలోని పాత్ర చేస్తే ఎలా ఉంటుందోనని కాస్త ఆలోచించింది. అయితే ఇందులోని పాత్రకు ఆమే కరెక్ట్ అని అందరూ అంటారు. అంత అద్భుతమైన పాత్ర ఆమెది. నూతన కథానాయిక ముస్కాన్ కూడా తన పాత్రలో ఒదిగిపోయింది. అనూప్‌రూబెన్స్ సంగీతం అలరింపజేస్తుంది. ప్రేక్షకాభిమానులను అలరింపజేసే అన్ని హంగులున్న సినిమా ఇది అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నటుడు, నిర్మాత ఎం.మోహన్‌బాబు మాట్లాడుతూ, బాలయ్యబాబు రికార్డులకు కొత్త కాదు. లోగడ ఆయన సినిమాలు సిల్వర్‌జూబ్లీలు, గోల్డెన్ జూబ్లీలు ఆడాయి. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. సినీ పరిశ్రమలో అందరూ కలిసుండాలి. ఈ సినిమా ఈ ఏడాదిలోనే ఘన విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు పూరి జగన్నాథ్ మాట్లాడుతూ, వృత్తిపట్ల అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతలను మోహన్‌బాబుగారిలోను, బాలయ్యబాబులోను చూశాను. ఈ చిత్రాన్ని నిర్మాత కోరిక మేరకు ముందుగా అనుకున్న తేదీ కంటే ఐదు వారాల ముందుగానే విడుదల చేసేందుకు నిర్ణయించాం. దానికి బాలయ్యబాబు మొదలకుని యూనిట్ అంతా సహకరించారు అని అన్నారు. నిర్మాత ఆనంద్‌ప్రసాద్ మాట్లాడుతూ, ఆడియోలానే సినిమా కూడా భారీ విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తంచేశారు. మోహన్‌బాబు, ఎ.కోదండరామిరెడ్డిల చేతులమీదుగా చిత్రబృందానికి జ్ఞాపికల ప్రదానం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో ఛార్మి, శ్రియ, ముస్కాన్, కైరాదత్, అలీ, అన్నేరవి, గీత రచయితలు భాస్కరభట్ల, పులగం చిన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీకు గుర్తుంటే చాలు...!



మెహరీన్

'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగు తెరకొచ్చిన సుందరి మెహరీన్. తొలి చిత్రంతో ఆకట్టుకున్నా...ఏడాది పాటు అవకాశాల కోసం వేచి చూడాల్సివచ్చింది. ఇక ఇప్పుడు మెహరీన్ నట ప్రయాణంలో కష్టమైన సగం పూర్తయిపోయింది. ఇష్టమైన సగం ప్రారంభమైంది. వరుసగా అవకాశాలు అందుకుంటూ వేగం పెంచిందీ సుందరి. 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ'లో మహాలక్ష్మి పాత్రతో ఆకట్టుకుంది మెహరీన్. కొంత కాజల్ పోలికలతో తెలుగమ్మాయి రూపంతో ఆకర్షించింది. ఫిబ్రవరిలో ఆ సినిమా విడుదలైతే...ఏడాది చివరకు హిందీ సినిమా 'ఫిల్లూరి', తమిళంలో మరో రెండు సినిమాలు దక్కాయి. ప్రస్తుతం తెలుగులో సాయి ధరమ్ తేజ్, రవితేజ లాంటి స్టార్ హీరోల సరసన నటిస్తోంది. ఈ రెండు చిత్రాలు ప్రస్తుతం విడుదలకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 27న సాయి ధరమ్ తేజ్ 'జవాన్', అక్టోబర్ లో రవితేజ 'రాజా ది గ్రేట్' ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. రెండు నెలల్లో వరుసగా తన సినిమాలు విడుదల కావడం మెహరీన్‌కు సంతోషం కలిగించే విషయం. ఇక తన కెరీర్ ప్రోగ్రెస్ గురించి మెహరీన్ మాట్లాడుతూ...'కెరీర్ గురించి ఎప్పుడూ తీవ్రంగా ఆలోచించలేదు. ఇలాగే ఉండాలి, ఆ స్థాయికి వెళ్లాలి అనే ప్రణాళికలు వేసుకోలేదు. సరదాగా మోడలింగ్‌లోకి వచ్చాను. అవకాశాలు వచ్చి హీరోయిన్ అయ్యాను. మంచి అవకాశాలు వస్తున్నాయి. వచ్చినవి వచ్చినట్లు చేసుకుంటూ వెళ్తున్నాను. ఏ భాషలో చేసినా ప్రేక్షకులకు గుర్తుండేలా నటించాలి.' అని చెప్పింది.

సరికొత్తగా ఇగో

రొమాంటిక్, సస్పెన్స్ ఎంటర్‌టైనర్‌గా ఇగో చిత్రాన్ని మలుస్తున్నారు. ఆకతాయి చిత్రం తర్వాత వికెఎ ఫిలిమ్స్ సంస్థ ద్వితీయ ప్రయత్నంగా నిర్మిస్తున్న చిత్రమిది. ఆశిష్‌రాజ్, సిమ్రాన్ హీరోహీరోయిన్లు. సుబ్రమణ్యం దర్శకుడు. విజయ్‌కరణ్, కౌసల్ కరణ్, అనిల్ కరణ్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు షెడ్యూల్స్ చిత్రీకరణ పూర్తయింది. మూడో షెడ్యూల్‌ను గోదావరి పరిసరాల్లో జరిపేందుకు చిత్రబృందం బయలుదేరి వెళ్లనుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, ఇందులో కథానాయకుడి పాత్ర చిత్రణ సరికొత్తగా ఉంటుంది. అనుకున్న దానికంటే ముందుగానే షూటింగ్‌ను పూర్తిచేసి, నిర్మాణానంతర పనుల్లో ఎక్కడా రాజీపడకుండా ప్రేక్షకులకు క్వాలిటీ అవుట్‌పుట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను విడుదల చేయనున్నాం అని తెలిపారు.

ఈ చిత్రంలో ఇంకా దీక్షాపంత్, రావు రమేష్, పోసాని, పృథ్వి, గౌతంరాజు, షకలక శంకర్, చంద్ర, వేణు, శివన్నారాయణ, భద్రం, రైజింగ్ రాజు, గుండు మురళి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: : సాయికార్తీక్, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ జి.కె., ఆర్ట్: ఆర్.కె., ఫైట్స్: నందు.



సిమ్రాన్, ఆశిష్‌రాజ్

కష్టమనే పునాదిపై స్టార్‌డమ్ అనే సౌధాన్ని నిర్మించుకున్న కథానాయకుడు అమిర్ ఖాన్.

ప్రపంచంలో ఏ భాషలోనైనా నటిస్తా

సినిమాల ఎంపికలో మిగతా హీరోలకు అమిర్‌కు స్పష్టమైన తేడా కనిపిస్తుంటుంది. ఏదో వినూత్నత ఉండే కథలనే అంగీకరిస్తాడు ఈ ఖాన్ స్టార్. దాదాపు మూడు దశాబ్దాలుగా బాలీవుడ్ అగ్ర తారల్లో ఒకరిగా వెలుగుతున్నారు అమిర్ ఖాన్. ఈ మధ్య బాలీవుడ్ నాయికా నాయకులు హాలీవుడ్ లోనూ అడుగుపెడుతున్నారు. ఇంగ్లీష్ సినిమాల్లో నటించడంపై అమిర్ ఖాన్ మాట్లాడుతూ..' నాకు హాలీవుడ్ నుంచి చాలా ఆఫర్లు వచ్చాయి. అయితే అవేమీ నన్ను ఆకర్షించలేదు. వాళ్లు నా దగ్గరకు తీసుకొచ్చిన కథలు, క్యారెక్టర్లు ఆకట్టుకునేలా లేవు. మంచి కథ ఉంటే ప్రపంచంలో ఏ ప్రాంత సినిమాలోనైనా నటించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఎక్కడి సినిమాలు చేసినా నా మొదటి ప్రాధాన్యం బాలీవుడ్‌కే. ఎందుకంటే ఇక్కడి ప్రేక్షకులతో నాకు అవినాభావ సంబంధం ఉంది.' అని చెప్పారు. మన హీరోయిన్లు హాలీవుడ్ లో మెరవడంపై అమిర్ స్పందిస్తూ..' దీపికా పదుకొనే, ప్రియాంకా చోప్రా లాంటి వాళ్లు హాలీవుడ్ లో బాగా పేరు తెచ్చుకుంటున్నారు. మన వాళ్లకున్న సత్తాకు వీళ్లు నిదర్శనం' అని సంతోషం వ్యక్తం చేశాడు. అమిర్ ఖాన్ మల్లయోధుడిగా నటించిన గత సినిమా 'దంగల్' ప్రపంచవ్యాప్తంగా పలు బాక్సాఫీస్ రికార్డులను సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమిర్ ఖాన్ 'థగ్స్ ఆఫ్ హిందూస్తాన్' అనే చిత్రంలో నటిస్తున్నారు.



అమిర్ ఖాన్

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ



పూసర్ల వెండి సింధు

చిన్ననాటి సింధు

పూసర్ల వెంకట సింధు.. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో వెండి పతకం గెలిచి ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించిన తెలుగు తేజం.. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అరుదైన హ్యాట్రిక్ పతకాలతో చరిత్రను తిరగరాసింది. 2013, 2014 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో కాంస్యాలు గెలిచిన సింధు.. తన మాటను నిలబెట్టుకుంటూ 2017లో పతకం రంగు మార్చింది. మరో స్టార్ సైనా మాత్రమే 2015లో రజతాన్ని, 2017లో కాంస్యం గెలుచుకుంది. ఆదివారం రాత్రి హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు 19-21, 22-20, 20-22 తేడాతో జపాన్ షట్లర్ నొజుమి ఒకుహర చేతిలో ఓడింది.

- ప్రపంచ చాంపియన్ షిప్ ఫైనల్లో పోరాడి ఓడిన తెలుగు తేజం
- వెండి పతకం కైవసం
- హ్యాట్రిక్ పతకాలతో చరిత్ర



2013 ప్రపంచ చాంపియన్ షిప్‌లో కాంస్యంతో..

గ్లాస్గో: ప్రపంచ చాంపియన్ షిప్‌లో తొలిసారి ఫైనల్ చేరిన తెలుగుతేజం సింధు.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో పోరాడి ఓడింది. సెమీస్‌లో సైనాపై గెలిచిన ఒకుహర.. సింధుకు పసిడి దక్కకుండా అడ్డుపడింది. ఐతే సైనా, సింధు ద్వారా దేశానికి రెండు పతకాలు రావడం ఇదే తొలిసారి. ఆదివారం అర్ధరాత్రి 2.30కి కాని సెమీఫైనల్ మ్యాచ్ పూర్తి కాకపోవడం సింధు ఆటపై ప్రభావం చూపింది. 17 గంటల్లోనే తిరిగి ఆమె కోర్టులో అడుగుపెట్టాల్సి వచ్చింది. ఇద్దరు షట్లర్లు శక్తి మేరకు పోరాడారు. సుదీర్ఘంగా ర్యాలీలు ఆడారు. తొలి గేమ్‌లో తొలి పాయింట్‌ను ఒకుహర స్కోరు చేసింది. తర్వాత సింధు 2-1 ఆధిక్యంలోకి దూసుకుపోయింది.విరామ సమ యానికి సింధు 11-5 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఐతే కోర్టులు మారిన తర్వాత ఒకుహర విజృంభించింది. ఓ దశలో ఇద్దరు 19-19తో నిలి చా రు. ఆ దశలో షటిల్‌ను సింధు నెట్‌కు కొట్టడంతో పాయింట్ కోల్పోయింది. తర్వాత షటిల్‌ను దూరంగా కొట్టడంతో గేమ్ ఒకుహర వశమైంది.

పోరాడి గెలుపు

రెండో గేమ్‌లో సింధు పోరాటపటిమను ప్రదర్శించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ గేమ్‌ను ఆమె చివరకు 22-20తో గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు, ఒకుహర తీవ్రంగా పోరాడారు. ఆదిలోనే 5-1 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఓ దశలో ఇద్దరు 11-11తో సమంగా నిలిచారు. ఆ తర్వాత కూడా నువ్వానేనా అన్నట్లు పోరాడి ఆధిక్యంలో స్వల్ప తేడాతో చివరికంటూ వచ్చారు. 19-19తో ఉన్న దశలో అనవసర తప్పిదంతో సింధు.. ప్రత్యర్థికి తొలి చాంపియన్ షిప్ పాయింట్ ఇచ్చుకుంది. కానీ సింధు సంయమనంతో మరో పాయింట్ సాధించి 20-20తో సమం చేసింది. కానీ మరోసారి షటిల్‌ను నెట్‌కు కొట్టి రెండో సారి చాంపియన్‌షిప్ పాయింట్‌ను ఇచ్చుకుంది. ఈసారి పొరబడకుండా ఒకుహర గేమ్‌ను మ్యాచ్‌ను 22-20 గెలుచుకుంది.

సెమీస్‌లో సునాయాసంగా

సెమీఫైనల్‌లో సింధు సునాయాసంగా విజయం సాధించింది. భారత కాలమానం ప్రకారం గ్లాస్గోలో శనివారం అర్ధరాత్రి అద్భుత ప్రదర్శన చేసిన ఆమె 21-13, 21-10 తేడాతో చైనా షట్లర్ చెన్ యుఫీని మట్టికరిపించింది. ప్రపంచ నెంబర్ 4 సింధు నిదానంగా తన పోరును ఆరంభించి 48 నిమిషాల్లో మ్యాచ్‌ను కైవసం చేసుకొని ఫైనల్లో అడుగుపెట్టింది. 19 ఏళ్లసైనా షట్లర్‌తో జరిగిన సెమీస్ పోరులో సింధు సుదీర్ఘ ర్యాలీలు ఆడింది. తొలి గేమ్‌లో 3-3తో సమంగా ఉన్నపుడు సింధు పొరపాటు షాట్ కొట్టడంతో చెన్ సుదీర్ఘంగా సాగిన ఓ ర్యాలీని గెలుచుకుంది.

తర్వాత మ్యాచ్‌పై పట్టు బిగించింది. 9-8 ఆధిక్యం సాధించింది. ఓ స్మాష్ షాట్‌తో ప్రత్యర్థిని తేరుకునే లోగానే మరో పాయింట్ సాధించింది. అనంతరం మరో డ్రాప్ షాట్‌తో సింధు 11-8 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఆరంభంలోనే ర్యాలీలతో దూకుడు పెంచిన ఆమె ఖచ్చితమైన షాట్లతో చెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. డ్రాప్ షాట్లు, స్మాష్‌లు గుప్పించింది. ప్రత్యర్థికి కొరుకుడుపడని ఆటతో 13-8 ఆధిక్యంలోకి వెళ్లింది. ఓ దశలో ఇద్దరు పాయింట్లు సాధించడంతో స్కోరు 15-9కి వెళ్లింది. బేస్‌లైన్ వద్ద అంచనా తప్పడంతో సింధు కొన్ని పాయింట్లను ప్రత్యర్థికి కోల్పోయింది. అయినా ఆమె 19-13 ఆధిక్యంలోకి దూసుకుపోయిం ది. మరోసారి సుదీర్ఘ ర్యాలీ సాగి సింధు ఏడు గేమ్ పాయింట్లతో గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో కూడా సింధు దూకుడు కొనసాగించింది.

ఆదిలోనే 4-0 ఆధిక్యంలోకి వెళ్లింది. చెన్ ఒత్తిడిలో పొరపాట్లు చేసింది. కాక్‌ను పదేపదే దూరంగా కొట్టింది. అదే అదనుగా సింధు 8-0 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. దీంతో ఆమె మరింత సహనంతో ఆడి ర్యాలీలతో, కార్నర్ షాట్లతో చెన్‌ను ఊపిరితీసుకోకుండా చేసింది. 11-1 ఆధిక్యం సాధించింది. అదే ఊపులో 15-3 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ప్రత్యర్థిపై ఒత్తిడి కొనసాగిస్తూ ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లతో గేమ్‌ను 21-10తో గెలుచుకుంది.



రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన ఆనందంలో...



2014 ప్రపంచ చాంపియన్ షిప్‌లో కాంస్యంతో..

పల్లెకెలెలోనే పట్టేశారు



- మూడో వన్డేలో భారత్ విజయం
- సిరీస్ కైవసం
- రోహిత్ అజేయ శతకం
- మళ్లీ సత్తా చాటిన ధోని
- లంక వెన్నువిరిచిన బుమ్రా

భారత్ మరోసారి సాధికారంగా ఆడింది. ధావన్ నుంచి బాధ్యతలను తీసుకున్నట్లు ఓపెనర్ రోహిత్ అజేయ శతకంతో చెలరేగిపోయాడు. ధోని మరోసారి రాణించి అజేయ అర్ధసెంచరీతో భారత్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. వెంటవెంటనే నాలుగు వికెట్లు పడినా తొట్రుపాటుకు గురికాకుండా వీరిద్దరు కలిసి జట్టును విజయతీరాలకు చేర్చారు. మూడో వన్డేలో 6 వికెట్ల విజయంతో సిరీస్‌ను భారత్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో గెలుచుకుంది. లంక ముందుగా 50 ఓవర్లలో 9 వికెట్లకు 217 స్కోరు చేయగా.. భారత్ 45.1ఓవర్లలో 218 పరుగులు చేసి గెలిచింది. టెస్టుల్లో చరిత్రాత్మక ఇన్నింగ్స్ విజయం సాధించిన పల్లెకెలలోనే కోహ్లి సేన వన్డే సిరీస్‌నూ గెలుచుకోవడం విశేషం. లంకకు మరోసారి నిరాశే ఎదురైంది. లంకను అల్లల్లాడించిన బౌలర్ బుమ్రా(5-27)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. నాలుగో వన్డే 31న కొలంబోలో జరుగుతుంది.

పల్లెకెలె: లంక నిర్దేశించిన 218 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడానికి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌ను ఆదిలోనే అనుభవశాలి మలింగ (1-25) దెబ్బతీశాడు. ధావన్ (5) విఫలమయ్యాడు. మలింగ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులకు స్వస్తి పలికి వన్‌డౌన్లో సారధి విరాట్ (3) దిగినా ఫలితం లేకపోయింది. అతను ఫెర్నాండో (1-35) బౌలింగ్‌లో రెండంకెల స్కోరైనా అందుకోకుండా ఔటయ్యాడు. ఓ పక్క రోహిత్ (124 నాటౌట్, 145 బంతుల్లో, 16 ఫోర్లు, 2 సిక్స్) సహనంతో ఆడుతున్నా తోడ్పాటు ఇచ్చేవారు లేకపోయారు. తర్వాత రాహుల్ (17) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. రోహిత్‌తో కలిసి 42 పరుగులు జోడించి మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. మరో యువ ఆటగాడు జాదవ్ డకౌట్ కావడంతో లంక ఆటగాళ్లలో ఆనందం వెల్లివిరిసింది. అప్పటికి భారత్ స్కోరు 61-4. ఆ దశలో క్రీజులోకి వచ్చిన ధోని (67 నాటౌట్, 86 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్స్) తన అనుభవాన్ని రంగరించి మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. రెండో వన్డేలో మాదిరిగానే క్రీజులో పాతుకుపోయి రోహిత్‌కు కావలసిన తోడ్పాటునందించాడు.అడపాదడపా బౌండరీలు బాదుతూ 45.1 ఓవర్లలోనే పని ముగించారు. రోహిత్ 2, ధోని ఓ సిక్స్ సాధించారు.

బుమ్రా దెబ్బకు లంక బెంబేలు: టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన లంక బ్యాట్స్‌మెన్‌ను భారత పేసర్ బుమ్రా తన పదునైన బంతులతో, మెయిడెన్ ఓవర్లతో బెంబేలెత్తించాడు.అతని దెబ్బకు లంక 110 పరుగులకే చివరి 6 వికెట్లు చేజార్చుకుంది. అర్ధసెంచరీ సాధించిన తిరిమానె ఒంటిరి పోరాటం చేశాడు. మాథ్యూస్‌లో కలిసి 38, కపుగెదెరతో కలిసి 21 పరుగులు జోడించిన తర్వాత తిరిమానె.. బుమ్రా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అప్పటికి లంక స్కోరు 159-5. అంతకుముందు మాథ్యూస్ (11)ను జాదవ్ ఔట్ చేశాడు. కెప్టెన్ కపుగెదెర (14)ను ఆరో వికెట్‌గా అక్షర్ పటేల్ వెనక్కి పంపారు. చివర్లో బుమ్రా మరోసారి విజృంభించి సిరివర్ధన (29), దనంజయ (2)లను పెవిలియన్ దారి పట్టించాడు.

సోర్కు బోర్డు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్వెల (ఎల్బీ) (బి) బుమ్రా 13, చండిమాల్ (సి) బుమ్రా (బి) పాండ్య 36, కుశాల్ (సి) రోహిత్ (బి) బుమ్రా 1, తిరిమానె (సి) జాదవ్ (బి) బుమ్రా 80, మాథ్యూస్ (ఎల్బీ) (బి) జాదవ్ 11, కపుగెదెర (బి) అక్షర్ 14, సిరివర్ధన (బి) బుమ్రా 29, దనంజయ (బి) బుమ్రా 2, చమీర రనౌట్ (ధోని, భువనేశ్వర్) 6, ఫెర్నాండో నాటౌట్ 5, మలింగ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 19, **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 217.**

వికెట్ల పతనం: 1-18 (డిక్వెల), 2-28 (కుశాల్), 3-100 (చండిమాల్), 4-138 (మాథ్యూస్) 5-159 (తిరిమానె) 6-181 (కపుగెదెర) 7-191 (దనంజయ) 8-201 (సిరివర్ధన) 9-210 (చమీర).

బౌలింగ్: భువనేశ్వర్ 9-2-41-0, బుమ్రా 10-2-27-5, చహల్ 10-0-49-0, పాండ్య 8-0-42-1, అక్షర్ 10-1-35-1 జాదవ్ 3-0-12-1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ నాటౌట్ 124, ధావన్ (బి) మలింగ 5, కోహ్లి (సి) చమీర (బి) ఫెర్నాండో 3, రాహుల్ (సి) తిరిమానె (బి) దనంజయ 17, జాదవ్ (ఎల్బీ) (బి) దనంజయ 0, ధోని నాటౌట్ 67, ఎక్స్‌ట్రాలు 2, **మొత్తం (45.1 ఓవర్లలో 4 వికెట్లకు) 218**

వికెట్ల పతనం: 1-9 (ధావన్), 2-19 (కోహ్లి), 3-61 (రాహుల్) 4-61 (జాదవ్)

బౌలింగ్: మలింగ 5-0-25-1, ఫెర్నాండో 8.1-2-35-1 చమీర 10-1-59-0, మాథ్యూస్ 3-0-17-0, దనంజయ 10-0-38-2, సిరివర్ధన 9-0-43-0.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.